# కేశాలంకరణము



మలబారు దేశపు నాయరుస్త్రీల
కేశాలంకరణము—190 ఏళ్లక్రితం.

## భారత భూమిలో

ప్రాచీన భారతీయ అలంకరణలు ఈనాడు పాశ్చాత్యదేశాలలో పునరుద్ధరణ పొందుతున్నాయి. అనేకరకాల ప్రాచీన భారత కేశాలంకరణలు ఇప్పుడు అమెరికాలో.... ప్రత్యేకించి హాలీవుడ్‌లో.... అనుసరించబడుతున్నాయి.

మన దేశంలో స్త్రీలు తమ కేశసౌందర్యానికి స్వస్తిక్ ఫెర్‌ఫ్యూమ్డ్ కేస్టరాయిలుతో జతపరుస్తున్నారు.

కాంతి వగైరా సబ్బులూ, స్వస్తిక్ షేవింగ్ స్టిక్, బట్టల సబ్బులూ, గొల్లభామ మార్కు వనస్పతి మొదలగు నాణ్యమైన స్వస్తిక్ తయారీలుకూడా కలవు.

# స్వస్తిక్ ఫెర్‌ఫ్యూమ్డ్ కేస్టరాయిల్

నాణ్యమునకు సాటిలేనిది.

## స్వస్తిక్ ఆయిల్ మిల్సు లిమిటెడ్.

## వడాలా, బొంబాయి.

సేల్సు డిపో:- నెం 14. జి. ప్రిన్సెస్ వీధి (లాన్ స్క్వేర్) మద్రాసు.

## ఈ సంచికలో కొందరు రచయితలు

విశ్వనాథ — రామకృష్ణ

చలం — రాజేన్‌బాబు

నార్ల — చాణక్య

గోపీచంద్ — కృష్ణమూర్తి

మొదలైనవారు.

# ఆంధ్రజ్యోతి

ఆఫీసు : 37 ఆచారప్పన్ వీధి, మద్రాసు. 1.

సాలు చందా 5—8—0

# ఆంధ్రజ్యోతి

విడి ప్రతి 0—6—0

(సచిత్ర మాసపత్రిక)

ఆంధ్రజ్యోతి దీపావళి, సంవత్సరాది సంచికలను రిజష్టరు ఖర్చులనుగాను 0-8-0 చందా పెంచాము. చందాదారులకు సంచికలు నమ్మకంగా చేరుతవి. చందాదారులు వుత్తర ప్రత్యుత్తరాలు జరిపేటప్పుడు తమ చందాదారు నెంబరు ఉదహరించాలి. లేనిచో జవాబు ఇవ్వటం కష్టమని గ్రహించ ప్రార్థన.

'ఆంధ్ర జ్యోతి' 37, ఆచారప్పన్ వీధి, జి. టి. మదరాసు.

★ సంక్రాంతికి ★

ఆంధ్ర దేశ ముఖ్య కేంద్రాలలో విడుదల !




RAJAM K. SRINIVASAN,

**75, Pondy Bazaar, Thyagarayanagar, MADRAS.**

................................ *Bookings for Andhra* : ................................

**Poorna Pictures, BEZWADA.**

# బిటాలాక్స్




చాక్లెట్ భేదిమాత్రలు

సుఖవిరేచనౌషధము.

ఇది చాక్లెట్ భేదిమాత్రలు. సుఖవిరేచనము కలిగించి మలబద్ధమును పోగొట్టి మంచి జీర్ణశక్తి నిచ్చును.

పొట్లం రెండు బిళ్లలు **1** అణా.

అన్నిచోట్ల దొరకును.

తయారుచేయువారు :

*Stockists* :— **M/S DADHA & CO, P. T. MADRAS.**

*Ceylon Agent* :—**M. K. KAPADIA, 100, Secona Cross Street, COLOMBO.**

*Manufactured by*:—**BOMBAY TABLET MANUFACTURING CO., Post Box No. 2092, BOMBAY. 2.**

# ఈస్ట్ అండ్ వెస్ట్

## ఇన్సూరెన్సు కంపెనీ, లిమిటెడ్, బొంబాయి.

**[1913 లో స్థాపితం]**

ప్రధాన కార్యాలయం :
'ఈస్ట్ అండ్ వెస్ట్ బిల్డింగ్', ఫోర్టు, బొంబాయి.

33 సంవత్సరాలుగా దేశసేవచేస్తూ జాతీయోన్నతి పెంపొందిస్తూ ఉన్న ప్రముఖ భారతీయ భీమాసంస్థ.

చైర్మెన్:
డా|| ఆర్. ఎం. అళగప్ప చెట్టియార్,
కెటి., ఎం. ఎ., డి. లిట్., యల్. యల్. డి. బార్-అట్-లా.

ఆర్థికంగా సుస్థిరమై, పాలసీదార్లతోనూ, ఏజంట్లతోనూ వ్యవహరించుటలో సంస్కారానికి పేరెన్నికగన్న సంస్థ.

**1944 లో జరిపిన అదనపువ్యాపారం కోటిరూపాయలు మించింది.**

చురుకైనటువంటిన్నీ, పలుకుబడి కలిగినటువంటిన్నీ వ్యక్తులు ఏజన్సీలకొఱకు దరఖాస్తులు పెట్టుకోవచ్చును.

శ్రీ జె. యస్. రెడ్డి
బ్రాంచి సెక్రటరీ.,
377, ఎస్ప్లనేడ్,
మద్రాసు.

వివరాలకు:

శ్రీ ఎ. వెంకటరెడ్డి
ఇన్స్పెక్టర్ ఆఫ్ ఏజన్సీస్,
మోదుకూరు, వయా—పొన్నూరు,
గుంటూరు జిల్లా.

చలనచిత్ర రంగమునకొక కానుక!

శ్రీ వెంకట్రామా పిక్చర్సు వారి



# బ్రహ్మరధం

కవి: బలిజేపల్లి, నృత్యం: వెంపటి, స్టూడియో : శోభనాచల.

దర్శకుడు: చిత్రపు నారాయణమూర్తి, బి. ఏ.

* అద్దంకి; * పారుపల్లి; * జయమ్మ; * సరోజ; * అనసూయ నటించినది.

ఆంధ్ర: పూర్ణా పిక్చర్సు, బెజవాడ.

దత్తమండలములకు: మల్లిఖార్జున పిక్చర్సు, నంద్యాల.

నైజాము: దక్కన్ ఫిలిం డిస్ట్రిబ్యూటర్సు, హైద్రాబాద్.

వివరములకు :— టి. పి. సుందరం, బాలాజినగర్ రాయపేట, మదరాసు.

ఆమెకు





రోగమునుండి తేరుకొనునపుడు

అతనికి



క్షీణదశయందున్నప్పుడు



వారికి



వారు పెరుగుతున్నప్పుడు

# వీటోఫెర్రిన్

I·T·L

వీటో ఫెర్రిన్ దివ్యమైన సర్వసాధారణ టానిక్కు. దీనిలో 'ఏ డి. విటమినులు, ఇనుము, ఇంకా ఆరోగ్యదాయకములైన తదితర ఖనిజములు ఉన్నవి. దీనికి మధురమైన రుచి ఉన్నది.

వెల్లింగ్ ఏజెంట్లు: బెస్ట్ అండ్ కంపెని, లిమిటెడ్., పి.బి.నెం. 63 మద్రాసు.

# "శ్రీ విస్ - ఆమ్లా"

## త ల నూ నె

తలయందలి చుండు, గుల్లలును
పోగొట్టి కురులను నిడుపుగాను
మృదువుగాను పెంపొందించును.
దీని యందు పరిమళము,
గుణము రెండును కలవు.





**S. VISWANADHAM & CO**
**44, BUNDER ST. G.T. MADRAS**

ఆంధ్రజ్యోతి

.....సచిత్ర మాస పత్రిక......

సంపాదకుడు : చక్రపాణి

సంపుటి 7] 1 జనవరి 1947 [సంచిక 1

# ప్ర భు వు

నలినీ, రజనీ, పోట్లాడుకొన్నారు, పైని కొట్టుకొన్నారు, వారలు పుట్టినట్టి
దాది మిత్రులు పోట్లాడినట్టి హేతు విద్దఱను నొక్కరికి లాభమింత లేదు.

నలిని రజనితో నిట్టులన్నాడు తుదకు నదియు నెటులైన మనకేమిరా! వివేక
హీనులమటంచు నవ్వెనుగాని, రజని మొగములోనఁ బ్రసన్నత పుట్టలేదు.

నలినీ, పాపము, రజని మనస్సు సుప్రసన్నముగఁ జేయనొక వందసార్లు నాలు
గేండ్లు పైగాఁ బ్రయత్నము లెన్నొచేసె, రజని గుండియ స్నిగ్ధమైరాదు మరల.

నలిని తానెంతొ నొచ్చుకొన్నాడు: చివరి కతని బాధతీర్చెను నిజమైన మాట
చెప్పియొక్కఁడు 'నీ మంచిచేత నీవు తెలియఁజాలవుగాని ఆతీరు వినుము.

తనమాట నెగ్గవలెనని యనుటే పరమార్థ మొకని కాతడు సఖ్యం
బని ధర్మంబని న్యాయంబని యెంచడు ప్రభువు 'రజని' యట్టిడటంచున్.

విశ్వనాథ సత్యనారాయణ

# రాజ్యాంగ సభ గురించి

....రాజకీయంగానూ, ఆర్థికంగానూ, సైనికంగానూ బ్రిటిషువారికి భారతదేశంమీద గల అధికారాన్ని తొలగించి దేశాన్ని స్వాతంత్ర్యయుతం చేయడానికిగాను ఈ రాజ్యాంగ సభ ఏర్పడింది. ఇది జయప్రదంగా జరిగినట్టయితే ఇంత మహత్తర అధికార విసర్జన ఇంత అహింసాయుతంగా జరగడానికి మానవచరిత్రలో సామ్యం ఉండదు....

"........1579 లో మనదేశంలో ఒక క్రైస్తవమిషనరీ అడుగుపెట్టాడు. మనదేశానికి బ్రిటిషువాడు రావటం అదే ప్రథమం. అతని వెనుక అనేకమంది బ్రిటిషువర్తకులు వ్యాపారార్థం వచ్చి పాలకులుగా నిలిచిపోయినారు. 1765 లో అధికారం యావత్తూ ఈస్టిండియా కంపెనీవారిచేతి కివ్వబడింది. అటుపిమ్మట అధికారం క్రమంగా పార్లమెంటు పరమయిపోయి. సెసిల్‌రోడ్స్ అనే ఒక సామ్రాజ్యనిర్మాత చెప్పినట్లు 'ధర్మం చెయ్యవచ్చు నూటికి అయిదు లాభం చొప్పున' అనే సూత్రంమీద నేటివరకూ మనదేశం పరిపాలించబడుతూ వుంది.

"........బ్రిటిషు పరిపాలనకు అసమ్మతి ఎప్పుడూ వుంటూనే వచ్చింది. ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ ఏర్పడ్డతరవాత ఈ అసమ్మతికి ఒక స్వరూపం ఏర్పడింది. మహాత్మా గాంధీ రాకపూర్వం కాంగ్రెసు సౌమ్యమార్గాలే అవలంబిస్తూ వచ్చింది, అటుతరవాత తీవ్ర వైఖరి అవలంబించింది. 1930 లో కాంగ్రెసు సంపూర్ణ స్వాతంత్ర్య తీర్మానం చేసింది. ఆ తీర్మానాన్ని అమలుజరపడానికి మనమిక్కడ సమావేశమైనాము.

"........బ్రిటిషువారు అనుభవానికి లొంగేవారే తప్ప జ్ఞానానికి లొంగేవారుకారు. లార్డు పామర్‌స్టన్ అన్నాడు: "మీకు శాశ్వతమైన కోర్కెలే తప్ప శాశ్వతమైన తాత్వికసూత్రాలు లేవు"...వారు ఏ వైఖరి అవలంబించినప్పటికీ మనస్ఫూర్తిగా అధికార విసర్జనమటుకు చేయరు, పరిస్థితు లనుకూలించక చేయవలసిందే గాని....

"........బ్రిటిషువారు మనదేశంలో మత ప్రాతినిధ్యసూత్రాన్ని అమలులోకి తెచ్చి ప్రజలలో విభజన ఏర్పరిచారు. ఇందువల్ల బ్రిటిషువారి నైతికబాధ్యతకు భంగం కలుగుతుందనీ, దీని ద్వారా రాజకీయ వాతావరణంలో ప్రవేశించే విషం అంతర్యుద్ధంతో తప్ప నివారణకాదనీ అధికారులకు బ్రిటిషు వైజ్ఞానికులు చెప్పారు. వారుచెప్పిన ముక్క నేడు ఏ విధంగా రుజువవుతున్నదీ మనము చూస్తున్నాము...

"కాబినెట్ ప్లానుగురించి ఇటీవల బ్రిటిషు అధికారవర్గ ప్రకటనచూస్తే అధికారత్యాగం చెయ్యడం మానవతత్వాని కెంత విరుద్ధమో తెలుస్తుంది. ఒకపక్షంమీద మరోపక్షాన్ని పురిగొల్పడం గొప్పజాతియొక్క లక్షణంకాదు. ఇందువల్ల మనదేశానికీ బ్రిటనుకూ మధ్య మనస్పర్ధలుమాత్రమే పెరుగుతాయి. ఏ పనిచేసినా అందులో కొంత సౌజన్యం వుండాలనే సంగతి వారు గ్రహించలేదు.

"........ఈసభ తయారుచేసే రాజ్యాంగ ప్రణాళిక ఈ దేశంలోవుండే అందరి ఆదర్శాలూ, ఆశయాలూ, కోరికలూ సాధించదగినదై వుంటుంది. ఈ గొప్ప దేశంలోని అందరి అనుమతితోటీ,

అందరి హక్కులనూ పాటించుతూ ఇది తయారుకావాలి. మనమధ్య గోడలేర్పడ్డాయి. ఈ గోడలు పడగొట్టి ఒకరి పరిచయం ఒకరు చేసుకోవాలి........

"........ఇందులోకి ముస్లిము ప్రతినిధులు రాక ఎడంగావుండటం చాలా శోచనీయం. ఈ అవాంతరం త్వరలో తొలగిపోతుందని విశ్వసించుదాము. ఏమంటే ఈసభ నిర్మించబోయే ప్రణాళికకు వారి సహకారం అత్యవసరం. మన ఆకలీ, మన దారిద్ర్యమూ, మన అనారోగ్యమూ మనవిమాత్రమే కావు. అందరివీనూ. మన మనోవ్యాధులు చూడండి. ఆత్మగౌరవం లేకపోవడమూ, బానిసబుద్ధీ, సంకుచితత్వమూ, దాస్యావమానమూ—ఇది హిందువులనూ, ముస్లిములనూ, రాజులనూ, రైతులనూ సమంగా పీడిస్తున్నవే. కొందరివి సువర్ణశృంఖలాలు కావచ్చు. కాని శృంఖలాలు మటుకవును. తాము ఈ దేశంలో బానిసలనే విషయం రాజులు తెలుసుకోవాలి. భూమ్యాకాశాల సాక్షిగా వీరంతా ఒక ప్రజ. అందరు ప్రజలకూ విద్యా, సాంఘిక ఆర్థికసౌకర్యాలూ ఏర్పడేలాగూ, వివిధ సంస్కారాలకు స్వేచ్ఛ వుండేలాగూ, అందరి హక్కులూ సంరక్షించబడేలాగూ రాజ్యాంగ ప్రణాళిక నిర్మాణం కావాలనేది అందరూ కోరాలి. ఈ ప్రణాళిక నిజమైన ప్రజాస్వామ్యాన్ని సాధించి, రాజకీయ స్వాతంత్ర్యంతోపాటు న్యాయమైన ఆర్థిక స్వాతంత్ర్యాన్నికూడా సాధించి దేశంలోవున్న ప్రతివ్యక్తీ తన దేశాన్ని గురించి గర్వించేలాగు చేస్తుంది....

"........జాతుల, మతాల అవిభిన్నత్వంమీద దేశం ఆధారపడదు. అది చలించినటువంటి, అనాదిగావచ్చే జీవితవ్యవస్థమీద ఆధారపడుతుంది. అటువంటి వ్యవస్థ ఈ గడ్డలోనేవున్నది. గంగావాహినివలె, హిమాలయాలవలె ఇది మనకు చిరస్థాయిగావున్నది. సింధూ నాగరికత నాటినుంచీ ఇది వేళ్లతన్ని ఈ నాటికికూడా పెరుగుతూ వస్తున్నది. హిందువులూ ముస్లిములూ కూడా దీనికి ప్రతినిధులుగా వున్నారు. సహృదయతా, ధర్మమూ ఇవి మన ఆదర్శాలు. మన దేశం ఎన్నడూ మతక్రౌర్యవిధానం అవలంబించలేదు. ఇక్కడికి వచ్చిచేరిన పార్సీలనుగాని, యూదులనుగాని, క్రైస్తవులనుగాని, ముస్లిములనుగాని తమతమమతాలు విసర్జించి మనతో సమానంగా హిందూధర్మం అవలంబించమని నిర్బంధించలేదు. ఎవరి విశ్వాసాలు వారి కెక్కువ అనే సిద్ధాంతాన్ని ఈ దేశం ఎప్పుడూ పాటించింది. అయిదారువేల సంవత్సరాలుగా ఆచరణలోవున్న ఈ ఆదర్శాన్ని ఈ ప్రతినిధులంతా పాటించినట్లయితే ఇప్పుడు మన నెదుర్కొన్న తీవ్రసమస్య, అదివరలో మనచరిత్రలో కలిగిన అసంఖ్యాక సమస్యలలాగే, పరిష్కారం అవుతుందని నా విశ్వాసం... ....

"........కాంగ్రెసుపుట్టిన అరవై సంవత్సరాలకు సరిగా ఈ రాజ్యాంగసభ పుట్టింది.... ఈదేశాన్ని స్వతంత్రం చేయడానికి త్యాగంచేసిన మహనీయులను మనం స్మరించాలి. ఈ దినం రావడానికిగాను సహస్రసంఖ్యాకులు ప్రాణాలర్పించారు. ఇంకా హెచ్చుమంది అనేక ఇక్కట్లుపడ్డారు, జైళ్ళకువెళ్ళారు, దేశాంతర్గతులై పోయినారు. వారందరి త్యాగంమీదనే ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ నిర్మించబడింది........సింధూ నాగరికతనాటి శివుడి లగాయతు నేటి మహాత్మాగాంధీ, రాజేంద్ర బాబులవరకూ వచ్చిన సౌజన్యమూ, సౌహార్దమూ, సఖ్యతా ఈ సభను ఆవహించుగాక!"

—రాధాకృష్ణ




"ప్రపంచ విముక్తికి మిత్రరాజ్యసమితి ఒక్కటే శరణ్యం"—ఇది ఇటీవలనే బ్రిటిష్ విదేశాంగ మంత్రి మిస్టర్ ఎర్నెస్ట్‌బెవిన్ చేసిన ఉద్ఘాటన.

న్యూయార్క్‌లో జరిగిన మిత్రరాజ్యసమితి సమావేశానంతరం ఆ సమావేశంలో జరిగిన కృషిని సమీక్షిస్తూ, అతడు ఈ ఉద్ఘాటనను చేశాడు.

ప్రపంచ రాజకీయవేత్తల మధ్య నేడు ఏ ఒక్క సమస్యపైకూడా ఏకాభిప్రాయం కానరాక పోవచ్చు. కాని, ప్రపంచ విముక్తికి—యుద్ధప్రమాదంనుంచి విముక్తికని తాత్పర్యం—మిత్రరాజ్యసమితి ఒక్కటే శరణ్యమనే విషయంలోమాత్రం వారిలో విభిన్నాభిప్రాయం లేనేలేదు.

ప్రథమ, ద్వితీయ ప్రపంచమహా సంగ్రామాలకు మూలకారణాలైనవాటిలో ఒక్కటైనా ఈ నాటికీ తొలగిపోలేదు. అంచేత ప్రపంచయుద్ధప్రమాదం ఇదివరలో ఎంత కలదో, ఇప్పుడుకూడా అంతే కలదు. నిజానికి అంతకంటె మిన్నగాకూడా కలదేమో ! ఒకదేశంకంటె మరో దేశం—ఒకజాతికంటె మరొకజాతి—అత్యధిక శక్తిసంపన్నం కావడమే యుద్ధకారణాలలో ముఖ్యమైనట్టిది. తనతోటిరాజ్యాలకంటె అత్యధిక శక్తిసంపదను కూర్చుకొనగలిగినట్టి దానికి, ఆ శక్తిసంపదతో తక్కిన రాజ్యాలను జయించాలనే దుష్టవాంఛ జనించవచ్చు. ఇట్టి వాంఛ దానికి లేకపోయినా; దాని శక్తిసంపదే తక్కిన రాజ్యాలలో భయసందేహాలను—లేదా, అసూయను—రేకెత్తించి, వాటినన్నింటిని ఏకంచేయడమేమి, వాటిని యుద్ధానికి పురికొల్పడమేమి సంభవించవచ్చు. ఇందుకు చరిత్రలో నిదర్శనాలు అనేకం. నెపోలియన్ నాయకత్వంకింద ఫ్రాన్సు అతి శక్తిసంపన్నమైనది కావడమే, ఫ్రాన్సుకు విరుద్ధంగా యూరప్ ఏకంకావడానికి కారణం. తూర్పు, దక్షిణయూరప్‌లో రష్యా ప్రాబల్యం అంతకంతకు అధికం కావడమే, దానికి విరుద్ధంగా నిలిచి, బ్రిటన్, ఫ్రాన్సు, టర్కీలు క్రిమియన్ యుద్ధాలను జరపడానికి కారణం. మొదట కెయిజర్ నాయకత్వంకింద, తర్వాత హిట్లర్ నాయకత్వంకింద జర్మనీ అత్యధిక బలోపేతమైన రాజ్యంకావడమే ప్రథమ, ద్వితీయ ప్రపంచమహా సంగ్రామాలకు కారణం. యుద్ధానికి దారితీసే ఈ యుద్ధకారణం ఈనాడు మరింత బలీయంగా కానవస్తున్నది. మిస్టర్ బెవిన్ మొన్న తన సమీక్షలో పేర్కొన్నట్టు, ద్వితీయ ప్రపంచమహా సంగ్రామ ఫలితంగా రెండురాజ్యాలు ప్రపంచ మొత్తంపై అత్యంత శక్తిసంపన్నమైనవిగా పరిణమించినవి. వీటిలో మొదటిది,—యునైటెడ్ స్టేట్సు, రెండవది,—సోవియెట్ రష్యా. ఈ రెండురాజ్యాల రాజకీయవిధానాలు విరుద్ధమైనవి; ఆర్థికవ్యవస్థలు విరుద్ధమైనవి; సాంఘికలక్ష్యాలు విరుద్ధమైనవి;

జీవితదృక్పథాలే విరుద్ధమైనవి. అందువల్ల ఇదివరలోకంటె ఇప్పుడే యుద్ధప్రమాదం వాస్తవానికి ఎంతైనా అధికమైనట్టిది.

ఈ యుద్ధప్రమాదాన్ని పూర్తిగాగాని, శాశ్వతంగాగాని తొలగించగలిగినా, లేకపోయినా, కనీసం దీన్ని కొంతకాలంపాటైనా వారించగలిగింది మిత్రరాజ్యసమితి మాత్రమే. అందువల్లనే ట్రూమన్, స్టాలిన్, అట్లీలేమి, బరన్స్, మొలటావ్, బెవిన్‌లేమి "ప్రపంచ విముక్తికి మిత్రరాజ్యసమితి ఒక్కటే శరణ్యం" అని ఉద్ఘాటించడం సంభవిస్తున్నది.

ఇందరు ఇంతగా ఆశపెట్టుకున్న మిత్రరాజ్యసమితి కొంతవరకైనా ఆ ఆశను ఫలింప చేస్తుందా ?

ఈ ప్రశ్నకు "బహుశా" అని ప్రత్యుత్తరం చెప్పడానికి మిత్రరాజ్యసమితి న్యూయార్క్ సమావేశం కొంత అవకాశమిచ్చినదని చెప్పవచ్చు.

* * *

మిత్రరాజ్యసమితి న్యూయార్క్ సమావేశం విషయమై ప్రస్తావించే సందర్భంలో నేటి రాజకీయవ్యాస రచయితలే కాకుండా, భావిప్రపంచ చరిత్రకారుడుకూడా ఓంప్రథమంగా పేర్కొనేది.—దక్షిణాఫ్రికాపై భారతదేశం సాధించిన అఖండవిజయమే.

నిజానికి ఇది కేవలం భారతదేశ విజయంమాత్రమే కాదు; సమస్త ప్రాచ్యప్రపంచ విజయం; సకలపీడిత ప్రజాకోటి విజయం.

ఈ విషయాన్ని జనరల్ స్మట్స్ సయితం గుర్తించాడు. అందువల్లనే ఆయన తమ పరాజయాన్ని గురించి ప్రస్తావిస్తూ, "ఇది కేవలం దక్షిణాఫ్రికా సమస్యమాత్రమే కాదు; అన్ని యూరోపియన్ జాతులసమస్య" అని హెచ్చరించాడు.

దక్షిణాఫ్రికాలో పాతికలక్షలమంది తెల్లవారుంటే, రెండున్నర లక్షలమంది నల్లవారున్నారు.

ఈ కొద్దిమంది నల్లవారైనా తమంతట తాముగా దక్షిణాఫ్రికాకు వెళ్ళినవారుకారు. తమకు కూలీలు కావలసివచ్చినప్పుడు ఏవేవో చాలా ఆశలుపెట్టి, తెల్లవారు పిలవగా వెళ్ళినవారే. దక్షిణాఫ్రికా ఈనాడు సిరిసంపదలతో తులతూగుతున్నంటే, అది ఈ నల్లవారుపడిన కష్టం ఫలితమే; ఓడ్చినచెమట ఫలితమే; కురియించిన రక్తం ఫలితమే. అయినా, తమకు ఈనాడు వారితో అక్కర తీరినందున వీరిని ఎలాగైనా తమదేశంనుంచి తరిమివేయాలని దక్షిణాఫ్రికా తెల్లవారు ప్రయత్నిస్తున్నారు. ప్రపంచ చరిత్రలోనే దీన్నిమించిన అన్యాయకృత్యాలేమి, కృతఘ్నచర్యలేమి అతి స్వల్పం!


ఏషియాటిక్ జాతులకు విరుద్ధంగా—ముఖ్యంగా, భారతీయులకు ప్రతికూలంగా—దక్షిణాఫ్రికా శ్వేతముఖులు చేసిన "మాలపల్లి" చట్టానికి ప్రాతిపదికలు అన్యాయం, కృతఘ్నతమాత్రమే కావు; జాత్యహంకారంకూడా.

దక్షిణాఫ్రికా శ్వేతముఖులు ఎంత జాత్యహంకార పీడితులైనదీ తెలపడానికి మిత్రరాజ్య సమితిలో భారతదేశం విజయం పొందినవెనక జనరల్ స్మట్స్‌చేసిన ఒక ప్రకటనే చాలు. ఈ ప్రకటనలో శ్వేతజాతులవారే సర్వదా ప్రపంచాన్ని పరిపాలించాలనీ, నేడుకూడా వారే ప్రపంచ పరిపాలకులనీ ఆయన ఉద్ఘాటించాడు. ఈ ఉద్ఘాటన చారిత్రకసత్యాలకు పూర్తిగా విరుద్ధమైనట్టిది. శ్వేతజాతుల ప్రాబల్యం నాలుగైదు శతాబ్దాలనుంచి మాత్రమే. అంతకుముందు ఆసియాఖండం ముందు యూరప్‌దివ్విటీముందు దీపమే. అప్పటిలో శ్వేతజాతీయులు కేవలం ఆటవికుల స్థితిలో

వుండేవారు. ఆ రోజులలో ఏషియాటిక్ జాతులవారు యూరప్‌ను జయించి, కొన్ని కొన్ని ప్రాంతాలను కొన్ని శతాబ్దాలపాటు పరిపాలించి వున్నారుకూడా. అయినా, శ్వేతముఖులే సర్వదా ప్రపంచ పరిపాలకులనడం జనరల్ స్మట్స్ జాత్యహంకారానికే నిదర్శనం.

ఇటీవల కొన్ని శతాబ్దాలనుంచి ప్రపంచం మొత్తంలో శ్వేతముఖుల ప్రాబల్యానికి తిరుగు లేకున్నా, మరి ఎంతోకాలంపాటు ఈ ప్రాబల్యం నిలవబోదని జనరల్ స్మట్స్‌కు తెలియకపోదు. అందువల్లనే తానుచేసిన ప్రకటనలో ఆయువు "మరెంతకాలం ప్రపంచ పరిపాలనాధికారాన్ని యూరోపియన్‌జాతులు కాపాడుకొనగలవో చెప్పలేను" అని అన్నాడు. ఈ సందేహం ఆయనకు తోచడానికి మిత్రరాజ్యసమితిలో ఏదో ఒక నూతనశక్తి గోచరించడమేనట. ఈ శక్తి ఏదో—ఎట్టిదో—ఎక్కడిదో—జనరల్ స్మట్స్‌కు సరిగా బోధపడనేలేదు. అందువల్ల "మిత్రరాజ్యసమితిలో శ్వేతజాతుల వారికంటె శ్వేతేతర జాతులవారికే ఎక్కువ వోట్లుకలవు." అని ఆయన వాపోయినాడు జనరల్ స్మట్స్ సంభావిస్తున్నట్లు, ఇది కేవలం "ఎవరికి ఎక్కువవోట్లు కలవు" అనే ప్రశ్న కానేకాదు. జాతి, మత, వర్ణ, కుల, వర్గవిభేదాలు ఎంత కృత్రిమమైనవో అంత నికృష్టమైనవని నేడు ప్రపంచ ప్రజాబాహుళ్యం గుర్తించింది. మానవుని స్వాతంత్ర్యాన్ని సర్వత్రా గుర్తించినప్పుడే, మానవునికి మధ్య సమానత్వ, సౌభ్రాతృత్వాలు పెంపొందినప్పుడే ప్రపంచానికి శాంతి, సౌఖ్య, సుభిక్షాలు లభించడమని కూడా గుర్తించింది. మిత్రరాజ్యసమితి సమావేశంలో జనరల్ స్మట్స్‌సయితం గుర్తించవలసి వచ్చిన నవశక్తి వాస్తవానికిదే. ఇక అన్యుల ప్రాబల్యాన్ని తాము సహించబోమని, తమ పరాధీన స్థితికి స్వస్తిచెప్ప నున్నామని ప్రాచ్యప్రపంచం చాటుతున్నది. ప్రాచ్య ప్రపంచాన్ని బానిసత్వంలో పెట్టినంతవరకు తనకు స్వేచ్ఛా స్వాతంత్ర్యాలేమి, శాంతిసౌఖ్యాలేమి దూరంకాక తప్పవని పాశ్చాత్యపు ప్రపంచం సయితం గుర్తిస్తున్నది. అందువల్లనే దక్షిణాఫ్రికా భారతీయుల సమస్య విషయంలో భారతదేశానికి అనుకూలంగా దాదాపు ప్రతి ప్రాచ్యరాజ్యమే కాకుండా పెక్కు పాశ్చాత్యరాజ్యాలు సయితం మిత్రరాజ్యసమితి సమావేశంలో వోటుచేయడం సంభవించింది.

నిజానికి మొన్న మిత్రరాజ్య సమితి మూడింట రెండువంతుల మెజారిటీతో ఆమోదించిన తీర్మానం రెండు పాశ్చాత్య రాజ్యాలు (ఫ్రాన్సు, మెక్సికోలు) ప్రతిపాదించినట్టిదే. దక్షిణాఫ్రికాలోని భారతీయులపట్ల జనరల్ స్మట్స్ ప్రభుత్వంవర్తన ఇండియా, దక్షిణాఫ్రికాల మధ్య జరిగిన ఒడంబడికలకే కాకుండా, మిత్రరాజ్య సమితి ప్రణాళికలోని ప్రధాన సూత్రాలకు సయితం విరుద్ధంగా నున్నదని ఈ తీర్మానం పేర్కొన్నది. ఈ సమస్యను రాయబారాలద్వారా పరిష్కరించుకొనడానికి ఉభయదేశాలు ప్రయత్నించి, మిత్రరాజ్యసమితి ఈసారి సమావేశం కాగలనాటికి తమ ప్రయత్నాలు ఏవిధంగా పరిణమించిందీ ఇండియా, దక్షిణాఫ్రికాలు నివేదించాలనికూడా ఈ తీర్మానం కోరింది. ఇంతకంటెకూడా స్పష్టమైన తీర్మానాన్ని, ఇంతకంటె నిశితమైన తీర్మానాన్ని భారతదేశం అభిలషించి వుండక పోలేదు. కాని, దక్షిణాఫ్రికా భారతీయుల సమస్య కేవలం అంతరంగికమైనదని వాదించి, దాన్ని అంతర్జాతీయ న్యాయస్థానంముందు విచారణకు పెట్టించడంతో సరిపుచ్చడానికి జనరల్ స్మట్స్ చేసిన యత్నాన్ని విఫలంచేసివేసిన మేరకు ఫ్రాన్సు, మెక్సికోల తీర్మానం అభినుతించదగింది.



భరతమాత భారతీయ స్వాతంత్రాన్ని
క్షేమంగా బ్రిటిష్ రాజకీయతంత్ర ప్రవాహం దాటిస్తున్నది.

భారతీయుల సమస్య దక్షిణాఫ్రికా ఆంతరంగిక సమస్యమాత్రమే నని జనరల్ స్మట్స్ చేసిన కువాదాన్ని సిగ్గు బిడియాలు లేకుండా బ్రిటన్, యునైటెడ్ స్టేట్సులు సమర్థించినవి. దక్షిణాఫ్రికా సరిహద్దులలోని భారతీయుల విషయంలో మిత్రరాజ్య సమితి జోక్యం కలిగించుకొన వచ్చునని తా నంగీకరించిన పక్షంలో తన సరిహద్దులలోని నీగ్రోజాతివారి విషయంలో సయితం మిత్రరాజ్య సమితి జోక్యం తప్పదని యునైటెడ్ స్టేట్సు భావించిన దనడం ఈ సందర్భంలో సుస్పష్టమే. అంచేత దానిచర్య ఒకవేళ కొంతవరకు క్షంతవ్యమైనా, బ్రిటన్ చర్య ఎంతమాత్రం క్షంతవ్యంకాదు. తన సామ్రాజ్యంలో అంతర్భాగాలుగా నున్న రెండురాజ్యాలమధ్య వచ్చినవివాదం సందర్భంలో బ్రిటన్ కనీసం తాటస్థ్యమైనా వహించకుండా, దక్షిణాఫ్రికాపక్షాన—లేదా, అన్యాయంపక్షాన, అహంకారంపక్షాన—బాహాటంగా చేరింది!

బ్రిటన్, యునైటెడ్ స్టేట్సు లేమి, వాటి ఉపగ్రహ రాజ్యాలేమి, ఎంతకు యత్నంచేసినా, ఫ్రాన్సు, మెక్సికోల తీర్మానాన్ని పెద్ద మెజారిటీతో ఆమోదించడంద్వారా భారతదేశంతోపాటు ప్రాచ్య ప్రపంచానికేమి, పీడిత ప్రజాకోటికేమి అంఖండ విజయాన్ని చేకూర్చడమేకాకుండా, తన మనుగడను మిత్రరాజ్య సమితి కాపాడుకున్నది. ఈ తీర్మానాన్ని చేసివుండకపోతే, దాని ప్రతిష్ఠ బుగ్గికలిసి పోయివుండేది. మంచూరియా, అబిసీనియాల విషయంలో తగుచర్యను జరపనేరక, అప్రతిష్ఠపాలై పోయి, తుదకు నామరూపరహితమై పోయిన నానాజాతి సమితికిపట్టిన దుర్గగతికే తానుకూడా పాల్పడిపోయేది.

దక్షిణాఫ్రికా భారతీయుల విషయంలోనే కాకుండా, నైరృతి ఆఫ్రికా విషయాలలోకూడా భారతదేశంచేసిన వాదన న్యాయమైనదని అంగీకరించి, మిత్రరాజ్య సమితి సత్కీర్తి స్వీకరించుకున్నది.

ప్రథమ ప్రపంచ మహాసంగ్రామానంతరం జర్మనీనుంచి మాండేటరీ అధికారంచేత నైరృతి ఆఫ్రికా దక్షిణాఫ్రికాకు సంక్రమించింది. నాటినుంచి నేటివరకు ఎంతో నిరంకుశంగా నికృష్టంగా ఈప్రాంతాన్ని దక్షిణాఫ్రికా పరిపాలిస్తున్నది. మాండేటరీ అధికారంక్రింద ఏదైనా ఒకప్రాంతాన్ని పరిపాలిస్తున్న రాజ్యం ఆప్రాంతప్రజల పురోభివృద్ధికి దోహదమివ్వాలనీ, వారిని స్వపరిపాలన బాధ్యతా నిర్వహణకు సమాయత్తపరచాలనీ ఒక స్పష్టనియమంకలదు. అయినా, గడిచిన పాతిక సంవత్సరాలలో నైరృతి ఆఫ్రికా వాసులకు (వారిది తెల్లచర్మం కానందున) దక్షిణాఫ్రికా ఎట్టి పౌరసత్వాల నివ్వలేదు. వారికి తగు విద్యా సౌకర్యాలుగాని, వైద్యసహాయంగాని సమకూర్చలేదు. ఆర్థికంగానేమి సాంఘికంగానేమి, రాచకీయంగానేమి, అన్యవిషయాలలోనేమి వారి వికాసానికి జరిపిన కృషి దాదాపు మృగ్యం. అయినప్పటికి నైరృతి ఆఫ్రికా, దక్షిణాఫ్రికా సరిహద్దులలో చేర్చివేయవలసిందిగా జనరల్ స్మట్స్ మిత్ర రాజ్య సమితిలో ప్రతిపాదించాడు. ఈ ప్రతిపాదన అతి ఘోరమైనదని భారతదేశం వాదించగా, ఆ వాదనను హర్షించి, స్మట్స్ ప్రతిపాదనను మిత్రరాజ్య సమితి త్రోసిపుచ్చింది. అంతేకాదు నైరృతి ఆఫ్రికాపై మాండేటరీ అధికారానికి బదులు ట్రస్టీషిప్ అధికారం (ధర్మ కర్తృత్వాధి కారం) స్వీకరించడానికి అనువుగా ఒక ప్రణాళికను ఈసారి మిత్రరాజ్య సమితి సమావేశం జరిగేనాటికి దక్షిణాఫ్రికా ప్రభుత్వం సూచించాలనికూడా నిర్ణయించింది. నిజానికి నైరృతి ఆఫ్రికాను దక్షిణాఫ్రికా పరిపాలననుంచి పూర్తిగాతప్పించివేయడం సముచితమై వుండేది. ఇది జరగకపోయినా, ప్రస్తుతనిర్ణయం సయితం హర్షించబడింది.

నైరృతి ఆఫ్రికా విషయంలో చేసిన నిర్ణయానికి మిత్రరాజ్యసమితిని అభినందించినా, మాండేటరీ అధికారంకిందనున్న పీడితప్రజలకు అది పూర్తిన్యాయం చేసినదనలేము. బ్రిటన్, ఫ్రాన్సు, బెల్జియం, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్‌లు తమ పరిపాలనకిందనున్న మాండేటరీ రాజ్యాల విషయంలో ఎనిమిది ధర్మకర్తృత్వాధికార ప్రణాళికలను ప్రతిపాదించినవి. ఈ ప్రణాళికలు పెక్కువిధాల అసంతృప్తికరమైనట్టివి. ధర్మకర్తృత్వాధికారంకింద మనవలసిన ప్రాంతాలకు ఎప్పటికి స్వపరిపాలనాధికారం లభించగలదో ఈ ప్రణాళికలు స్పష్టపరచడం లేదు. సైనిక లేక, వైమానికాశ్రయాలను నిర్మించుకొనడంద్వారా ఈ ప్రాంతాలను వీటిని పరిశీలించే రాజ్యాలు స్వప్రయోజనలకు వినియోగించుకొనడానికి ఈ ప్రణాళికలు అవకాశ మిస్తున్నవి. ఇట్టిలోపా లన్నింటిని సవరింపజేయడానికి ఇండియా, రష్యాలు ప్రయత్నించగా, వాటి కృషి విఫలమైపోయింది. భారతదేశం పక్షాన, సోవియెట్‌రష్యా పక్షాన ప్రతిపాదించబడిన సవరణలలో ధర్మకర్తృత్వాధికారాన్ని పది సంవత్సరాలకు పరిమితంచేసి, ఆ గడువు ముగిసినంతనే స్వపరిపాలనాధికారాన్ని ప్రసాదించవలెననేది అతి ముఖ్యమైనది. న్యాయమైన ఈ సవరణను సయితం త్రోసిపుచ్చడంవల్ల పీడితప్రజాకోటికి మిత్రరాజ్యసమితి ఘోరా న్యాయాన్నే చేసింది.

* * *

స్పెయిన్ విషయమై మిత్రరాజ్యసమితి చేసిన నిర్ణయంసయితం అసంతృప్తికరమైనదే. ఫ్రాంకో ప్రభుత్వానికి, హిట్లర్, ముసోలిని ప్రభుత్వాలకు భేదం తరతమాలలోనే. వాటివలె ఇదికూడా ఫాసిస్టు ప్రభుత్వం. వాటివలె ఇదికూడా తుపాకిగుండుపై, ఉరికంబంపై, కిరాతకత్వంపై ఆధారపడేదే. వాటివలె ఇదికూడా పౌరస్వత్వాలను విలుప్తంచేసి, ప్రజాస్వామ్యానికి స్వస్తిచెప్పి, ప్రజాబాహుళ్యాన్ని ఘోర దురంతాలకు పాల్పడజేసేదే! నిజానికి వాటి సహాయంవల్లనే (నాజీ జర్మనీ, ఫాసిస్టు ఇటలీల సహాయంవల్లనే) ఇది ఏర్పడింది. అయినా, ఏ రాజ్యపు ఆంతరంగిక వ్యవహారాలలో మిత్రరాజ్యసమితి జోక్యం కలిగించుకొనరాదనే సాకుపై, స్పెయిన్‌లోని ఫ్రాంకో ప్రభుత్వాన్ని కూలద్రోయడానికి తగు చర్యను గైకొనకపోవడం ఎంతైనా శోచనీయం. జర్మనీ, ఇటలీలలో జోక్యం కలిగించుకోరాదని, హిట్లర్, ముసోలినుల దుశ్చర్యలపట్ల ఔదాసీన్యాన్ని వహించబట్టే గదా, వారు ముందు స్వదేశంలో ప్రజాస్వామికత్వాన్ని మట్టుబెట్టి, ఆ తర్వాత అన్యదేశాలలో కూడా అట్టి దౌష్ట్యానికే పూనుకున్నారు? ప్రపంచంలో ఎక్కడ ప్రజాస్వామ్యానికి భంగం కలిగినా, అది ప్రపంచ మొత్తంలో ప్రజాస్వామ్యానికే ప్రమాదకరమని గుర్తించగల విజ్ఞతను ప్రదర్శించగలిగివుంటే, ద్వితీయ ప్రపంచ మహాసంగ్రామం చెలరేగి వుండేదా? దానిలో లక్షలు, కోట్లు నిండుప్రాణాలు పోయివుండేవా? ఫ్రాంకో ప్రభుత్వంపై కనీసం ఆర్థికపు ఆంక్షలనైనా ప్రకటించకుండా, కేవలం రాయబారులను వెనకకు రప్పించాలని మిత్రరాజ్యసమితి చేసిన తీర్మానం ఎంత నిష్ప్రయోజనకరమైనదో, అంత నిందార్హమైనది కూడా.

* * *

ఆయుధ విసర్జనవిషయమై దీర్ఘ-తీవ్ర-వాదప్రతివాదాల పిమ్మట మిత్రరాజ్య సమితిచేసిన తీర్మానం పూర్తిగా సముచితమైనది కాదు గాని, మొత్తంమీద సంతృప్తికరమైనది. ఈ తీర్మానంలో ఈ కింది నాలుగు ప్రధానసూత్రాలు గర్హితమై వున్నాయి.

(1) భద్రత హెచ్చినకొలది ఆయుధవిసర్జన హెచ్చాలి. (ఈసూత్రం ప్రకారం పూర్తి ఆయుధవిసర్జన పూర్తిగా భద్రత ఏర్పడినప్పుడే, లేదా, దురాక్రమణకు పాల్పడకుండా ప్రతి రాజ్యాన్ని మిత్రరాజ్యసమితి కాపాడగలదని పూర్తినమ్మకం కుదిరినప్పుడే.)

(2) ఆయుధవిసర్జన కేవలం యాటంబాంబులకే కాకుండా రాకెట్లు, విషవాయువులు, విషక్రిములు మొదలైన అన్ని మారణాస్త్రాలకు వర్తించాలి. (ఈసందర్భంలో ప్రెసిడెంట్ రూజ్‌వెల్ట్ ఒకప్పుడు హిట్లరుకుచేసిన ఆయుధవిసర్జన ప్రతిపాదన గమనార్హమైనట్టిది. సైనికుడు తన వీపుపై మోయగలిగిన ఆయుధాలువీడి తక్కిన అన్నింటిని బహిష్కరించ దగునని ప్రెసిడెంట్ రూజ్‌వెల్ట్ ప్రతిపాదించాడు. ఈ ప్రతిపాదన సర్వామోదకరమైననాడే వాస్తవంగా ఆయుధ విసర్జన జరిగినట్టు)

(3) మిత్రరాజ్యసమితి నిర్ణయించిన ప్రణాళిక ప్రకారం ఆయుధవిసర్జన కొనసాగుతున్నదో, లేదో కనిపెట్టి చూడ్డానికి ఒక అంతర్జాతీయ పరిపాలక సంఘాన్ని నియమించాలి.

(4) ఆయుధ విసర్జన పరిపాలక సంఘ కార్యకలాపాలను తన వీటో అధికార ప్రయోగంద్వారా భగ్నపరచడానికి ఏ అగ్రరాజ్యానికి అవకాశ మివ్వరాదు. ఈ సంఘం

మెజారిటీ ఓటుప్రకారం పనిచెయ్యాలిగాని, అన్ని రాజ్యాలు ఏకగ్రీవంగా ఆమోదించిన నిర్ణయాలనే అమలుపరచకొనడంకూడా కూడదు.

ఈ నాలుగు సూత్రాలను అమలుపరచడానికి తగు కార్యవిధాన నిర్ణయ బాధ్యతను మిత్రరాజ్య సమితి భద్రతా సంఘంపై (సెక్యూరిటీ కౌన్సిల్‌పై) పెట్టింది.

ఆయుధ విసర్జన ఏవిధంగా సాగుతున్నదో కనిపెట్టి చూడ్డానికి—కనిపెట్టిచూడ్డానికి మాత్రమేకాదు; దాన్ని కొనసాగింప జేయడానికికూడా—ఒక పరిపాలక సంఘాన్ని నియమించ వలెనన్న ప్రతిపాదనకు ఆదిలో రష్యా సమ్మతించలేదు. ఇందుకు ఇప్పుడది సమ్మతించినా, వీటో అధికారాన్ని విడిచిపుచ్చడానికి అది సుముఖంగాలేదు. మిత్రరాజ్య సమితిలో నేమి, భద్రతా సంఘంలో నేమి ఆంగ్లో—అమెరికన్ రాజ్యకూటానికి సంఖ్యా బలమున్నది. అంచేత "మెజారిటీ ఓటు" సూత్రానికి సమ్మతిస్తే, తనకు ప్రమాదం తప్పదని రష్యా భయపడుతున్నది. ఈ కారణాన "వీటో" ఈనాటికీ వివాదగ్రస్త సమస్యగానే వున్నది. మిత్రరాజ్యసమితి నియమించిన పరమాణుశక్తి ఉపసంఘ సమావేశంలో డిశెంబర్ 30 వ తేదీని వీటో అధికారాన్ని తొలగించడం మిత్రరాజ్యసమితి ప్రణాళికకు విరుద్ధమని సోవియెట్ ప్రతినిధి వాదించాడు. అయినా, ఆ ఉపసంఘం పరమాణుశక్తిని కంట్రోల్ చేయడం విషయంలో ఈకింది పంచసూత్ర ప్రణాళికను తాత్కాలికంగా ఆమోదించింది.

(1) పరమాణుశక్తి యుద్ధేతర కార్యకలాపాల నిమిత్తమే వినియోగింపబడే విధంగా కట్టుదిట్టాలను చేయడానికి ఒక అంతర్జాతీయ సంఘాన్ని నియమించాలి.

(2) ఈ అంతర్జాతీయ సంఘానికి అగ్రరాజ్యాల వీటో అధికారం వర్తించరాదు.

(3) వీటో అధికారం ద్వారాగాని, అన్యవిధాలగాని ఏరాజ్యంకూడా అంతర్జాతీయ సంఘం కార్యకలాపాలకు (కంట్రోల్, పరిశీలన మొదలైనవాటికి) ఎట్టి అంతరాయం కలిగించరాదు.

(4) ఇప్పుడు తయారైవున్న యాటంబాంబులను ఏమిచెయ్యాలో నిర్ణయించడానికి ఒక అంతర్జాతీయపు ఒడంబడిక జరగాలి. ఆ ఒడంబడిక పరిపాలింపబడుతున్నదో, లేదో కనిపెట్టడానికి తగుమార్గాలను నిర్ణయించాలి.

(5) జరిగిన ఒడంబడికలను భగ్నపరచే దేశానికి వేయదగు శిక్షను నిర్ణయించాలి.

ఈ ప్రణాళిక భద్రతా సంఘంలో చర్చకురాగలదు. అక్కడ రష్యా తనవీటో అధికార ప్రయోగంతో దాన్ని త్రోసిపుచ్చవచ్చు. దానితో ఈసమస్య తిరిగి మొదటికి వస్తుంది. అంచేత ఈనాటికీ ఆయుధవిసర్జన సమస్య పరిష్కారమైనదనలేము.

* * *

ఆయుధ విసర్జన సమస్య పరిష్కారం కానప్పుడు ప్రపంచ శాంతి సంస్థాపన సమస్య పరిష్కారంకానే కాదని వేరుగా చెప్పనవసరంలేదు.

శాంతి సంస్థాపన నేటికి జరగలేదు సరిగదా, పెక్కుచోట్ల - చైనా, ఇండోచైనా, గ్రీసు, పాలస్తీనాలలో - భీషణసమరాలు సాగుతున్నవికూడా, అందువల్ల నేటిది కల్లోల ప్రపంచమే.






ముస్లిములీగు పాల్గొనక పోయినప్పటికీ అనుకున్న ప్రకారం రాజ్యాంగసభ డిసెంబరు 9 న ఢిల్లీలో సమావేశమై సత్వర కార్యాచరణకు దిగింది. మే 16 నాటి కాబినెట్ మిషన్‌వారి ప్రకటనగురించి కాంగ్రెసు లీగులకు ఏర్పడిన అభిప్రాయభేదాల తాలూకు ముఖ్యాంశాలమీద రాజీ కుదర్చడానికి రాజ్యాంగ సభ సమావేశం కాకపూర్వం బ్రిటిషు ప్రభుత్వం ప్రయత్నించింది. ఈ అభిప్రాయ భేదాలకు కారణభూతమయిన ఒక అంశం ఏమంటే, గ్రూపులకు చెందిన రాజ్యాంగ సభల కార్యకలాపాలలో మెజారిటీ వోటును బట్టి ఒకగ్రూపులో చేర్చబడిన రాష్ట్రాలు స్వయం నిర్ణయాన్నిబట్టి ఆ గ్రూపులోనుంచి బయటికి రావచ్చునా అనేది. మే 16 నాటి ప్రకటనప్రకారం గ్రూపుకూ ప్రత్యేక రాష్ట్రాలకూ సంబంధించిన రాజ్యాంగచట్టం నిర్ణయించబడేదాకా ఏ రాష్ట్రమూ గ్రూపులోనుంచి బయటికి రా వీలులేదనేది సుస్పష్టమని లీగు అభిప్రాయం. గ్రూపు రాజ్యాంగ పరిషత్తులలో మెజారిటీ వోటుపద్ధతిని వోటు జరగాలనీ, అందుచేత అసాము, నార్త్‌వెస్ట్ ఫ్రాంటియరురాష్ట్రాల ప్రతినిధుల మెజారిటీకి బీ సీ గ్రూపులలోవుండే ఇచ్ఛ ఏమాత్రమూ లేనప్పటికీ అవి ఈ గ్రూపులలోనుండి బయటికిపో వీలులేదనీ కూడా లీగు అభిప్రాయం. లీగు సిద్ధాంతాన్ని ఆమోదిస్తే ఏ గ్రూపులో చేర్చబడిన రాష్ట్రాలు ఆ గ్రూపులోనే వుండిపోవటం తప్ప ఆ రాష్ట్రాలప్రజలకు వేరే గత్యంతరంలేదు. కాబినెట్ మిషన్‌వారి ప్రకటనకు గ్రూపుల విభజన ప్రాతిపదిక అయినప్పటికీ, ఒక రాష్ట్రాన్నిగాని ఒక దేశభాగాన్నిగాని బలాత్కారంగా ఒక గ్రూపుకు బంధించడంలో ప్రజాస్వామ్యంలేదు, అది న్యాయంగానీ ధర్మంగానీ కాదు, అందులో స్వయం నిర్ణయసూత్రానికే హాని.

* * *

ముస్లింలీగు వ్యాఖ్యానాన్ని బలపరుస్తూ బ్రిటిషు ప్రభుత్వం డిసెంబరు 6 న ఒక ప్రకటనచేసింది. ధర్మసూక్ష్మవిచారణ చేయగా ఈ క్రింది అంశాలు రూఢిఅయినట్లు బ్రిటిషు ప్రభుత్వం ప్రకటించింది: (1) నిర్ణయించబడిన రాష్ట్రాల గ్రూపులతోనే గ్రూపురాజ్యాంగ పరిషత్తులు వ్యవహరించాయట, (2) ఏ గ్రూపులోవున్న రాష్ట్రాల రాజ్యాంగ ప్రణాళికను ఆ గ్రూపు రాజ్యాంగసభ నిర్ణయించేవరకున్నూ ఏ రాష్ట్రమూ తన గ్రూపులోనుంచి విడిపోగూడదట, (3) ఏ రాష్ట్రమైనా తన గ్రూపులోనుంచి బయటికి పోదలిస్తే కొత్తరాజ్యాంగ ప్రణాళికనుబట్టి జరిగే మొదటి సాధారణ ఎన్నికల అనంతరం ఏర్పడే శాసనసభయొక్క తీర్మానాన్నిబట్టి అలాచెయ్యటం సాధ్యమవుతుందట. మే 16 ప్రకటననుబట్టి ధర్మ నిర్ణయానికిగాను ఫెడరల్‌కోర్టుకు వెళ్ళే అవకాశంవుంది గాని కాంగ్రెసులీగుల పరస్పర సమ్మతిమీదనే అది జరగాలి గనక లీగు రాజ్యాంగసభలో ప్రవేశించేవరకూ ఆ అవకాశంకూడా లేదు. నేటివరకూ లీగు రాజ్యాంగసభలోకి రా నిరాకరించివుంది. అందుచేత గ్రూపులలోనుండి జారిపోవడానికి రాష్ట్రాలకుగల అధికారాన్ని ఫెడరలుకోర్టు



నిర్ణయించడం కుదరదు. ఒకవేళ ఫెడరలు కోర్టు కాంగ్రెసుపార్టీవారి వ్యాఖ్యకు అనుకూలంగా నిర్ణయించిందే అనుకున్నా ఆ నిర్ణయానికి లీగు కాని బ్రిటిషుప్రభుత్వం గాని బాధ్యులుకారు. అందుచేత, కాబినెటుమిషను చేసిన సూత్రాలను వ్యాఖ్యానించడంలో కాంగ్రెసు లీగులకు గలిగే అభిప్రాయాలమీద ఫెడరలుకోర్టు తుది నిర్ణయంచేసే అవకాశం వుండీ ఒకటే లేకా, ఒకటే. బ్రిటిషు ప్రభుత్వమే అంత నిష్కర్షగా లీగు వ్యాఖ్యానాన్ని బలపరుస్తూ, తమ వ్యాఖ్యానానికి రాజ్యాంగ సభలో అందరూ తల ఒగ్గాలనీ, ఈ షరతు మీద తయారయిన రాజ్యాంగ ప్రణాళిక అయితేనే పార్లమెంటు ఎదట వుంచబడుతుందనీ డిసెంబరు 6 ప్రకటనద్వారా స్పష్టం చేసినప్పుడు ఫెడరలుకోర్టు గ్రూపులను గురించి తన నిర్ణయాన్ని ఇస్తుందనుకోవడానికి లేదు. అందుచేత కాంగ్రెసు ఫెడరలుకోర్టు తీర్పును అర్థించక పోవడంలో అసమంజసమేమీ లేదు.

* * *

కనుక ఢిల్లీలో ఇప్పుడు సమావేశమైన రాజ్యాంగ పరిషత్తు ధైర్యదీక్ష వివేకాలతో ఈ తొలి సవాలును ఎదుర్కొనాలి. నిర్దిష్టమైన పద్ధతులమీద ప్రజా బాహుళ్యం ఎన్నుకొన్న ఈ రాజ్యాంగసభ తన కర్తవ్యాన్ని తనకు ఉచితమని తోచినరీతిగా చేసుకుపోవడమా, లేక పైవాళ్ళువేస్తూ వుండే అడ్డుపుల్లలన్నిటికీ తలఒగ్గడమా అన్నది సమస్య. ఉన్న గ్రూపుల విధానాన్ని ఆమోదించి గ్రూపు రాజ్యాంగ సభలు సమావేశం కావడమా లేక ప్రత్యేక రాష్ట్రాలు బీ, సీ గ్రూపులలో నుంచి చీలి ఏ గ్రూపులో చేరడమా అనే సమస్య కార్యాచరణలో తరువాత కలుగుతుంది. కాని ఇప్పటిమటుకు ఈ అంతరాయాన్ని ఎదుర్కొనడానికి రాజ్యాంగసభలో చేరిన భారతీయుల ప్రధానాశయాలను ప్రతిపాదిస్తూ జవహర్లాల్ నెహ్రూ ఒకతీర్మానం చేశాడు. జాతియొక్క అభ్యుదయం జాతిలో నుంచే రావాలి. భావిభారత రాజ్యాంగ ప్రణాళిక నిర్మించాలంటే రాజ్యాంగసభ సంపూర్ణాధికారంతో మంచిచెడ్డలు నిర్ణయించి తనకు ఉచితమని తోచిన పద్ధతిని కార్యాచరణకు దిగాలి. రాజ్యాంగ ప్రణాళిక నిర్మించడంలో తా నవలంబించే సూత్రాల వెనక ఆశయాలేమిటో స్పష్టంగా ముందు తాను నిర్ణయించుకొని తరువాత దేశప్రజల ఎదట వుంచాలి. దేశంలో స్వాతంత్ర్యయుతమైన ప్రజా ప్రభుత్వం నెలకొల్పడమూ, అది సంపూర్ణాధికారంగల రాష్ట్రాల కూడలిగా వుండడమూ, రాజ్యాంగ విధానం ప్రజాస్వామ్యయుతంగా వుండి ప్రతి వ్యక్తికీ మత, లింగ, జాతివిభేదాలు లేకుండా సమమైన న్యాయమూ, చట్టబద్ధంగా వాక్స్వాతంత్ర్యమూ, మత స్వాతంత్ర్యమూ, సంఘస్వాతంత్ర్యమూ ఉండడమూ రాజ్యాంగసభ ఆశయాలని నెహ్రూ తీర్మానం స్పష్టీకరించింది.




ఈఆశయాలను అందరూ ఏకగ్రీవంగా ఆమోదించినప్పటికీ, తీర్మానం ఇప్పుడు చెయ్యడానికి రెండు అభ్యంతరాలు చెప్పారు. ఇంత ప్రధానమైన తీర్మానాన్ని ఇప్పుడే ఆమోదించడం కంటె ముస్లిము సభ్యులు సభలో పాల్గొనడానికి మరికొంత అవకాశం ఇచ్చి అటుపిమ్మట ఈతీర్మానం అమలు జరపాలనేది ఒక అభిప్రాయం. మరో అభ్యంతరమేమంటే ఇప్పుడే భారత దేశాన్ని ప్రజాస్వామ్యమని ప్రకటిస్తే సంస్థానాధీశులు బెదిరిపోవచ్చు, వారితో జరగవలిసిన సంప్రదింపులకు విఘ్నం కలగవచ్చు; రాజ్యాంగ సభలో వారుకూడా పాల్గొని ప్రణాళిక నిర్మించవలిసివుంది. మొదటి అభ్యంతరానికి కొంత ఆధారం లేకపోలేదు. నెహ్రూ తీర్మానాన్ని ఇప్పుడే ఆమోదించి అది నట్టయితే వంకగా పెట్టి ముస్లింలీగు ఈ రాజ్యాంగసభ ఏకపక్ష సమావేశమని వాదిస్తుంది. నిజానికి ముస్లింలీగు ఈ సభలోచేరి తన అభిప్రాయాలు ప్రకటించటానికి బదులు తన విపరీత వైఖరిని సమర్థించే బ్రిటిషు ప్రభుత్వాన్ని ఆశ్రయించి కొరివితో తన తలే గోక్కున్నది. అయినా కాంగ్రెసువారుగాని కార్యరంగంలోకి దిగిన తదితరులుగాని ముస్లింలీగుకు తప్పులు వెతికే అవకాశం ఇవ్వడానికి ఒప్పుకోరు. పోతే, భారతదేశంలో ప్రజాస్వామ్య రాజ్యాంగ విధానం అవలంభిస్తుందని ప్రకటించినంత మాత్రాన సంస్థానాలవారికి బెదరనవసరం లేదు. తక్షణమే సంస్థానాలు రద్దుకావాలని కాంగ్రెసు అనలేదు, సంస్థానాలలో నిర్దిష్ట రాజ్యాంగవిధానం ఏర్పడి అందులో ప్రజాభిప్రాయానికి స్థానం ఇవ్వాలనిమటుకే నిర్ణయించింది. ఏమయినా భావి భారత రాజ్యాంగంలో సంస్థానాధీశుల స్థితి ఎట్లా వుండబోతుందో నిర్ణయించడానికీ, ఏ షరతులమీద వారు భారత పరిషత్తులో చేరుతారో నిర్ణయించడానికీ సంస్థానాల తరఫునా రాజ్యాంగ పరిషత్తు తరఫునా కమిటీ ఏర్పడి చర్చించుతుంది. ఏది ఎట్లావున్నా నెహ్రూ తీర్మానంలో ప్రతిపాదించిన ప్రాథమిక ఆశయాలు అతి ముఖ్యమైనవి. వీటిని ఆమోదించిన మీదటనే రాజ్యాంగ పరిషత్తు ముందు కార్యక్రమానికి పోవడానికి అనుకూల వాతావరణమూ, పరిస్థితులూ ఏర్పడతాయి.





# ఆత్మకథ

## రాజేంద్ర ప్రసాద్

### పరీక్షకు అశ్రద్ధ

బి. ఏ. లో చేరినతర్వాత నాస్థితి మారింది. పరీక్షలకు చదవడంమీద అభిరుచి తగ్గి ఇతర విషయాలమీద ఆసక్తి హెచ్చింది. క్లాసులో చెప్పింది శ్రద్ధతో వినడం, నాకు చిన్నప్పటినుంచీ అలవాటైపోయింది. ఇందుకు కారణమేమిటంటే ఇంట్లో ప్రైవేటుమాష్టరు ఎప్పుడూలేడు. ఏమి నేర్చుకున్నా స్కూలులో నేర్చుకోవలసిందే; ఇదే అలవాటయిపోయింది నాకు. కాలేజీలో కూడా అంతే. బి. ఏ. లో చేరడంతోనే ఆనర్సులో ఏ విషయం తీసుకుంటావని అడిగారు. బి. ఏ. లో మూడువిషయాలు చెప్తారు. ఇందులో ఇంగ్లీషు, వేదాంతము అందరూ చదివి తీరాలి. మూడవది విద్యార్ధి తన యిష్టంవచ్చింది తీసుకోవచ్చును. ఈ మూడవవిషయం ఇతర వాటితోబాటు చదివి పరీక్షకు కూర్చోవాలి. నేను చరిత్ర, అర్థశాస్త్రం తీసుకొన్నాను. ఆ రోజులలో ఆనర్సు ప్యాసవాలంటే మామూలు పరీక్షకుపైగా, ఇంకా కొన్ని పుస్తకాలు చదివి ఇంకో ప్రత్యేక పరీక్షలో ఉత్తీర్ణులు కావాలి. ఈ విధంగా ఆనర్సుచదువు కష్టమైనదే కాకుండా క్లాసులుకూడా దీనికెక్కువగా వుంటాయి. ఒక విద్యార్థి కావాలంటే రెండుమూడు విషయాలను ఆనర్సులో తీసికొనవచ్చునని నియమమున్నది. నేను రెండు తీసుకోనా, మూడు తీసుకోనా అనేప్రశ్న వచ్చింది.

మొదట నేనేమి నిశ్చయించుకోలేదు గాని మూడువిషయాల క్లాసులకు హాజరవుతూనే వున్నాను. ఛప్రాలో నాతో చదివిన రామానుగ్రహం, ఎఫ్. ఏ. ఎక్కడో చదివి బి. ఏ. చదవడానికి ప్రెసిడెంసీకాలేజీకి వచ్చాడు. 'మనమిద్దరమూ ఆనర్సులో మూడువిషయాలు తీసుకుందా'మన్నా డతడు. తాను మూడువిషయాలూ చదువుతున్నాడు. బి. ఏ. పరీక్షకుగాను 50/- రూపాయలు ఒకటి, 40/- ఒక ఒకటి స్కాలర్షిప్పులిస్తున్నారు. ఆనర్సు విద్యార్థులకు కూడా ఇందులోనే కలిపి ఇస్తున్నారు కనుక ఆనర్సులో మూడువిషయాలూ తీసికొని చదవాలని అతని పట్టుదల. అయితే ఆనర్సులో రెండువిషయాలు మాత్రం తీసుకొనేవారు మూడు విషయాలు తీసుకొనే వారికంటె ఎక్కువ; అందువల్ల ధనసహాయం రెండువిషయాలు తీసుకొన్నవారికే పోతుంది. ఆనర్సులో మూడువిషయాలు తీసుకొంటే ఎక్కువ అవస్థ పడవలసి వుంటుందేమోనని భయం. కొన్నిరోజులవరకు ఆందోళనగా వున్నది. మూడువిషయాల క్లాసులకు హాజరవుతూనే వున్నాను. కాలకర్మవశంగా వేదాంతంచెప్పే ప్రొఫెసరు చురకైనవాడు కాకపోవడంవల్ల నా ఉత్సాహం అందులో తగ్గసాగింది. ఇంగ్లీషుమాష్టరు మిస్టర్ పర్సివల్,

చరిత్ర మాష్టరు వినయబాబు చాలా చక్కగా పాఠాలుచెప్పుతూ వుండేవారు. అందుచేత ఆ క్లాసులకు పోవాలంటే చాలా సరదాగా వుండేది. చరిత్ర, అర్ధశాస్త్రం, ఇంగ్లీషుమాత్రం చదువుకోవాలని నిశ్చయం చేసుకొన్నాను. రామానుగ్రహం, ఇంకా ఇద్దరు విద్యార్థులుమాత్రం ఆనర్సులో మూడువిషయాలూ తీసుకున్నారు. కొన్నాళ్ళయిన తర్వాత డాక్టరు పి. కె. రాయి వేదాంతంపాఠాలు చెప్ప నారంభించారు. వారు బోధించేపద్ధతి సులభంగా, చక్కగా మనసుకు పట్టేటట్టుగావుంది; ఇది వినేటప్పటికి ఇంత సులభమైన విషయం మరేదీలేదని అనిపించింది. వారు పాఠం చెప్పేటప్పుడు జాగ్రత్తగావింటే మళ్ళీ పుస్తకం చదువవలసిన అవసరంకూడా వుండదు. పరీక్షలో అన్ని విషయాలలోను ఉత్తీర్ణత పొంది తీరాలి. అయితే స్కాలర్షిప్పు కోసం, ఆనర్సుమార్కులుకూడా కలుపుతారు, బహుశా యీ మార్కులమీద ఎక్కువ ధ్యానం వుంచుతారు. అందువల్ల డాక్టరు రాయిచెప్పిన పాఠాలను వినేవాడినే గాని అంతకంటే ఎక్కువ శ్రద్ధ తీసుకొనేవాడిని కాను. పుస్తకం చదవకుండానే, వారు చెప్పే పద్ధతినిబట్టి పరీక్ష ప్యాసవడానికి కావలసినంత జ్ఞానం సంపాదించాను. ఈ విషయాన్నికూడా నేను తీసుకొన్నట్లయితే తక్కువ పరిశ్రమతో ప్యాసయ్యేవాడినే; కాని అట్లా తీసుకోనందుకు తర్వాత పశ్చాత్తాపపడ్డాను.


ఈ విధంగా కొంతకాలంవరకు చదువులో శ్రద్ధవహించాను, కాని కొద్దికాలంలో ఒక సంఘటన జరిగింది; దానితో పరీక్షా ఫలితాలమీద యావత్తగ్గి మనసు ఇంకోవైపుకు మళ్ళింది. ఆ రోజుల్లోనే శ్రీ సతీశ్చంద్ర ముఖర్జీగారు 'డాన్‌సొసైటీ' అనే సంస్థను స్థాపించారు. విద్యార్థులు దానిలో సభ్యులవుతున్నారు. వీరేమీ శుల్కముకట్ట నవసరంలేదు. విద్యార్థులకు చదువులో సహాయంచేయటం, వారిని మంచిత్రోవలో వుంచటం, దేశ విషయాలను నేర్చుకోవటంలో సాయంచేయటం ఈ సంస్థయొక్క ఉద్దేశ్యము. విద్యార్థులద్వారా కొంతసేవ స్వీకరిస్తూ వుండేవారు, ఇదికూడా వారిచ్చే శిక్షణలో ఒకభాగము. వారానికి రెండురోజులు సాయంకాలంపూట క్లాసులు జరిగేవి. అందులో ఏవేవో విషయాలను బోధించేవారు. వాటిలో ఒకటి గీతాబోధ. గీతారహస్యం ఒక పండితుడు బోధించేవాడు, మంచి సులభంగా సరళంగా చెప్పేవాడు. రెండో ఉపన్యాసం సతీష్‌బాబు స్వయంగా ఇచ్చేవాడు; ఇతర ప్రముఖ వక్తలచేత ఉపన్యాసా లిప్పించేవాడు. ఆ క్లాసులో అప్పుడప్పుడూ ఒకకాలేజీ ప్రిన్సిపాలు ఎన్. ఎన్. ఘోష్, ఒకప్పుడు సిస్టర్ నివేదితా, తదితరులు ఉపన్యాసా లిచ్చేవారు. మేము సరిగ్గా సమయానికి వెళ్ళవలసి వుండేది. హాజరు వేసుకోవటం వుండేది. ఉపన్యాసం ఆరంభించక పూర్వం అందరికీ ఉపన్యాసంలోని ముఖ్యవిషయాలు వ్రాసుకుంటానికి కాగితాలు, పెన్సిళ్ళు ఇచ్చేవారు. రెండురోజుల ఉపన్యాసాల విషయాలూ టూకీగా వ్రాసి చూపించటంకోసం రెండు బైండుపుస్తకాలూ ఇచ్చేవారు. సతీష్‌బాబూ యీ పుస్తకాలను తన ఇంటికి తీసుకుపోయి తప్పులుంటే దిద్ది, మర్నాడు క్లాసులో ఒక్కొక్కరినీ పిలిచి తప్పులు సవరించి చెప్పేవాడు ప్రపంచజ్ఞానం అభివృద్ధి అయేటందుకూ, చారిత్రక పరిజ్ఞానం పెరుగుటకూ పనికివచ్చే ఎన్నో విషయాలు అక్కడ బోధించేవారు. విన్న ఉపన్యాసాన్ని టూకీగా వ్రాసుకొని దాన్ని మళ్ళీ వ్యాసరూపంగా వ్రాయటం అన్నివిధాలా మంచిపద్ధతి. ఈ అభ్యాసం యూనివర్సిటీ పరీక్షలకు చాలా సహాయం చేస్తుంది. సంవత్సరం అయిన తర్వాత విద్యార్థులు తయారుచేసిన వ్యాసాల నన్నిటిని ఒక పెద్దమనిషివద్దకు పంపేవారు. వారు వాటినిచూచి అన్నిటికంటే ఉత్తమమైన వ్యాసానికి బహుమతీ, స్కాలర్షిప్పు ఇచ్చేవారు. సంస్థతరపున ఒక ఖద్దరుదుకాణం ఒక

స్వదేశీవస్తువుల దుకాణంవున్నాయి. వాటిని సక్రమంగా నడిపించడం మాకు ప్రత్యక్ష శిక్షణ. దుకాణాలు సాయంకాలం రెండుగంటలు తెరిచివుంచేవారు. అందులో పద్దులు వ్రాయటం సభ్యుల పని.

నేనేదో విధంగా యీ సంస్థయొక్క ఒక ఉపన్యాసానికి వెళ్ళాను. విషయం నాకు చాలా నచ్చింది. అందులో సభ్యుణ్ణయ్యాను. సతీష్‌బాబుకు అప్పటికీ ఇప్పటికీకూడా నామీద చాలా దయ. సతీష్‌బాబు యూనివర్సిటీలోని చురుకైన విద్యార్థుల్లో ఒకడు. వీరూ, అశుతోష్ ముఖర్జీ ఇద్దరూ ఒకే సంవత్సరం బి. ఏ. ప్యాసయినారు. ఈయన స్వామి వివేకానందకు సహపాఠి. ఈయన ప్లీడరీవృత్తిలో దిగి కొంతకాలాని క్షది మానివేసి ఈ విధంగా సాంఘిక సేవలో దిగాడు. అవివాహితుడు. విద్యార్థి జీవితాన్ని వున్నతికి తీసుకురావటంకోసం యీ "డాన్ సొసయిటీ" స్థాపించాడు. ఈ సొసయిటీకి ఎన్. ఎన్. ఘోష్, సిస్టరు నివేదితా, సర్ గురుదాస్ బెనర్జీ మొదలగు మహాపురుషుల సానుభూతి లభిస్తూవుండేది. సొసయిటీలో చేరిన తర్వాత నా క్లాసులో చదవని కాలేజీలోని ఇతర విద్యార్థులతోకూడా పరిచయం కలిగింది. వీరిల్లో ముఖ్యులు విఖ్యాత పండితుడు, రచయిత అగు వినయకుమార్ సర్కార్, ఇటీవల కీర్తిశేషుడైన రిప్పన్ కాలేజీ ప్రిన్సిపాల్ రవీంద్రనారాయణ ఘోష్.

సంవత్సరాంతాన డాన్‌సొసయిటీవారి బహుమతి నాకే లభించింది. ఆ సభలో సర్ గురుదాస్‌బెనర్జీ నన్ను చాలా ఉత్సాహపరుస్తూ మాట్లాడారు. సొసయిటీకి వెళ్ళుతూ వుండటం వల్ల నా ఊహలు పరిపక్వమైనాయి. పరీక్ష ఫలితాలసంగతి వెనకబడింది. సాంఘిక సేవలో మనసు లగ్నమయింది. అసలు చిన్నప్పటినుంచీ ఇటువంటి విషయాలలో నా కభిరుచి ఎక్కువ. స్కూల్లో చదివేటప్పుడుకూడా మేము వాగ్వర్థినీ సంఘం స్థాపించి, ప్రతి ఆదివారం అందులో ఉపన్యాసా లిచ్చేవాళ్ళం. లేదా ఉపన్యాసం వ్రాసుకొచ్చి చదివేవాళ్ళం. అప్పుడప్పుడు స్కూల్లోని ఉపాధ్యాయులనుకూడా పిలిచేవాళ్ళం. కాని యీ సంఘం అటువంటిది కాదు, స్వతంత్ర సంస్థ. ఇదే విధంగా కలకత్తాలో బిహారీవాళ్ళకోసం "బిహారీ క్లబ్బు" స్థాపించాము. ప్రతి ఆదివారమూ ఇందులో ఉపన్యాసాలిచ్చే వాళ్ళం, లేదా వ్రాసుకొచ్చి చదివేవాళ్ళము. ఇంతేగాక కాలేజీలో ఒక యూనియన్ స్థాపించాము. నేనొక సంవత్సరం దానికి కార్యదర్శిగా ఎన్నుకోబడ్డానుకూడా. కాలేజీ యూనియన్ తరపున ఒక మాసపత్రిక ప్రచురింపబడేది. దీనిని నడిపేవారిలో నేనుకూడా ఒకడిని. ఇన్ని వున్నప్పటికీ డాన్ సొసయిటీలో చేరేటంతవరకూ, వీటికి ఉద్దేశ్యా లేమీ లేవు. వీటిని స్థాపించటంలో ప్రత్యేక కార్యక్రమంగాని, ఆశయంగాని లేదు. నేను పత్రికలు చదువుతూ వుండేవాడిని. కాంగ్రెసుపేరు తెలుసును. వార్షికోత్సవాలలో జరిగే ఉపన్యాసాలు జాగ్రత్తగా చదివేవాడిని. పెద్దపెద్ద బహిరంగసభలు, సురేంద్రనాథ్ బెనర్జీలాంటి గొప్పవక్తలు మాట్లాడే సభలకూ తప్పక వెళ్ళేవాడిని. వీటన్నిటికంటే సరదా అయినది స్వదేశ ప్రేమ; మా అన్నగారు స్కూల్లో చదువుకున్న రోజుల్లోనే నాకు నేర్పారు. కాని అది ఇంకా నాలో వికసించలేదు. మనసులోనే మొలకెత్తి, నిశ్చితాశయంలేకుండా అంధకారంలో బడివున్న యీ చిన్న మొలక డాన్‌సొసయిటీలో చేరిన తర్వాత, సతీష్‌బాబు సంపర్కం దొరికిన తర్వాత అది పెరిగి పెద్దదయింది. భావి కర్తవ్యం సంగతికూడా అప్పుడు ఆలోచించుకుంటూ వుండేవాడిని.

—సశేషం.



# వేమన పద్యాలు

అతనికీర్తి శక్తులన్న నొక్కనికేవ,
యొకని కతనిమీద నోకిలింత,
ఉభయులంత కలిసి రోకభ్రాతృ కూటాన,
విశ్వదాభిరామ వినురవేమ.

తోడివారలెల్ల దొరలైరి ఘనులైరి
తాను మిగిలి పోయెగాన, వారి
తిట్టి తిట్టి బాబు గట్టి పండితుడాయె
విశ్వదాభిరామ వినురవేమ.

మేన ఖద్దరాయె, పైన టోపీయాయె,
తేకువాయె, నోట తీటయాయె
చవట అంతలోనె సర్వజ్ఞుడై పోయె,
విశ్వదాభిరామ వినురవేమ.

తలపులో విషమ్ము, పలుకులో రోషమ్ము
నిలువు నిలువునాను నిండెమోస,
మయ్య మతము ప్రేమ, అతని ధర్మ మహింస
విశ్వదాభిరామ వినురవేమ.

కృష్ణశాస్త్రి

సాని కవికి, బోడిదాని సన్యాసికి
చలన చిత్రతార చౌదరీకి,
దానమిచ్చి బాబు తానుపస్తున్నాడు
విశ్వదాభిరామ వినురవేమ.

కోడిపుంజు పందెమోడి శ్రీ దొరవారు
అమరపురికి పైనమైరి కాని,
రెండు పనులకోస ముండి పోయారయా
విశ్వదాభిరామ వినురవేమ.

ఒక్క సేరు మాంస మూదేయకలరయా,
ఏటికొక్క బిడ్డ నిట్టికందు,
రసలు యోధవరలు సిలలైన శ్రీవారు,
విశ్వదాభిరామ వినురవేమ.

బాల్యమునను నరుడు, ప్రాయాన భక్తుండు,
కొంత వయసు ముదిరి గొప్పజ్ఞాని.
అరువదేండ్లు నిండి ఆబోతుగా మారె,
విశ్వదాభిరామ వినురవేమ.

సిలువ గుండెపైన, నెలవంక తలపైన,
మనసులోన ప్రణవ మంత్రదీప్తి,
మతము లేనివాని మనుగడే మతమయా
విశ్వదాభిరామ వినురవేమ.

# చెకుముకి రవ్వ శతకము

మొండియె లోకముకంటె న
ఖండుడనే సూక్తి నిజముగా నొక్కం డీ
ఖండాని కెసర్వెట్టగ
చెండాడక చూతురేల చెకుముకిరవ్వా.

'పాకీ'స్థానము కొఱకై
మూకల దెగటార్పనేల ? మూకుటి పెంకూ,
గోకూ, బాల్చీ, చీపురు,
చేకొని బైల్దేరరాదె చెకుముకిరవ్వా.

అంటే సరియా ? మగటిమి
బంటుతనము సార్థకతను బడయును పో; ఇ
ల్లంటించుట యందా ? రా
జింటిని కాపాడుటంద ? చెకుముకిరవ్వా.

గొప్ప వినాయకులంతా
కప్పల తక్కెడగజేసి ఖండస్థులకున్
చప్పగ రోగము కుదిరిచి,
చిప్పాకశె మిగల్చగలరు చెకుముకిరవ్వా.

ఈతఱి పోతే జనులకు
మూతికి ముక్కునకు నుమ్ముడి వేస్తారోయ్
పాతిక కట్టల ఆకులు
చేతులు కాలాక యేల చెకుముకిరవ్వా.

కొమరవోలు వెంకట సుబ్బారావు

వైషమ్యాల్ వదలుడు కా
వేషీలను మానుకొనుడు వేషాలేసే
మూషిక పదచారుల ని
శ్శేషము గావింపుడింక చెకుముకిరవ్వా.

భగవంతుడు తీర్పరియై
దిగివచ్చియు తెనుగువారి తెగకైక్యత గూ
ర్పగలేక భేదములె శా
స్త్రిగజేసిన యట్లుదోచు చెకుముకిరవ్వా.

ఎవనికి వాడే తన మా
ట వేదమను, నొరులు పల్కుటకు యత్నింపన్
చెవిబెట్టడు, కాదన్నన్
శివాలు చిందులనువేయు చెకుముకిరవ్వా.

గోచీపెట్టగ జాలని
బాచన్నలు మేము మేము పదవుల కని కాల్
సాచుట కన నందఱకును
ఛీ ఛీ యనిపించుగాదె చెకుముకిరవ్వా.

ఒక నాయకుడైతే యెదొ
యొకవిధముగ వేగవచ్చు నూరంతా నా
యకులే యైపోయిన నిక
సికపట్లే గాదె ఫలము చెకుముకిరవ్వా.

ఉద్ధారకులే యందఱు
ఉద్ధరణము గోరు దీనుడొక్కండును లే
డిద్దరి యద్దరి గానని
సిద్ధాంతము లొక్క లక్ష చెకుముకిరవ్వా.

# వంచనాశిల్పము

ప్రొఫెసరు గిరిరావు

## బైరాగులు

బైరాగులనే పేరు మన ఆంధ్రదేశములో పెంటపాటి మతంవారికే చెల్లుతుంది. ఉత్తరదేశమునుంచి వచ్చేవారిని సాధువు లంటాము. పెంటపాటి వారంతా గృహస్థులే. వారి జటాభారం, కావిగుడ్డలు మొదలైన సరంజామంతా తాత్కాలికంగా అమరుతూ వుంటవి. సంసారములో జ్ఞానియైనవాడు కుమ్మరిపురుగువలె సంచరించాలంటారు. ఈ బైరాగులు సన్యాసంలో అలా సంచరిస్తారు.

తూరుపు తెలతెలవారేవేళ ఊరివెలుపల చెరువుగట్టుమీద వేషమంతా అమర్చుకొని, దండకమండలములు ధరించి, గ్రామములో సంచరించుతూవుంటారు వీరు. ఆ యా గృహిణుల వాలకం పరీక్షించి వారికి కొంచెం కొంచెం సాముద్రికంచెప్పి లాలించడం, ఏదో తాయెత్తో, వేరో కట్టడం తప్ప ఈ బైరాగులకు ఇతర వంచనము లంతగా తెలియవు. 'నీవు అదృష్టవంతురాలవు తల్లీ! నీవు పట్టిన దెల్లా బంగార మవుతుం'దనీ, 'నీ కడుపున ఆణిముత్యాలువంటి బిడ్డలు పుట్టుతా'రని, నీవు మంచికిపోతే చెడ్డ ఎదురువస్తుం'దనీ, 'నీ భర్తకు గిట్టనివాళ్లు కీడు తెలపెట్టుతున్నా'రనీ, ఈ మొదలైనమాటలు చెప్పి, బెల్లించీ, భయపెట్టీ, ఆయా పీడాపరిహారార్థం తాయెత్తులిచ్చి, ఒకశేరు బియ్యమో, ఒక అణా డబ్బులో మాత్రం గుంజుకుపోతారు. 'వచ్చే సంవత్సరం నీవు కుమాళ్ళతల్లివౌతావు. అప్పుడు గొప్ప బహుమతీచెయ్యాలి'అని చెప్పిపోతూవుంటారు. వాడి అదృష్టంవల్ల ఆ మిడుతంభొట్లు జోస్యం ఫలిస్తే మరుసటిఏడు కొంతలబ్ధి కలుగకపోదు.

ఒక్కొక్కప్పుడు మగవాళ్ళకు, అందులో యౌవనవంతులకు, ముఖ్యంగా ఇంగ్లీషు చదువుకొని యీ మాయవేషాలు నమ్మని వారికి, వీరు చెప్పే జోస్యం చప్పున ఫలప్రాప్తి కలిగిస్తుంది. ఈ కాలపు పడుచువాళ్ళందరికీ వీర్యనష్టం, దుర్బలత్వమూ, నిస్తేజమూ సామాన్యలక్షణాలు.

ఈ సందర్భము నాధారం చేసుకొని వర్ధిల్లే మందుల కంపెనీలెన్నో చూస్తున్నాము. పత్రికలలో ప్రకటనల్లో నిర్వీర్యులకుండే లక్షణాలన్నీ వున్నదివున్నట్టుగా వర్ణించేటప్పటికి, ఈ పడుచువాళ్ళు ఆ మందులు ప్రత్యేకం తమ కోసమే పుట్టిన వనుకుంటారు.

ఆలాగే, ఈ బైరాగులుకూడా, కొంచెం వెలవెలబోయే పడుచువాళ్ళను చూడగానే, అయాచితంగా వారికి జోస్యం చెప్పుతారు. 'బాబూ! నీకు కలలువస్తాయి. నిదురపట్టదు. నిదరలో నీరసిస్తాది. ఇదిగో, ఈ వేరుముక్క నూరి, ఆవుపాలతో మూడుపూటలు పుచ్చుకుంటే ఏనుగంత సత్తువ వస్తుంది?' అని చెప్పి ఒక పావులాడబ్బులైనా గుంజుకుపోతారు.

ఏమైనా వీరి దంత ప్రమాదమైన విద్య కాదు. గంజాయి అలవాటుపడితేనే తప్ప పెద్ద పెద్ద ఎత్తు ఎత్తవలసిన అవసరం కలగదు.

ఉత్తర హిందూస్థానంనుంచీ దక్షిణదేశం నుంచీ వచ్చే సాధువులు మనభాష అర్థం చేసుకోరు. హిందీ అరవం నేర్చినవారు పల్లె టూరిలో చాలా అరుదుగా వుంటారు. అటు వంటివారిని సాధువులు ఏజంట్లుగా పెట్టుకొని జోస్యంచెప్పడం ప్రారంభిస్తారు. సాధువులు హిందీలో ఏదో మాట్లాడుతూవుంటే, మన అట్టుపుట్టు ఆనవాళ్ళన్నీ ఎటిగివున్న యీ యేజంటే మనకు తెలుగులో జోస్యం చెపు తాడు. భూత విషయములన్నీ దాఖలా యిచ్చే టప్పటికి, భవిష్యత్ఫలములన్నీ చప్పున నమ్మి వేస్తాము. ఇట్లా ఊళ్ళో ఒకరిద్దరు పెద్దలకు దాఖలాయి స్తే చాలు ఆ సాధువు పంట పండి నట్లే. ఇక మందులేకాదు, మాకులేకాదు, సంతానదానమే కాదు, భూతవైద్యమే కాదు,— ఎన్నయినా చేయవచ్చు. పాలు, పండ్లు, గంజాయివర్షం కురుస్తుంది. ఆ కీర్తితో, ఆ హంగుతో బస్తీలకు చేరుకుంటాడు. ఈ నాటకం విస్తరిస్తుంది. బ్రహ్మరథం పడతారు.

వీరిలోనే ఒక్కొక్కరు బంగారం చేయడం కూడా నేర్చివుంటారు. వారికి నిస్సంగత్వము మరీ ఎక్కువ. వా రెవరితోనూ మాట్లాడరు. ఎవరియందైనా అనుగ్రహం కలిగితే శిష్యుని ద్వారా మాట్లాడతారు గాని, స్వయముగా వారి వచనామృతం ఈ దీనులపై వర్షించదు. రససిద్ధులైన ఆ మహాయోగులకు మనతో యేమి పని? వారు తీర్థయాత్ర చేసుకొంటూ ఈ దారిని వచ్చారుకాని లేకపోతే హిమాలయ గుహలు వదలిపెట్టి ఎందుకువస్తారు? వారు కౌపీనమాత్రధారులు, భస్మావలిప్త దేహులై పంచాగ్నిమధ్యమం దెప్పుడూ సమాధిలోనే వుంటారు. వారికి పాలు, పండ్లు, జ్ఞానపత్రి కావలసివస్తే, ఒక బంగారపుపూజ శిష్యుని కిచ్చి తెప్పించుకొంటారు. (చిన్న గుండ్రని బంగారురేకులను పూజలని వాడుతారు)

శిష్యునిచేతికా పూజలివ్వడం చూచిన వార లా శిష్యుని వెంటబడతారు. స్వామి ప్రభావ మునుగూర్చి ఆ శిష్యుడు అనేక చిత్రవిచిత్ర కల్పనలుచేసి వర్ణించి చెప్పుతాడు. 'స్వామి వారు, వారికి కావలసిన బంగారం ఎప్పటి దప్పుడు చిలుముగొట్టముమీదనే తయారు చేస్తారు. ఒక్కొక్కప్పుడు మూలికాప్రయోగం చేస్తారు. ఒక్కొక్కసారి బంగారమే పొత్తు చేసి రెట్టింపుచేసి యిస్తారు' అని శిష్యుడు చెప్పుతూవుంటే, వాణ్ణి అనేకవిధాల ఆశ్ర యించి వారిద్వారా స్వామి అనుగ్రహము సంపాదించుకోవడానికి ప్రయత్నిస్తారు. 'ఏలా గైనా ఒక్కసారి బంగారం చేసేటప్పుడు మమ్ములనుకూడా 'చూడనివ్వ'మని వాణ్ణి బ్రతి మాలుకొంటారు. తుదకేలాగైతేనేమి తమ కండ్లయెదుటనే బంగారం చేసియివ్వడం చూస్తారు. ఇకనేముంది? వీళ్ళు శిష్యునిచేతి కీలుబొమ్మలైపోయి ఇంటనున్న బంగార మంతా, వానికి సమర్పించి సన్యాసులవుతారు. ఈ యాశ్రితులకు శిష్యులకూ జరిగే లావాదేవీ లతో స్వామికేమాత్రము సంబంధములేదు. ఈ నాటకమంతా శిష్యుడే నడుపుతాడు.

సన్యాసులు బంగారముచేయుట, ధనికులు ఆవిద్య వారినుండి నేర్చుకొని సన్యాసులగుట మామూలు. ఇలా ఎన్నికుటుంబములో నాశన మయినవి.

కనులయెదుట ప్రత్యక్షంగా ఒక్కసారి బంగారం చేసిచూపి విశ్వాసంపుట్టించడమే ఇందులో కీలకం. ఆ విశ్వాసం కలిగిన తరు

వాత బంగారం గుంజడానికి ఒక్కొక్క రొక్కొక్క మార్గ మవలంబించి మాయమై పోతారు. అవివరములు మన కంత ముఖ్యము కాదు. బంగారం ఎలాచేస్తాడా అనేదే ప్రశ్న.

ఎర్రలనీ, వానపాములనీ అంటాము మట్టిలోవుండే పొడుగాటిపురుగులను. చేపలు పట్టేవారు వీటినే గాలములకు గుచ్చి చేపల నాకర్షిస్తారు. ఈ మానవ మత్స్యములకు గూడా ఆ వానపాములే ఎరలై గాలమునోటి లోనికి ఆకర్షిస్తాయి. ఎలాగంటారా ? వినండి.

సన్నని బంగారుతీగలను ఈ వానపాముల కడుపులో నిలువుగా గుచ్చడం. అట్లా గుచ్చగానే ఆ పాములు చచ్చిపోయి, ఎండిపోయి వేళ్లవలె తయారవుతాయి. వాటిని చిన్న చిన్న ముక్కలకిందకోసి దగ్గిర వుంచుకోవాలి. ఎండి, ముడతలుపడి, వేళ్ళముక్కల వలెనున్న ఆ యెఱ్ఱలను జాగ్రత్తచేసికొని మూసలో పాదరసంవేసి నిప్పులమీద కరుగుతూ అందులో యీ వేరుముక్క ఒక్కటి పడవేస్తే పరి, పాదరసం ఎగిరి పోతుంది. చచ్చినపాము, ముక్కపొడి బూడిదవుతుంది. దాని కడుపులోవున్న బంగారపుతీగకరిగి బంగారపుపూజ అవుతుంది.

ఎంత చిత్రం! ఏకమూలికాప్రయోగంచేత, కళ్ళయెదుట స్వర్ణం, తయారయింది. ఎంతటి మహానుభావు లైనా వుంటారు.

ఇంకొక మార్గం చెపుతాను. ఒక గురిగింజ ఎత్తుగల పలచని బంగారపురేకు మూస అడుగున కొంచం జిగురురాచి అంటించాలి. అది కనుపడకుండా దానిపై కొంచం బూడిద తడిపి పూతపెట్టివుంచుకోవాలి. దానిని కుంపట్లో పెట్టి పాదరసంవేసి వూదేటప్పుడు దానిలో ఇక ఏ మన్నువేస్తేనేమి ? ఏ వేరుమొక్క వేస్తేనేమి ? అసలు మూసయే స్వర్ణగర్భ అయెను.

ఈ వుపాయాలు తెలియక కేవలం హస్త లాఘవంమీదనే ఆధారపడేవాళ్ళు వుంటారు. చిన్న రాగిబిళ్ళ తెప్పించి దానికి రోజూ ఏదో పసరుపూయించి, ఆరపెట్టించుతూ ఎప్పుడో సమయం కనిపెట్టి, పసరుపూతలతో పెసర పిండి వడియంలాగా తయారైన ఆ బిళ్ళను మార్చి, దానిస్థానే అటువంటిదే బంగారపు బిళ్ళను ప్రవేశపెట్టి దానిపైన మళ్ళా వానిచేతనే పూతలుపెట్టించి, చివరకు పుటంపెట్టించి బంగారముచేయాలి. ఇది కొంచెం ఆలస్యం. చాలా జాగ్రత్తకూడా అవసరం.

ఇంతకూ అసలు బంగారములేనిది బంగారము సృష్టి కాదన్నమాట. నిజమే! శూన్యములోనుంచి ఎన్నడైనా సృష్టి జరుగుతుందా మరి! కాబట్టి ఒకచిన్నమో రెండుచిన్నాలో బంగారం ముందు ఖర్చుపడాలి, ఈ విధంగా నమ్మకం పుట్టించడానికి. అవును. ఆమాత్రం పెట్టుబడిలేకుండా ఏ వ్యాపారం లాభించదు. అందులో, ఈ వ్యాపారంలో వచ్చేలాభంలో స్వల్పపెట్టుబడి ఎన్నోవంతు ? ఇందుచేతనే బంగారము ఎంత రవాణాచేసినా మనదేశములో తరుగుటలేదు.

ఈ రసవాదపు గొడవ ఇంతటితో వదలి, బైరాగులసంగతి మఱియొకటి చెప్పి ఇది ముగిస్తాను.

వంటినిండా బూడిదపూసుకొని, జడలు కట్టినతలతో, గడ్డముతో, గోచిపాతరాయిళ్ళు కొందరు ఏ వీధిమొగనో కూర్చుండి జపం చేస్తూవుంటారు. మొలకుపెట్టిన గోచీయే నడుముచుట్టూ తిప్పి కాసెవలె కట్టుకొంటారు. బజారువెంట వెళ్ళేవాళ్ళని పరిశీలించి చూస్తే,

జేబులో డబ్బులున్నవాణ్ణిగా, కొంచెమమా యికుణ్ణిగా, సులభంగా వశ్యమయ్యేవాణ్ణిగా చూచి, చప్పున 'ఒరే! యిటు రారా!' అని పిలుస్తాడు. ఆ సంబోధనమున కా యమాయికుడు తెల్లబోయి నిలుచుంటే, 'భయములేదు, దగ్గరకురారా, నీమీద దయగలిగింది గురూజీకి' అని చేరబిలిచి, 'చేయిచాపరా! ఇంద, ఇది పుచ్చుకో' అని వట్టిచేతిని పొడుముపట్టువలె పట్టిన మూడు వ్రేళ్ళతో చాచి, వాని చేతిలో నొక ద్రాక్షపండో, ఒక పటికబెల్లపు ముక్కో పడవేసి, 'తినరా!' అని చెప్పి వానిచేత తినిపిస్తాడు. లేదా, ఆ మూడువ్రేళ్ళ పట్టుతోనే యింత మన్నుదీసి వానిచేతిలో వదులుతాడు. ఆమన్ను, పసుపో, కుంకుమో అయి వూరుకుంటుంది. దానిని మొగాన పెట్టుకోమంటాడు. నోటిలో వేసుకొన్న ద్రాక్ష పండు తియ్యగానే వున్నప్పటికీ, ఈ యమాయకుడు అనుమానిస్తూ చప్పరించలేక గ్రుడ్లు వప్పగించి చూస్తూవుంటే, 'తినరా! భయము లేదు,' అని తినిపించుతాడు. ఈ విధముగా వానికి, విస్మయమూ, రిచ్చపాటు కలిగించి, 'జేబు చూడరా! . గురూజీకి పత్రికావాలి' అంటాడు. వాడు అట్లాగే వెలవెలబోతూ ఆ మహాప్రభావంచేత ముగ్ధుడై చేష్టలుదక్కి నిలిచియుండి, అవశుడైయే, జేబులోనికి చేయిపోనిస్తాడు. 'మనస్ఫూర్తిగా యివ్వరా! గురూజీకి పత్రి, పాలు. పండ్లుకావాలి, అనుమానించకుండా యిచ్చుకోరా!' అని పురి కొల్పేటప్పటికి వాడు అర్ధమం ఏ పావులా డబ్బులో తీసి, ఈ కొంచెం యిస్తే ఏమి బాగుంటుంది అని అనుకుంటూవుండగా వాడు, 'అనుమానిస్తావేమిరా! తీయి, జేబులో ఇంకా వుంది, తియ్యి' అని దారులుకొట్టేవానిలాగ గద్దిస్తూ, 'మాకేమి కావాలిరా! వెధవడబ్బు మా దగ్గిరలేదా! ఇదిగో' అని కుత్తుకక్రింద నరములపై నాలుగువ్రేళ్ళతో గలగలా మ్రోగించిచూపుతాడు. దానితో పాపము వాడు మరీ రిచ్చపడి జేబులో డబ్బులన్నీ సమర్పించి, నమస్కరించి, ధన్యుడనైనా ననుకొని వెళ్ళిపోతాడు.

పసుపు, కుంకుమా తడిపి చిన్న చిన్న వుండలుచేసి, మట్టిలో దొర్లించి, ఎండబెట్టి, ద్రాక్షపండ్లూ, చిన్న పటికబెల్లపుముక్కలూ, ఆ వుండాలూ, తనచుట్టూ నేలమీద మట్టిలో కనపడకుండా వుంచుకుంటాడు ఆ గురూజీ. లేదా, తన మొలచుట్టూవున్న కానెమడతల్లో వుంచుకుంటాడు. ఆ వస్తువులను, చూపుడు వ్రేలూ, తర్జనీవ్రేళ్ళమధ్య పట్టుకొని వానిని బొటనవ్రేలితో ముడిచిపట్టినపుడు మూడు వ్రేళ్ళమధ్యకు తీసికొని వానిచేతిలో వదలుతూ వుంటాడు. శూన్యంలోనుంచి పుట్టుకువస్తున్న ఈ పసుపుకుంకుమవుండలు ఆశ్చర్యం కలిగించడంలో నేమి ఆశ్చర్యము!

ఇది సామాన్య హస్తలాఘవపు గోసాయి చిటుక. వాని గంభీరాకారము, ధీరోక్తులూ, ఈ ప్రభావమూ కలిసి, పేదమనసువాణ్ణి మోహింపజేసి డబ్బు నాకర్షించుతవి.



# పెళ్ళికొడుకు

కొడవటిగంటి కృష్ణమూర్తి

"పెళ్ళికొడుక్కి కావాలని కాసిని మంచినీళ్ళు తెచ్చిపెట్టూ - మా అమ్మకాదూ!" అన్నాను నేను ఆ అమ్మాయితో.

"నీక్కావాలని చెప్పక మధ్య నాపేరెందుకోయి?" అన్నాడు అవధాన్లు.

"ముందు నువ్వు కలపవోయి!"

అదేం తమాషోకాని ఈ పెళ్ళిళ్ళల్లో అడ్డే అడ్డాటల్లో పేక వొక్కోడిని అంటుకుని మరి వదలదు! అవతల బాబాయి మంచంచుట్టూ మావాళ్ళు గంభీరంగా రాజకీయాలు పేనుతుంటే వయసుకాళ్ళం కొంతమంది పేకాట వేశాం. రెండు కిత్తాలలో పేక అవధాన్లు దగ్గిరికిచేరి స్థిరోభవ అయింది. కథానాయకుడు దుస్థితిలో వుండటం శోచనీయమని గ్రహించి వైరివర్గంలో వున్నా నేను అసలే తురుపులేకుండా ఏదో పిచ్చిఆట చెప్పటమూ, ఆపన్న షరతూ పైషరతులదాకా పోయి చివరకు అన్నీ అవధాన్లుమీద పడటమూ జరుగుతున్నది. ఏ పార్టీ ఆటచెప్పినా పై షరతుదాకా పోయేస్థితి మా ఆటకెప్పుడోపట్టింది. ఇలావుండగా అవతల రాజకీయాలలో పాల్గొనలేని పిల్లలు ఆ ఆటగాడి ఆదరాభిమానాల్నిపట్టి తలావకడికీ కనీసం ఒకరిదగ్గిర్నించి ముగ్గురిదాకా శెక్రటరీలలాగా తయారైనారు. పెళ్ళికొడుకు కనుక అవధాన్లు చుట్టూ ప్రత్యేక బలగం చేరింది. పెళ్ళికొడుకు పనిచెబితే చెయ్యననటానికి సాధారణంగా పెద్దవాళ్ళే ధైర్యంచెయ్యరు. ఇక పెళ్ళికొడుకు చెబితే చెయ్యాలన్న బులపాటం ఆడా మగా కలిపి పెళ్ళికివచ్చిన పిల్లలందరికీ వుండటమేకాక, ఆ తొందరలో ఆ చెంబెడు నీళ్లూ పారబొయ్యటమూ - జారిపడినా, ఎదురుదెబ్బలుతిన్నా ఎవ్వరూ లెక్కచెయ్యరు. అందుకని రాజకీయవేత్తలు చెయ్యాలిసినపని పెళ్ళికొడుకు పేరుతో కావలిసినవి ఏర్పాటుచేసుకోవటమే. అదీకాక దాదాపు నామీదపడుతున్నపిల్ల వచ్చే సంవత్సరమైనా తప్పకుండా పెళ్ళికావాలిసిన పాకంలో వుండటంవల్ల ఎవరన్నాచూస్తే బాగుండదని నా కోభయం!

దేముడికిమల్లే అవధాన్లుతల్లివచ్చి పిలిచి వాడిని ఎందుకో అవతలికి తీసుకెళ్ళింది. ఆట సాగిద్దామని కొంతమంది సణిగారు కాని నేనుమటుకు వుత్తరీయం దులిపి లేచాను. పెళ్ళిపరదా ఆనందిద్దామని వచ్చిన నాకుచాలా నిరుత్సాహంగా వుంది. నాకు బుద్ధితెలిసిం తరువాత మేమెంతసేపటికీ ఆడ పెళ్ళివాళ్లం అయి మగ పెళ్ళివారి ఆనందాభిరుచులకు బాధ్యత వహించాలిసి వచ్చింది. ఇప్పుడు మాలో మొగవారి పెళ్ళిళ్ళు ప్రారంభం అయింతర్వాత పరిస్థితులు ఇలా తయారైనై. పోనీ చిన్న కక్కయ్య కొడుకన్నా వుంటే కొంచం సరదాగా వుండేది. కక్కయ్య అయినా బాబాయిమీద వుక్రోషంతో పెళ్ళికిరాకపోగా కొడుకునుకూడా రాకుండా చెయ్యటంలో అర్థంలేదు. రావాలని చివరివరకూ వుషారుగానే వున్నాడు కాని కక్కయ్య వెళ్ళద్దని శాసించాడు. బాబాయి అయినా కక్కయ్యను రమ్మని ఒక్కమాట



"మళ్లీ కిటికీ దగ్గిరకొచ్చి 'ఏదిర నాసీత' అని పాడవుకదా !"

అంటే ఆయన వచ్చేవాడు. బాబాయి అటువంటిదెన్నడూ చెయ్యడు. అవధాన్లు వున్నాడనుకుంటే వాడు పెళ్ళికొడుకై ఎప్పుడోతప్ప ఎంతసేపటికీ పెళ్ళివారింటోనూ మేజువాణీలో ఆడవాళ్ళమధ్యా వుంటూ, చెయ్యమన్నది చేస్తూ, చెప్పింది చెప్పుతూవున్నాడు !

పెళ్ళిలో నాయకుడు పెళ్ళికొడుకే కాని, అవధాన్లుపెళ్ళిలోమటుకు నాయకుడు బాబాయి. మావాళ్ళందరికీ ఆయనంటే గౌరవం అలావుంచి కొద్దో గొప్పో హడలు. పెళ్ళికూతురివేపు వాళ్ళకు ఆయనంటే హడలేకాక గౌరవంకూడా తప్పదు. ఏక్షణంలోనైనా పెళ్ళి రద్దుచేయగలిగిన సామర్థ్యత ఆయనకుందని ఇరుపక్షాలవారికీ తెలిసినసంగతి సర్వవిదితం. పెళ్ళివారింటో బాబాయి అవసరాల నిమిత్తం ప్రత్యేకదళం ఏర్పాటయింది. ఒకచెంప అవధాన్లు పెళ్ళీ మరోచెంప బాబాయి డేవిడీ అంటే ఇంత ఇదికావటానికి బలవత్తరమైన కారణాలున్నాయి. నేను పుట్టకపూర్వంనించీ ఆయనకు తెలీకుండా మావాళ్ళు ఏదీ చెయ్యలేదని వదంతి. నాన్న బాబాయి ఆజ్ఞమీద బట్టలదుకాణం ఖాతామార్చాడు. వర్ధనమ్మ పిన్ని బాబాయి ప్రోద్బలం మీదనే మార్వాడీదగ్గిర అప్పుతెచ్చి కూతురి పెళ్ళిచేసింది. అప్పుతీర్చేభారం తనకువదలమనీ, ఏదీ అమ్మవద్దనీ బాబాయి అంటున్నా వినక సీతారామయ్య మామయ్య పొలం అమ్మి అప్పుతీర్చి తలదాచుకోటానికో ఇల్లు మిగుల్చుకున్నాడన్న మాటేకాని పొలంపోనే పోయింది ! అవధాన్లు తల్లిమటుకు బాబాయి సలహామీదనే మైనరుదావా తెచ్చేటప్పటికి అవధాన్లు తండ్రి పోగొట్టుకున్న భూమి ఇప్పుడు దేవరవారి దివ్యసముఖముద్వారా తిరిగిరావటానికి అసలు ఒక అవకాశం అంటూ కలిగింది ! ఒక్క చిన్నకక్కయ్యమటుకు బాబాయి కెదురుతిరిగాడు కాని దానిఫలితం ఇప్పుడాయన అవధాన్లు పెళ్ళికి రాకుండాపోవటమే !

అవధాన్లుకు సంబంధాలు వస్తున్నట్లు మొదట్లో నాకుతెలియదు. ఎన్నడూ కని విని ఎరగని మొహాలు బాబాయి ఇంటికి రావటమూ అందులోకొన్ని మళ్ళీ అయిపులేకుండా పోవటమూ గమనించి కౌతూహలవృత్తిచే విచారిస్తే పెళ్ళికవి తేలినా ఆసంగతి అవధాన్లుకే తెలియదు. ఈ వ్యవహారం మా కుటుంబంలో ఇతరుల కెంతతెలుసో తెలీదుకాని వారికెవ్వరికీ నాకున్న వుత్సాహమూ, అవధాన్లుకుకలిగిన ఆశ్చర్యమూ లేకపోవటంచూస్తే వాళ్ళకంతా తెలిసిఅన్నా వుండాలి, లేక ఏమీ తెలీకన్నా వుండాలి ! మాకూ అంతాతెలిస్తే మేమూ ఏమి తెలియనట్టుగా వుండవచ్చుకదా అని మురిశాంకాని చిన్నవాళ్ళం కావటంవల్ల కామాలు నిష్ప్రయోజనం అయిపోయింది. నిజానికి అవధాన్లుకు సంబంధాలు కుదరకపోవటంవల్లనే సంబంధాలు వస్తున్నయ్యనన్నా తెలిసింది. ఇక ఫలానికారణం అని చెప్పకుండా బాబాయి తోసిపుచ్చటం

"మీకు దెబ్బ ఎట్లా తగిలింది?"

"సరిగ్గా చెప్పలేను. మా ఆవిడచేతిలో తెడ్డులాగా...."



వల్లనే సంబంధాలు కుదరటంలేదనికూడా తెలిసింది ! మాకేది శ్రేయస్కరమో బాబాయికే తెలిసినప్పటికీ, కనీసం సంబంధించిన అవధాన్లు తల్లికి అది తెలియటం ధర్మమని ఒకపక్షం వాదన. ఏకారణంవల్లనైనా పనికిరానందువల్లనే తోసేస్తున్నాడన్న వాదనకూడా తీవ్రంగానే వుంది మరోపక్షంలో.

మధ్య ఈయన పెత్తనం ఏమిటని కొందరు గడుసువాళ్ళు పిల్లనిద్దామని సరాసరి అవధాన్లు తల్లిదగ్గిరికే వచ్చేసరికి ఆవిడ వాళ్ళని అవళంగా బాబాయిదగ్గిరికే తీసుకెళ్ళింది. మరి ఆ సంబంధంకాలేదు. ఆయన్ని తప్పించి సంబంధం కుదురుద్దామని వాళ్ళు ప్రయత్నించటం వల్లనే బంగారంలాంటి సంబంధం చెడగొట్టాడని గిట్టనివాళ్లు పుకారు పుట్టించారుకాని అలాచేసి బాబాయి బావుకునేదేమిటి అని మావాళ్ళ నమ్మకం. మైనరుదావా గెలిస్తే ఆస్తి వస్తుందన్న ఆశతోవచ్చిన సంబంధమేకాని పిల్లవాడి యోగ్యతాప్రవర్తన పద్ధతినిబట్టి వచ్చినది కాదని బాబాయికి బహుశా నమ్మకం చిక్కటంవల్లనే అది తప్పించాడన్న పుకారు మరోటి పుట్టిందేకాని, అంత ఆశతో వచ్చినవాళ్ళు ఆ ఆస్తి రావటానికి కారణభూతుడయ్యే బాబాయి దగ్గిరికి రాకపోతే ఏ బాబాయికైనా తిక్కతిరిగి ఏ సంబంధం అయినా తప్పిస్తాడన్న పుకారు మటుకు పుట్టనేలేదు ! అవధాన్లు తల్లికిమాత్రం ఆ సంబంధం చేసుకోవాలనేవుండి తర్వాత ఒకటి రెండుసార్లు "మంచిసంబంధం తప్పిపోయింది" అని గునిసేటప్పటికి ఆవిడ మనోవర్తి దావా గెలుస్తుందా గెలవదా అన్నంతవరకూ రావటమూ, దాంతో హడలేసి ఆవిడ అవధాన్లు భవిష్యత్తునంతా సంపూర్ణంగా బాబాయికే అప్పచెప్పటమూ జరిగింది !

ఒక సంబంధాన్ని బాబాయి "చేసుకోవచ్చు" నని సిఫారసుచెయ్యటమేకాక ఆయన నిర్ణయానికి కారణాలనికూడా విశదీకరించాడు—అంతవరకూ ఆయన ఎన్నడూచెయ్యనిది. అయితే అది అవధాన్లుకు నచ్చలేదు. చిన్నవాడు వాడికి నచ్చేదేమిటి అని తల్లి అన్నా పెళ్ళికొడుక్కు ఇష్టంలేకుండా జరగటానికి వీల్లేదన్నాడు బాబాయి. చిత్రమేమిటంటే అవధాన్లు తనమాట వినకపోయినా బాబాయికి కష్టంకలిగినట్లు తోచదు. ఇంకోడికి ఇష్టంలేకపోవటంవల్ల ఆయన తన నిర్ణయాన్ని మార్చుకోవటంకూడా ఇంతవరకూ జరగలేదు. చేసుకోవచ్చునని చెప్పినా నిజంగా అది బాబాయికి ఇష్టంలేదని నా అనుమానం. బాబాయి శాసించటంచూస్తే అవధాన్లుకు ఇష్టంలేకపోవటం ఆయనకు సమ్మతమేనని తోస్తుంది. బాబాయికి ఇష్టంలేదని గ్రహించే అవధాన్లు వద్దన్నాడో లేక అవధాన్లు ఇష్టంవుండదని గ్రహించి బాబాయి చేసుకోవచ్చునన్నాడో చెప్పలేం. ఆ సంబంధం కాకపోవటంలో ఈశ్వరేచ్ఛ ఎంతో, బాబాయి మనోబలం ఎంతో చెప్పలేం. బాబాయికే ఎదురుతిరిగాడన్న నింద అవధాన్లుకే వచ్చింది కాని

చిన్నవాడిని లక్ష్యంచేశాడన్నమాట బాబాయికి రానేలేదు. ఇక "చేసుకోవచ్చు" ననే చెప్పాడు కాని "చేసుకో" మని బాబాయి అనలేదని సీతారామయ్యమామయ్యభాష్యం! ఇంకోచిత్రం ఏమిటంటే బాబాయి చేసుకోవచ్చునని కారణాలు చెప్పినప్పుడు "చేసుకోవద్దు" అన్న అభిప్రాయమే బలమైందినాకు. అవధాన్లుకూడా అదేకారణంవల్లనే ఇష్టపడలేదని తర్వాత తెలిసింది, ఏమయినా బాబాయి కారణాలుచెప్పనప్పుడే బాగుందని నా నమ్మకం!

ఇంతలో అవధాన్లుకు సంబంధం నిశ్చయమయిందని వేడికబురు. అవధాన్లుపెళ్ళి పెద్ద లొల్లిగా తయారవటంవల్ల ఈసారి పుటాణీ మరింత గూడుగా జరిగిందట! ఫలాని పిల్ల, కట్నంవగైరా తెలిసింతర్వాత మాలో కొందరిమొహాలు మాడినమాట వాస్తవం. ఇప్పుడు నిశ్చయమైన సంబంధం ఇదివరకు తప్పిపోయినవాటికంటె ఏవిధంగానూ మిన్నకాదు. బాబాయికి అందరిక్షేమం కావలసినప్పటికీ, పెళ్ళిచేసుకునేది అవధాన్లే అయినప్పటికీ మనుషులం అయింతరువాత అభిప్రాయాలంటూ లేకుండాపోవు. మన అభిప్రాయాలవల్ల పరిస్థితులు మారవని తెలిసినా అభిప్రాయాలు మటుకు మారవుకూడాను! బాబాయి శాసనం ప్రకారం ఏ సంబంధం కుదిరినా అది బాబాయికీ అవధాన్లుకూ సమ్మతం కావాలని నిర్ణయ మయినప్పటికీ ఈ సంబంధంమటుకు అవధాన్లుకే ఇష్టంలేదని నా నమ్మకం. అవధాన్లును ఎరిగినవాళ్ళెవరూ వాడుదీనికి అంగీకరించాడంటే నమ్మరు. ఇష్టంలేకపోతే వాడు యెదురుతిరిగే స్వభావమేకాక వాడికి అసలు ఇలాంటి వివాహం కావటంకూడా ఇష్టంలేదని నాకుతెలును. వచ్చిన సంబంధాలకు గుణగణాలు ఎంచి, పనికివస్తుంది, పనికిరాదు అనే నిర్ణయంకావటం జరిగేటప్పటికి పెద్దవాళ్ళందరికీ అవధాన్లుకు మంచి సంబంధం తేవాలన్న పట్టుదలే కలిగిందికాని వాడికసలు వివాహం ఇష్టంలేదేమోనన్న ఆలోచన యెవ్వరికీ పోలేదు. అవధాన్లు ప్రవర్తన అయినా వివాహానికే తన అసమ్మతిని చూపేటట్టుగా వుండలేదు. పైపెచ్చు పెళ్ళి ప్రసంగాలలో వాడు ఒకమూలకు తరమబడటంవల్ల అక్కడినుంచి ఒక్కసారిగా తప్పించుకోవటం అంత సులభంకాదు. తగినట్టు బాబాయి ఒకటి నిర్ణయించిం తరువాత తనకు వివాహేచ్ఛ లేదని అవధాన్లుస్థితిలో వున్నవాడెవడూ చెప్పలేడు. అంటే ఎదురుతిరిగే అవధాన్లు సహజస్వభావానికి పదును చట్టుబండలైపోయింది. నట్టుగా వకవేళ యెదురుతిరిగినా బాబాయి నిరంకుశ శాసనం వాడినోరు కట్టేసివుండాలి. జీవితమంతా అనుభవించాలిసినదీ, కొడుకులు, మనుమల భవిష్యత్తును కూడా నిర్ణయించ గలిగినదీఅయి, అతి ముఖ్యమయిన వివాహ నిర్ణయంలో అత్యంత ముఖ్యుడైన మరో పెళ్ళికొడుకు త్యాగంచేయబడ్డాడని చెప్పకతప్పదు. మొదటినుంచి జాగ్రత్తగా ఇల్లుసర్దుకోక ఎప్పుడో యేదో చేయలేమా అని మురిసేవాళ్ళందరిగతీ ఇంతే!

ఇంత తంతూజరిపి, పెళ్ళికి తనురావటం అనవసరమని బాబాయి భీష్మించటం, బైలుదేరిన పెళ్ళివారం ఆగేస్థితిరావటం గడిచినవిషయం. సరియైన సంబంధం కుదిరేవరకే తనబాధ్యత అనీ, పెళ్ళిచేసుకునేది అవధాన్లుకనక తను అనవసరమనీ, బోలెడు ఇతరపనులు అలాగే వుండిపోయినై అనీ బాబాయివాదన. అదంతా నిజమే అయినా ఈ పెళ్ళే ఇష్టంలేని కొంతమందికి బాబాయివాదన వెగటుకలిగించింది. చివరకు అవధాన్లు బతిమాలిం తరువాత పెళ్ళికొడుకుమాటే తిరస్కరించటం శుభచిహ్నం కాదనుకున్నాడో యేమో బాబాయి అన్నిపనులూవదలి పెళ్ళికి వచ్చేశాడు—పాపం! ఈ వివాహం నిర్ణయించినందుకు అవధాన్లు కేమన్నా బాబాయిమీద గుర్రుగావుంటే అది ఈ దెబ్బతో వదిలివుంటుంది. బాబాయికి పెళ్ళివారింటోకూడా విరామం కలగలేదు. ఆయన అవస్థచూసి బలవంతంచేసి ఆయన్ని తీసుకురాకుండా వుంటే బాగుండేదని తోచింది నాకు!

లగ్గం అయిన దగ్గిర్నించీ బాబాయిచుట్టూ ఒకచోటకూడతగని నక్షత్రమండలం చేరిం తరువాత సాధారణంగా కొంపలంటుకోకుండా వుండవు. కట్నం కానుకలలో నిర్ణయించుకున్న షరతులు కొన్ని దొడ్డిదారిపట్టినై అని మావిడిది గూడెంలో వదంతి. షరతులతో పెళ్ళిళ్ళు చేయదలుచుకున్నవాళ్ళు వాటిని ఎందుకు పాటించరో తెలియదు. ఈ షరతులైనా బాబాయికే తెలియటంవల్ల ఆయన సమాధిలో పడి చాలాసేపు మాట్లాడనేలేదు. మాటలతో మూటలుపోవు. అయిన సంబంధం కావాలన్నా పోదుకాని చివరకు మిగిలేవి మాటలే! దేనికి తగిన అనుపానం దానికి వుంటుంది కనక మాలో పూటకొకరికి ఆకలిలేకుండా పోవటమూ, పెళ్ళివారు వచ్చి ప్రాధేయపడటమూ జరిగి బూజంబంతి నాటి సాయంత్రానికి మాలో విశేష బలగానికి ఆకలి అసలే లేకుండాపోయింది! ఎప్పుడయినా ఎవరికైనా ఆకలినశిస్తే ఏ ఇబ్బందీలేదు కాని పెళ్ళిళ్ళల్లోమటుకు మగపెళ్ళివారిలో ఏ బద్రిగాడికైనా సరే ఆకలి నశించటం అతి ప్రమాదకర మని ఆడపెళ్ళివా రందరికీ తెలిసిన విషయం!

పెళ్ళిలో ఆకలిలేకుండా పోవటానికి అలగటం అని అర్థంట. సన్నిపాతానికి పదునాలుగో రోజు ఎలాంటిదో ఆకలికి బూజంబంతి అలాంటిది. వూళ్ళోవాళ్ళని కూడా ఆ రోజునే పిలవటంవల్ల బలాబలాలకు అదే తరుణం. కానుకల నిర్ణయంలో బాబాయిచేసిన పొరబాటు అతి స్వల్పమయినది అయినప్పటికీ పెళ్ళివారు దాని విషయంలో బిగియటానికి కారణం ఈ సంప్రదింపులు మొదటినించీ సంసారపక్షంగా జరక్క ఎక్కువ తక్కువలమీదనే ఎక్కువ తీక్షణంగా నిర్ణయం కావటమే. అవధాన్లు భవిష్యత్తు అంతా నిర్ణయాలమీద ఆధారం కా గలిగినప్పుడు వాటి విషయంలో బాబాయి మొదటనే అతి జాగ్రత్తగా వుండవలిసిన బాధ్యత అలావుంచి ఇప్పుడు ఆ నిర్ణయాలను దాటిపోవటంకూడ ప్రమాదం అని తోస్తుంది! అసలు బాబాయి మొదటనే ఆ నిర్ణయాలను మరో పురుగుకు తెలియచేసినా ఆ లోపాన్ని ఎప్పుడో గుర్తించేవాళ్ళు. అలా కాక భారమంతా అప్పుడు బాబాయే మీదవేసుకొనె. కనీసం ఇప్పుడు చెయ్యాలిసిన పని జరిగిన లోపాన్ని గమనించటంమాని కార్యం పూర్తిచేయటం. అలాకాక పెళ్ళివారు వచ్చి అందరినీ మడిగట్టుకో మనటమూ ఎవడికి వాడు ఆకలి లేదనటమూ. చివరకు వాళ్ళు బాబాయిని ప్రాధేయపడ్డారు. అయితే బాబాయి చేతులు దులుపుకొని భారం అంతా అవధాన్లుమీద పెట్టాడు. ఒక్కసారిగా వచ్చిపడిన దీనిని భరించలేకనా అన్నట్టు అవధాన్లుకు దాంతో అకలి కాస్త నశించింది! మొదటినించి కార్యక్రమంతో వీసంవాసికూడా అవధాన్లుకు సంబంధం లేకపోయినప్పటికీ ఈ క్షణంలో ఆయన్ను కాపాడాలిసిన విధి వాడిమీదికి వచ్చింది. అవధాన్లును పిలిచి తల్లి ఏర్పాటుచేసినది అదే. బాబాయి ప్రాముఖ్యత తగ్గకపోయినప్పటికీ పెళ్ళికొడుక్కువుండే ప్రాముఖ్యతను బాబాయికూడా గుర్తించక తప్పలేదు!

ఇలాంటి పెళ్ళి ఎలా సరదాగా వుంటుంది?

దీనికి తగినట్టు పిడుగువంటి కబురు ఇంకోటి బైటికొచ్చింది. మొదట అవధాన్లుకు తప్పిపోయిన సంబంధం వారికీ, తర్వాత బాబాయి చేసుకోవచ్చునన్నా అవధాన్లు ఇష్టపడక పోవటంవల్ల తప్పిన సంబంధం వారికీ, ఇప్పుడు నిశ్చయమైన సంబంధం వారికీ సన్నిహిత సంబంధం వుందిట. అంటే ఒకవేళ ఈ సంబంధం తప్పినా వీరి తాలూకు పిల్ల సంబంధమే మరోటి అవధాన్లుకు వచ్చేదన్నమాట! అందులో అంత ప్రమాదమేమీ లేకపోవచ్చును కాని అవధాన్లుకు వచ్చిన సంబంధాలన్నీ ఒకజాతివే కావటం వక వింత. ఒకదాన్ని వదిలినా ఆ జాతిదాన్నే గుర్తించలేక బాబాయే పొరబాటుపడటం మరో వింత. ఇక వింతల్లోకల్లా వింత ఏమిటంటే ఈ సంబంధాలు వచ్చిన కుటుంబానికీ, అవధాన్లు తల్లి మైనర్లుద్వారా తెచ్చిన కుటుంబానికీ వున్న సన్నిహిత సంబంధం! వీళ్ళంతా పెళ్ళికి హాజరయినా వీళ్ళని నఖశిఖ

పర్యంతమూ ఎరిగిన ఒక్క బాబాయికి తప్ప ఆ సంగతి మా కెవ్వరికీ తెలియనే తెలియదు ! బాబాయే పొరబాటుపడితే కడంవాళ్ళు లెక్కకాదు !

అయితే ఇవన్నీ ఆలోచించటానికి ఇప్పుడెవ్వరికీ తాహతూలేదు పైగా సమయమూలేదు. కొంచెంసేపు అవధాన్లు గునియటం మావాళ్ళకు బాగానేవుందికాని తర్వాత అర్థంకాలేదు. అవధాన్లు ఆకలిని వదిలి తలనొప్పిగావుందని మొదలుపెట్టాడు. అమ్మమ్మ ఇన్ని మెరపకాయలు దిష్టితీసిపోసినా తగ్గలేదు ; తల్లి బతిమాలినా ప్రయోజనం కలగలేదు. పొద్దుపోతున్నది. అందరికీ ఆకలిగానే వుందికాని ఇప్పుడు బయటపడలేం. మా ప్రాణాలన్నీ పెళ్ళికొడుకుమీద ఆధారపడినై. దీనికితగినట్లు వాడు తలనొప్పివికూడా వదిలి అసలు రాననటం సాగించాడు ! కదలని బస్సును అందులో ఎక్కవవాళ్ళు తోసినట్టు అందరం అనేకవిధాల ప్రయత్నించాం. పెళ్ళివారు పైగా మాప్రయత్నంచూస్తూ నిల్చున్నారు ! అవధాన్లు వాలకంచూస్తే వాడు కొన్ని సంవత్సరాలదాకా కదిలేటట్టులేదు. మావాళ్ళకి అవధాన్లు అంటే కోపంకూడా వచ్చింది. మరోసమయం అయితే సీతారామయ్య మామయ్య వాడిని రెక్కపట్టించి నడిపించివుండును— ఆయనదగ్గిర వాడికి అంతచనువు వుంది ; పెళ్ళి ఆపి మేము వెళ్ళిపోవటానికన్నా ముందు ఇంత తినాలి ! అవధాన్లును అలగమని మావాళ్ళు పురిపెట్టినమాట వాస్తవమేకాని అది విప్పినా వాడి అలక వదల్లేదు.

ఇంతలో యెవరో బాబాయిని తీసుకువచ్చారు. ఇప్పుడు ఆయన వుభయులకూ సలహా చెప్పాలిసి వచ్చింది. ప్రస్తుతం ఆయన సలహా వుభయులకూ అనవసరం. అంతావకదారి పట్టారు. మొండి కేసింది పెళ్ళికొడుకే. మడిగట్టుకోమని మమ్మల్నితరిమి వాడూ ఆయనా యేదో మాట్లాడుకున్నారు. మొత్తంమీద పెళ్ళివారం బైలుదేరి భోజనంచేసి వచ్చేటప్పటికి అందరికీ విసుగూ నిస్త్రాణకలిగింది. దానికి తగినట్టు మేము వెళ్ళేటప్పటికి వూళ్ళోవాళ్ళంతా సిద్ధంగాకూచుని మాకోసం కనిపెట్టుకు కూచున్నారు. వాళ్ళ మధ్యనించి వెళుతుంటే అందరూ చూస్తుండగా యేదో నేరంచేసినవాడు వీధిగుండా వెళుతున్నట్టు అనిపించింది !

పెళ్ళి అయి మేము ఇంటికివచ్చేశాంకాని ముందు బోలెడు గ్రంథం వుండేటట్టు తోస్తుంది. పెళ్ళివారికీ బాబాయికీ మధ్య లావాదేవి అలావుంచి అవధాన్లు చివరకు బాబాయిచేత బతిమాలించుకుని ఆరోజున కదలలేదు. పిల్లవేపువాళ్లు బాబాయిని వదిలి అవధాన్లుతోనే వ్యవహారం జరిపినా, జరిగిందానితో తృప్తిపడక బాబాయి అవధాన్లు కుటుంబవ్యవహారంలో జోక్యం కలగచేసుకున్నా గోలతప్పదు. పిల్లనాధారంచేసుకుని ఆస్తి నెగగొట్టటానికి వాళ్ల ప్రయత్నించవచ్చు. బహుశా అంత వుద్దేశం వుండమట్టే వాళ్ళు యేదో పిల్లను ఎలాగైనా అవధాన్లుకు అంటగట్టాలని అంత ప్రయత్నంచేసి వుంటారు. ఇది గుర్తించి పిల్లలతోపాటు ఆస్తికూడా వచ్చేటట్టు బాబాయి చెయ్యలేకపోయినాడు. అందుకని ఇప్పుడు బాబాయి అవధాన్లు వ్యవహారంలో కల్పించుకోక మానడు. పిల్లవేపువాళ్ళు అయినా ముందు అవధాన్లుతోటే ఎక్కువ ప్రమేయం కలిగించుకోక తప్పదు. అందువల్ల మధ్యనలిగేది అవధాన్లూ, వాడిసంతతీ. కాబట్టి అవధాన్లు భవిష్యత్తు అంతా షరతులమీదనూ నిర్ణయాలమీదనూకాక చివరకు బాబాయి మీదనే ఆధారపడివుంది. అందుకనే కామాలు తానొకటి తలిస్తే దైవం ఇంకొటి తలుస్తుం దంటారు ! బాబాయికి అవధాన్లు ఎదురుతిరిగిన సంగతి ఇప్పుడెవ్వరికీ జ్ఞాపకంలేకపోగానే చెబితే అది ఎదురుతిరగటం అనికూడా నమ్మరు. ఈ ఎదురుతిరిగే స్వభావమే అవధాన్లును ఎప్పటికైనా కాపాడుతుందని మా నమ్మకం !



# జనవరి నెల భావపరిచయ పోటి

**బహుమానం 10-0-0.**



నిబంధనలు:-ఆంధ్రజ్యోతి పాఠకులందరూ యీ పోటీలో పాల్గొనవచ్చును.

వ్యాఖ్య కార్డుమీదనే వ్రాయాలి.

బహుమతి నిర్ణయంలో సంపాదకునిదే తుదితీర్పు.

దీనిపై ఉత్తర ప్రత్యుత్తరాలు జరుపబడవు. వ్యాఖ్యచేరు తుది తేది 22-1-47



జనమంచి రామకృష్ణ

ఇంటి చుట్టూరా, తెరవేసుకున్నట్లు చూర్ల మ్మట, ఏకధారగా వర్షం పడుతూంది. ఈ ఇంటిమీది కాకి ఆ ఇంటిమీద వాలకండా వుంది. ఆ రాత్రి ముసుగుతన్ని ఎవళ్ళకి వాళ్ళం పడుకున్నాము. ఇంటి తలుపు ఎవరో తట్టినట్లయింది. ఆవేళ, అన్నయ్యతో కన్నబాబు కుక్కపిల్లని తెచ్చిఇస్తానని చెప్పినప్పణ్ణించీ, నాకు ప్రపంచం అంతా బుల్లికుక్కపిల్లలాగే కనిపించేది. రాత్రిళ్ళు కాస్త ఆకు అల్లాడితే చాలు, ఉలిక్కిపడి 'అదిగో, కన్నబాబు కుక్కపిల్ల తెస్తున్నాడు! అదిగో! వినిపించడం లేదూ! దానిమెడలో కట్టిన మువ్వలచప్పుడు!' అని లేచి అమ్మని వేధించుకు తినేవాణ్ణి.

ఇంటితలుపు మళ్ళా చప్పుడైంది. చలిచేత వణుకుతూన్న గొంతు వినిపించింది. తెరచిన గొడుగు మూసిన శబ్దమైంది. "మోహన్! ఒరేయి మోహన్!" అని పిలుపు వినిపించింది. నేను గుభాలున లేచాను. ఔను. ఆ పిలుపు నాకు పరిచితమే! అన్నయ్యని అలాగే పిలుస్తాడు కన్నబాబు. అన్నయ్య మంచందగ్గిరికి పరుగెత్తాను. మా అన్నయ్యంటే నాకెంతేనా భయం. అందులోనూ నిద్రపోతూన్నప్పుడు, వాణ్ణి ఎవరేనా లేపారంటే....అమ్మో! మీద విరుచుకుపడతాడు! ఎట్లాగ! కుక్కపిల్ల! అమ్మతో చెప్పాను. ఇంటిపనంతా చేసుకుని అప్పుడే నడుం వాల్చింది అమ్మ. అమ్మ లేచి, 'నాయనా! మోహన్! బాబా చూడు! నీకోసం కన్నబాబు వచ్చాడురా!" అంది. అన్నయ్య ముసుగుతీసి 'అఁ! కన్నబాబా? ఛా! కన్నబాబులేడు ఎవరూలేరు!...నిన్ను లేపింది తమ్ముడేనా? వాడికి ఎవళ్ళు పిల్చినా కన్నబాబు గొంతుకలాగే వినిపిస్తుందిలే! వెధవ కుక్కపిల్ల!' "ఒరేయి మోహన్! మోహన్! తలుపు తియ్యరా! బట్టలు తడిసిపోతున్నాయి!"

అన్నయ్య లేచాడు బద్ధకంగా, నన్ను తిడుతూ. ఎందుకో నన్ను తిట్టడం? నేను అమ్మ పమిటకొంగుచాటుని నక్కి బిక్కుబిక్కుమంటూ చూస్తున్నాను. అన్నయ్య తలుపు తెరుస్తూంటే, నేను కళ్ళు పెద్దవి చేసుకొని కన్నబాబు చేతులకేసి చూశాను. తెల్లగావుంది! మెల్లగా ఇటూ అటూ కదులుతూంది. ఆనందంతో నాకు ఒళ్ళు తెలియలేదు. అన్నయ్య వున్నాడన్నమాట కూడా మర్చిపోయి ఒక్కపరుగున వెళ్ళి కుక్కపిల్లని లాక్కున్నాను. అన్నయ్య, నన్నూ కుక్కపిల్లనీ కసిరికొడతాడేమోనని భయం

వేసింది. కుక్కపిల్లని చేత్తో పట్టుకుని తల దువ్వుతూ అన్నయ్యకేసి జాలిగా ఆనందంగా చూశాను. ఎందుకో నా బుల్లి కుక్కపిల్లకూడా అన్నయ్యకేసి, నీలాల్లా మెరిసిపోయే కళ్ళతో ఒక్కసారి చూసి నా గుండెల్లోకి దూరడం మొదలెట్టింది. అన్నయ్య ముఖంలో నవ్వు కనిపించింది.



"తమ్ముడూ! ఏదిరా! కుక్కపిల్లని ఓమాటు నన్ను చూడనివ్వరా!....ఒరేయి కన్నబాబూ! నువ్వు ఆవేళ కుక్కపిల్లని ఇస్తానని చెప్పినప్పటినుంచీ వీడు పగలూ రాత్రీకూడా కుక్కపిల్లగురించి అదే పలవరించడం మొదలెట్టాడురా! పైగా, నీకు తెలుసునో తెలియదో వీడు రోజూ మీ ఇంటికివచ్చి, మీ కుక్క కడుపు మీద చెవిబెట్టి, కుక్కపిల్ల లోపల ఏంచేస్తూందో వినేవాడట. ఇంటికొచ్చి, 'అమ్మా! మన కుక్కపిల్ల వాళ్ళమ్మ కడుపులో బబ్బుని 'అ. మూ! అమూ! నీ దగ్గిరకొచ్చేస్తా! ఎప్పుడు అమూ! నీతో ఆడుకోడం!' అంటూందే, అని అమ్మతో చెప్తూవచ్చాడు.... ....పరేరా! మంచి పిల్లనే ఇచ్చావు! సరిగ్గా తల్లిపోలికే!" అంటూ కుక్కపిల్లగోళ్ళు లెక్కపెడుతూ అన్నయ్య నుంచున్నాడు.

కన్నబాబు వెళ్ళిపోయాక తలుపు గడియ వేసి అన్నయ్య పడుకున్నాడు. నాకు ఏం చేయడానికీ తోచింది కాదు. నాన్నకి చూపించవద్దూ కుక్కపిల్లని! నాన్నకి కుక్కలంటే చాల ఇష్టం: కుక్కలగురించి ఆయనకి ఎన్ని కథలొచ్చునని! కుక్కపిల్లని పట్టుకుని నాన్న మంచందగ్గిరకెళ్ళాను. మెలకువగానేవున్నారు. కళ్ళుమూసుకుని, ఏదో ఆనందంలో కూనిరాగం తీస్తున్నారు. లేపకుండా, కుక్కపిల్లని ఆయన గుండెలమీద పెట్టి 'నాన్నా! కళ్ళు తెరిచి మీ గుండెలమీద ఏమిటుందో చెప్పుకోండి?' అందామనుకున్నాను. కాని, అమ్మ జ్ఞాపకం వచ్చింది: అమూ! పడుకుని నాన్న ఎప్పుడేనా కూనిరాగం తీస్తూంటే మట్టుకు పల్కరించకే! ఎందుకంటే, నాన్న అప్పుడు ఏదో పద్యం గురించి ఆలోచిస్తున్నారన్న మాట!

నాన్నని పలకరించకుండా మళ్ళా, అమ్మ పక్కదగ్గిరకెళ్ళి కూర్చున్నాను. అమ్మ ముఖం మీద కుంకుంబొట్టు కోహినూరులా మెరిసిపోతూంది. లేపుదామనుకున్నాను కాని, ఎందుకో 'పాపం!' అనిపించింది. అమ్మ పక్కనే కూచున్నవాణ్ణి లేచి, కిందకూర్చుని కుక్కపిల్లని దింపాను. నేలమీద ఆగకుండా

నా కాళ్ళమధ్య, బిక్కుబిక్కుమంటూ వణుకుతూ దూరడం మొదలెట్టింది. కుక్కపిల్లని ఎలాగో అలాగ నిద్రనుండి లేపుతాననుకో. అడు కోడం ఎట్లా! బంతి యెగరవేస్తే చప్పుడౌ తుంది. అమ్మో! అన్నయ్యలేచి నన్ను చంపెయ్యడూ! గుండెలమీద కుక్కపిల్ల నెట్టుకుని, అమ్మపక్కని పడుకున్నాను. ఎప్పుడుపట్టిందో నిద్ర నాకుతెలియదు, కాని కుక్కపిల్ల మూలంగా మెళుకువ వచ్చేసింది. తల్లిదగ్గిర పాలుత్రాగడం అలవాటు పోవ్వున, కుక్కపిల్ల, నా కాలివేలుచీకడం మొద లెట్టింది.

కుక్కపిల్లకి ఏంపేరు పెట్టాలో అనే సమస్యమీద, ఇంట్లో పెద్ద పెద్ద చర్చలు జరి గాయి. "నాకు నువ్వు పేరుపెట్టు అమూ!" అని నా కుక్కపిల్ల ఓనాడువచ్చి నా కాళ్ళమీద తలపెట్టి గారాబంగా అడిగింది. ఇంట్లో కుక్కపిల్ల పేరుగురించి చీట్లువేయడానికి నిశ్చయం ఐంది. అందరం కూర్చున్నాము. ఎవరికి ఇష్టమైనపేరు వారివారి చీటీలమీద వ్రాశారు. ఆఖరికి, అన్ని చీటీలను కలిపి కుప్పగాపెట్టాము. చీటీ తీసేందుకు కుక్క పిల్లని వదిలాము. అది వయ్యారంగా తోక వూపుకుంటూ వెళ్ళి ఎర్రచీటీ నోటితో కరు చుకు నాదగ్గిరకొచ్చింది. నేను ఒక్కగంతు వేశాను. తెరిచిచూస్తే 'అర్గాస్' అని వ్రాసి వుంది. ఆ యెర్రచీటీ నాది ఎర్రకాగితంమీద నేను ఎందుకు వ్రాశానో ఎవ్వరికీ తెలియదు— ఒక్క నాకూ నా కుక్కపిల్ల కీతప్ప - ఎర్ర రంగంటే నా కుక్కపిల్లకి యెందుకో కళ్ళు చెదిరిపోతాయి. అందుకే ఆ చీటీ ఎత్తింది. అర్గాస్ అన్నపేరు నాకెందు కంత ఇష్టమో తెలుసా? నాన్న యులిసస్ కథ చెపుతూ — అతని కుక్క - అర్గాస్ - గురించి యెంతో బాగా చెప్పారు. అప్పట్నించీ కుక్కపిల్లని సంపాదించుకుని అర్గాస్ పేరు పెట్టుకుందా మని కలలుకంటూండేవాణ్ణి.


అర్గాస్ వయస్సు బహుశా, నెలవుంటుం దేమో! ఐనా మంచి బలంగా వుండేది. కొత్తగావచ్చినప్పుడు, నిద్రలో ఉలిక్కిపడి లేచి దాని అమ్మకోసం, 'కుయ్యో! కుయ్యో!' మని యేడ్చేది. దగ్గిరకెళ్ళిచూస్తే, కళ్ళమ్మట నీళ్ళుకూడా కారినట్లు కనిపించేది. ఎందుకో, ఒంటరిగా నన్ను ఇంట్లో వదిలేసి, అమ్మ తాతగారింటికి వెళ్ళినప్పుడు నేను, కడుపు పగిలే యేడ్పుతో గడిపిన రాత్రుల్ని జ్ఞప్తికి తెచ్చింది నా అర్గాస్ యేడుపు.

చెల్లాయి బొమ్మల కొలువులో ఓ చిన్న పందిరి పట్టిమంచం వుంది. దానిమీద చెల్లాయి తన రబ్బరు బొమ్మను పడుకోబెట్టి జోలపాటలు పాడుతుంది. మమ్మల్నెవళ్ళనీ ఆ బొమ్మలకొలువు దగ్గిరికి రానిచ్చేదికాదు. ఓనాడు ప్రొద్దున్నేలేచి చూస్తునుగదా, అర్గా సుని ఆపందిరిపట్టిమంచంమీద పడుకోబెట్టి జోకొడుతూంది చెల్లాయి.

"చెల్లాయి! నువ్వెంత మంచిదానివే! ఇప్పుడు అర్గాసుకి వళ్లునొప్పులు చెయ్యదు కదూ!" అని, చెల్లాయి పక్కకి జరిగి, ఆమె తోపాటు జోలపాటలు పాడాను. అర్గాసు పందిరి మంచంమీద పడుకోడం చూసి, "అమూ! కనకపు సింహాసనమ్మున శునకము కూర్చుండబెట్టి...." అని, పాడుతూ, నాన్న విరగబడి నవ్వారు. నాకు సుమతీశతకంమీద చాలా కోపంవచ్చింది. అర్గాసుకి, అదుకుం దుకు ఆ పుస్తకం ఇచ్చేద్దా మనుకున్నాను. కాని చూరులో నాన్నదాచిన పేముబెత్తం కని పించింది!

అర్గాసు ఎంత అందంగా పెరిగి పెద్దదౌ తోందనుకున్నారు! మంచిజాతికుక్క అవడం

చేత ఎటువంటి పాడు అలవాట్లూ ఉండేవి కావు. అందరితోటీ తలలోని నాలికలా, మెలిగేది. అమరకోశంలోని శ్లోకాలు నాన్నకి అప్పచెప్పడంచేత, నాన్న సంతోషించి, నాకు దీపావళినాడు, అర్ధరూపాయి బహుమతీ ఇచ్చారు. ఆ అర్ధరూపాయతోటి, అర్గానుకి మువ్వలున్న నల్లని బెల్టుకొని మెడకుకట్టాను. అది పరుగెడుతూంటే. కొన్ని వందల పిట్టలు 'కిచకిచ' లాడుతూ ఎగిరిపోయినట్లుండేది. దొడ్లో మొక్కలమధ్య ఎండలో అర్గాస్, వెల్లకితలా నాలుక్కాళ్ళూ పైకిచాచి పడుకునేది. మొక్కజొన్న పొత్తుల్లోని గింజలు తినడానికి వచ్చే పక్షులకి, దీన్నిచూస్తే ఎంతేనా భయంగా వుండేది. ఒక్కొక్కప్పుడు, కాకి మీదికి ధ్వజంఎత్తి అర్గాస్ పరుగెడుతూంటే నాకు, షికారి లక్ష్మయ్య జ్ఞాపకం వచ్చేవాడు.



నాన్నకి తోటన్నా, తోట పెంచడమన్నా చాలా సరదా. ఆయనకి కాస్త తీరికకల్గితే ఏదోపద్యం గురించి ఆలోచనలోపడి కూని రాగాలుతీస్తూ, తోటలో మొక్కలమధ్య, ఏదో దోహదంచేస్తూ కూచోడం అలవాటు. నాన్న పక్కనే, ఆయన కట్టుకున్న ఊడిపోయిన పంచి గోచీతో ఆడుకుంటూ అర్గాస్ వుండేది. ఓనాడు గోతులుతవ్వి నాన్న, మొక్కజొన్న గింజలు పాత్తున్నారు. వెనకాతలనుంచి. అర్గాస్, నాన్న పాతిన గింజల్ని, రెండుకాళ్ల తోటీ తవ్వి బైటికితీసి తినడం ప్రారంభించింది. నాన్న నన్ను కూకలేశారు. అప్పుడప్పుడు, అర్గానువల్ల, నాకు చివాట్లు తగులుతూండేవి.

మా ఇంట్లో ఆవుపాడి వుండేది. పాలేరు వాడు పాలుపితికి దూడని, ఆవుదగ్గరకి పాలు కుడిచేందుకు వదిలేవాడు. ఆవుదూడ పాలు తాగేసి, ఆ యెండలో ఒళ్ళుతెలియకుండా, 'ఛంగ్ ఛంగ్' మంటూ గంతులువేసేది. దాని గంతులు మూలంగా, కొత్తిమీరిమడీ, తోట కూరమడీ, పూర్తిగా ధ్వంసం అయేవి. నాన్నకి పాలేరాడిమీద చాలాకోపం వచ్చేది. ఓనాడు ఓ తమాషా జరిగింది. మామూలుగా కడుపునిండాక, మాబుల్లి ఆవుదూడ గంతులు వేస్తూ దొడ్డి అంతా పరుగెత్తుతూంది.' అంత వరకూ నాతో ఆడుకుంటూన్న అర్గాస్ రయ్యిమని దొడ్లోకి పరుగెత్తింది. 'తాచెడ్డ కోతి వనమంతా చెరిచిం'దన్నట్లు, అర్గానుకూడా ఆవు దూడతోపాటు తోటని ధ్వంసంచేయడానికి బైలుదేరిం దనుకున్నాను. కాని అర్గాను తిన్నగా ఆవుదూడ దగ్గిరకెళ్ళింది. ఓసారి రెండూ మూతులువాసన చూసు కొన్నాయి. అర్గాస్, దూడమెడకున్న పలుపు, నోటితో కరుచుకుని, దాన్ని ఈడ్చుకువచ్చి కట్టేరాట దగ్గిర నుంచుంది. ఇంట్లోవాళ్ళ నందర్నీ పిలిచి, అర్గాస్ తెలివితేటలు చూపించి, ఎంతో గర్వపడ్డాను!

సాయంత్రం బడినుంచి వచ్చేటప్పుడు, అర్గాస్‌కి రొట్టెతేవడం, నాన్నకి అలవాటు. ఆయన రాకకోసం అర్గాసు, ఎవరితోటీ మాట్లాడకండా, ఎదురుచూస్తూ, గుమ్మంలో కాచుకు కూర్చునేది. వీధిలోంచే నాన్న 'అర్గాస్!' అని పిలిచేవారు. అర్గాస్, ఒక్క అంగలో, నాన్నదగ్గిరకెళ్ళి, ఆయన కాళ్ళ మీదపడి గారాబాలు గునిసేది.

ఆరోజుల్లో మావూరు సర్కసు వచ్చింది. సర్కస్సులో, కుక్కలచేత మంచి మంచి

ఫీట్లు చేయించారు. ఇంటికివచ్చి, నేనూ అర్గాసూ ఆ ఫీట్లన్నీ నేర్చుకునే వాళ్ళము. అర్గాసు వచ్చినప్పణ్ణించీ, నేను చదువుకి ఉద్వాసనం చెపుతున్నానని నాన్న అప్పుడప్పుడు నన్ను కూకలేసేవారు.

అర్గానును విడిచి ఒక్క క్షణంకూడ ఉండలేక పోయేవాణ్ణి. అఖరికి ఓనాడు, ఎవ్వరికీ తెలియకండా, అర్గానుని నాతోపాటు స్కూలుకి తీసికెళ్ళి మేష్టారు కుర్చీక్రింద వుండే ఫ్లాట్‌ఫారం అడుగుని దాచాను. మేష్టారు వచ్చి కుర్చీలో కూర్చుని పాఠం చెపుతున్నారు. నా ప్రాణాలన్నీ అర్గాస్‌మీదనే వున్నాయి. ఆ ప్లాట్‌ఫారం నరదల్లోంచి, దానితోక, సరిగ్గా మేష్టారు కాళ్ళమధ్యకి పొడుచుకు వచ్చింది. క్లాసులో కూర్చున్న ఓ కుర్రాడు కొంటెతనంగా 'మేష్టారోయ్! మీ కాలికింద పామందోయ్!' అని పెద్దకేకవేశాడు. మేష్టారు హడిలిపోయి కుర్చీతోసహా వెనక్కి పడ్డారు. క్లాసంతా చాలా గందరగోళం ఐంది. అర్గాసు నేం చేస్తారో అని నేను హడిలిపోయాను. 'కుక్కతోకండీ!' అని ఇంకో కుర్రాడు పకాలున నవ్వాడు. మేష్టారు, గొడుగు కామతో అర్గాసుని పొడవడం ప్రారంభించారు. నన్ను పొడిచినట్లు నేను బాధపడ్డాను. అఖరికి మెల్లిగా తప్పించుకుని, అర్గాసు బైటికి పరుగెత్తింది. నేనూ దానివెంట పరుగెత్తాను. మేష్టారు, జరిగిందంతా మా నాన్నతో చెప్పారు.

అర్గాసుతో నేను సర్కస్ ఫీటుచేస్తూంటే నాన్న విసురుగావచ్చి, నన్ను ఓ దెబ్బకొట్టారు. అది ఎగిరి నాన్నచెయ్యి కరిచింది. ఆయనకి ఇంక పళ్లతెలియలేదు. పరుగెత్తుకువెళ్ళి పేక బెత్తం తీసుకొచ్చి అర్గాసుని, ఒళ్ళు హూనం అయేట్లా కొట్టారు.

"నాన్నా! అర్గాసుని కొట్టకండి! నాది తప్పు! నేనే దానిని స్కూలుకి తీసికెళ్ళాను. అది నాతో రాలేదు నాన్నా!" అని నేను గట్టిగా యేడుస్తూ అర్గాసుమీద వాలి, దానికి దెబ్బలు తగలకుండా ఉండేందుకు ప్రయత్నించాను. దానికి తగలవలసిన దెబ్బలన్నీ నావీపు భరించాయి.

"ఛండాలపు కుక్క! రోజూ రొట్టి అందించే నాచేతిని చూడు ఎట్లా లోతుగా కాటు పడేలా కరిచిందో! దీన్ని ఇంట్లోంచి తరిమేయాలి! విశ్వాసంలేదురా దీనికి!....పైగా, అమ్మా! నీ సంగతంతా, ఈవేళ మేష్టారు చెప్పారులే! కుక్క వచ్చినప్పణ్ణించీ పుస్తకం ముట్టుకున్న పాపాన పోయావురా? కుక్కల రాజావౌతావా? మొన్న బూరుగుపూణ్ణించి కరణంగా రొచ్చారు. వాళ్ళకి మంచి కుక్కపిల్ల కావాలన్నారు. అర్గాస్ నిచ్చేస్తాను. అప్పుడు నువ్వు బాగుపడతావు" అంటూ నాన్న కోపంగా లోపలి కెళ్ళిపోయారు.

అర్గాస్‌కి బాగా దెబ్బలు తగిలాయి. మూలుగుతూ నావళ్ళో పడుకుంది. నామట్టుకు నాకు వీపు చాలా పోటుపెట్టడం మొదలెట్టింది. నిమ్మళంగా అర్గాస్‌ని తీసికెళ్ళి దాని మంచం మీద పడుకోపెట్టి పక్కని, దానిమీద తల వాల్చి ఏడుస్తూ కూర్చున్నాను. ఎప్పుడుపట్టిందో నిద్ర నాకేతెలియదు. అమ్మవచ్చి నన్ను లేపి తనదగ్గిర పడుకోబెట్టుకుంది. రాత్రంతా, అమ్మ నావీపు తడుముతూ ఏడుస్తూనే వుంది. నేను, జాలిగా అమ్మ గుండెల్లోకి దూరుతూ, "అమ్మా! అర్గాస్...." అని కుమిలి కుమిలి యేడ్చాను. తెల్లారింది అర్గాస్ నా ఈలకి లేవలేక లేచింది తోకయూడిస్తూ.

ఎందుకో దానికి అపరిమితమైన బెంగ పట్టుకుంది. అస్తమానం కళ్ళమ్మట నీరు కారుస్తూండేది. నాన్న, దానికి సింహస్వప్నమై పోయారు.

మునపట్లా, సాయంత్రం పడేసరికి రొట్టె కోసం గుమ్మంలో కూర్చుని ఎదురు చూస్తూండడం మానేసింది. ఆవేళ కరిచినప్పటినుండీ నాన్నకూడా, అర్గాసుని చిన్నచూపుచూస్తూ వచ్చారు. అర్గాసుని చూస్తూంటే ఎందుకో నాకు పట్టరాని దుఃఖం వస్తూండేది. స్కూలికి వెళ్ళేవాణ్ణన్న మాటే కాని, ప్రాణాలన్నీ అర్గాసుమీదనే వుండేవి—ఏ నిమిషాన్ని, ఆ

మాయయముడు-బూరుగుపూడి కరణం-వచ్చి నాన్ననడిగి అర్గాసుని తీసుకుపోతాడో అని.

ఇలా కొంతకాలం గడిచింది. అర్గాసు పెరిగి పెద్దదైంది. ఓనాడు దానితో ఆడుకుంటూంటే, అర్గాస్ కుడికన్నులో తెల్లని మచ్చ కనిపించింది. చొక్కాతో దానికన్ను గట్టిగా తుడిచాను. కాని ఆ తెల్లమచ్చ పోలేదు. నాకు ఆ మచ్చగురించి ఏం తెలిసింది కాదు. ఓనాడు ప్రొద్దున్న నేను ఈల వేసి పిలుస్తే పరుగెత్తుకుంటూ వచ్చి గోడనేసి తలకొట్టుకుని, అర్గాస్ చాలాసేపు ఏడ్చింది. నేను గాభరాపడి దగ్గిరకి తీసుకుని, తల దువ్వుతూ దాని కళ్ళల్లోకి చూశాను. ఎడం కన్నులోకూడా తెల్లమచ్చ కనిపించింది. అమ్మతో, వెళ్ళి, ఈ సంగతి చెప్పాను. అమ్మ వచ్చి, అర్గాసును చూచి "అమూ! అయ్యో! అర్గాస్‌కళ్ళల్లో పువ్వు లేశాయిరా! ఏం దారి!" అని విచారించింది. అర్గాసుని అస్పత్రికి తీసికొని వెళ్ళమన్నారు నాన్న. డాక్టరు చూసి "ఆపరేషన్ చెయ్యడానికి వీల్లేదు. మందువేస్తాను," అని దానికి నేత్ర వైద్యం ప్రారంభించారు. ఎంతో దీక్షతో, నేను దాన్ని ఎత్తుకు తీసికెళ్ళి మందువేయిస్తూ వచ్చాను. కొంతమట్టుకు నయమైంది. కాని అంతకన్నా ఇంక నయ మవదన్నారు డాక్టరు. నాకేమీ పాలుపోయింది కాదు.

ఆవేళ శనివారం అవడంచేత నాన్న ఇంటి దగ్గిరే వుండిపోయారు. నేనుమాత్రం, స్కూలికి వెళ్ళవలసి వచ్చింది. బాగా చీకటిపడ్డాక స్కూలునుంచి ఇంటికి వచ్చాను. మామూలుగా వస్తూనే, ఈలవేస్తూ అర్గాస్‌ని పిలిచాను. కాని అది రాకపోడంచూసి, గబగబా అమ్మదగ్గిరకి పరుగెట్టి, "అమ్మా! అర్గాస్ ఏదీ?" అని అడిగాను.

"నాయనా! నేనేం చెయ్యను! ఆ బూరుగుపూడికరణం వచ్చాడు. మీనాన్న అర్గాసు కంటిజబ్బుగురించి చెప్పారు. 'మావూళ్ళో చాలా మంచి నాటువైద్యు డున్నాడండీ మంచి మందువేసి కళ్లు బాగుచేస్తాడు. మీ కుక్కని నా కిచ్చివేయండి. నేను కళ్ళు బాగుచేయించి పెంచుకుంటాను' అని అన్నాడురా నాయనా' నాన్న అర్గాసుని ఇచ్చేశారు. నేను ఎన్ని విధాలో ఇవ్వద్దని చెప్పాను. 'వాణ్ణి నువ్వే పాడుచేస్తున్నావు. పైగా దాని కళ్ళుకూడా పాడైపోయినాయి. ఆయన దానికి, చికిత్స చేయించి పెంచుకుంటానంటూంటే నువ్వు అడ్డుపెడతా వెందుకు' అని నాన్న నన్ను కూకలేశారు. నేనేంచేసేది చెప్పు అమూ?" అని అమ్మ కంట తడిపెట్టుకుంది. నాకూ పట్టరాని దుఃఖం వచ్చింది. అర్గాస్ పడుకునే మంచం దగ్గిర కెళ్ళి నేనూ చెల్లాయీ కాదా మరెత్తినట్టు యేడ్చాము.

ఆరాత్రి నాకు ఒళ్లు తెలియనంత జ్వరం వచ్చింది. అర్గాసుగురించి రాత్రంతా ఉలిక్కిపడుతూ పలవరించానుట! నేను జ్వరంతో బాధ పడుతూండగానే బూరుగుపూడి కరణం నాన్నకో ఉత్తరం వ్రాశారు.

"......ఒకవేళ దారితెలిసి, మళ్ళీ మీ యింటికి పారిపోయి వస్తుందేమోనని, ఆవేళ రెండెడ్ల బండిమీద ఇక్కడికి తీసుకొచ్చాను. ఇక్కడికి వచ్చినప్పణ్ణించీ తిండి తినడం మానేసింది. బొత్తిగా 24 ఘంటలూ కట్టివేయడం ఎందుకని, నిన్నను ఓమాటు వదిలాను. కాని, అది వదలగానే పారిపోయింది. ఈ చుట్టుప్రక్కల ఊళ్ళన్నీ పాలేరాళ్ళచేత గాలించాను. ఎక్కడా దొరకలేదు. అక్కడికి మీ యింటికి వచ్చేసిందని తలుస్తాను. వెంటనే ఏ సంగతీ నాకు తిరుగు టపాలో వ్రాయించ కోరుతాను."

నాన్నబాధ చూడాలి. ఆయన చేసిన పనికి అపరిమితంగా పశ్చాత్తాపపడ్డం ప్రారంభించారు. "అయ్యో! అర్గాస్ ఏ బండికింద పడిపోయిందో కళ్లు కనిపించక! ఎంత పాపంచేశాను! ఎంత పాపంచేశాను!" అని రోజూ అనుకునేవారు. నాకు ప్రపంచం అంతా మీద పడిపోయినట్లు అనిపించింది. ఛీ! ఎందుకు బ్రతకడం, అనుకున్నాను. అర్గాస్

లేకపోవడంవల్ల ఇల్లంతా 'బావు' మంటూంది. ఆ మువ్వలచప్పుడు వినిపించడంలేదు. నాన్న దగ్గరకెళ్ళి, "నాన్నా! మనంకూడా వెతుకుతే దొరుకుతుందేమో!" అన్నాను. పాపం! నాన్న, అన్నయ్యనిచ్చి నన్ను సైకిలుమీద వెతికేందుకు పంపారు. అన్నయ్యా నేనూ, రెండు రోజులు, చుట్టుపక్కలవున్న పల్లెటూళ్ళన్నీ తోటలన్నీ గాలించివేశాము. ఎక్కడా ఆర్గాస్ ఆ వైపులకి వచ్చిన వైనమేనా దొరకలేదు. ఆఖరికి నిరాశచేసుకుని, అన్నయ్యా నేనూ, ఇంటికి చక్కావచ్చాము.

ఆర్గాస్ పారిపోయి పదిహేను దినాలైంది. బెంగచేత నా ఆరోగ్యం బొత్తిగా పాడై పోయింది. అస్తమానం ఆర్గాస్ పడుకునే మంచం, అన్నం తినే మూకుడూ చూస్తూ ఏడుస్తూండే వాణ్ణి. నేను పిచ్చివాణ్ణి అయిపోతాననే భయంచేత, అమ్మ, ఆ [illegible] మంచం, అటకమీద పెట్టేసి[illegible] ఆర్గాస్ చిహ్నంగా యేదీ మిగ[illegible] నా బెంగతప్ప!

ఆరోజుల్లో నాన్న మేఘసం[illegible]గులో వ్రాస్తున్నారు. ఓరో[illegible] వేసుకుని, నాన్న వసారా[illegible] అర్ధరాత్రివేళ లేచి, ఏదో [illegible] ఆలోచిస్తూ, మంచంకింద వు[illegible] కోసం వంగి తడుముతూంటే [illegible] ఏదో తగిలిందట. ఏమిటో అనిచెప్పి [illegible] వులిక్కిపడి తర్వాత ఆర్గాసేమోనని, నాన్న 'ఆర్గాస్!' అని పిలిచారట. ఆర్గాస్ లేవలేకలేవలేక లేచి, ఆయన కాళ్ళమీదపడిమూల్గుతూ పడుకుందట! నాన్న వెర్రి ఆనందంతో, 'అమ్మూ! అమ్మూ! ఆర్గాస్ వచ్చిందిరా! తలుపుతియ్యి! అని పెద్ద కేకవేశారు. నేను గుభాలున లేచి తలుపు తెరిచేప్పటికి, ఆర్గాస్ పాకుకుంటూ నామీదవచ్చి పడింది. నా ఆర్గాస్! నా ఆర్గాస్! అబ్బా! ఎంత ఏడ్చిందో నేను చెప్పలేను! ఇంట్లో అందరి దగ్గిరకీ ఒక్కొక్కమాటు వెళ్ళి ముఖం కాళ్ళమీదపెట్టి ఏడవడం మొదలెట్టింది!



నా ఆర్గాసు చిక్కి శల్యమైపోయింది. ఎముకలన్నీ బైటకివచ్చేశాయి. దాని కాళ్ళు రోళ్ళల్లా వాచిపోయాయి. కళ్ళు కనిపించక పోడంచేత ఎక్కడెక్కడో తలకి దెబ్బలు తగిలించుకుంది. ఇన్నాళ్ళపట్టీ దారి తెలియక ఎన్నెన్నివూళ్ళు తిరిగిందో! నా ఆర్గాస్ నాకోసం ఎంత యేడ్చిందో!

ఆర్గాస్‌కి ప్రయాణ బడలిక ఎక్కువై పోయింది. పడుకున్నది, అలానే పడుకునే వుండేది. పిలుస్తే కళ్ళుమూసుకునే తోక ఆడించేది. నాన్నానేనూ రోజూ ప్రొద్దున్నా సాయంత్రం తైలంరాసి వేడినీళ్ళ కాపడం పెట్టేవాళ్ళము. ఆర్గాస్ బొత్తిగా తిండి తినడం మానేసింది; డాక్టరుకి తీసికెళ్ళి చూపించాను. తలకి బాగా దెబ్బ తగలడంచేత, సెప్టిక్‌జ్వరం వచ్చిందన్నారు. ఏందారి? నేను డాక్టరుని ప్రాధేయపూర్వకంగా 'ఆర్గాస్‌ని బ్రతికించండి' [illegible] వేడుకున్నాను. డాక్టరు, ఎన్నోవిధాల, మందు[illegible]వేసి ప్రయత్నించారు. కాని జ్వరం తగ్గు[illegible]ముఖం పట్టలేదు. అంత జ్వరంలోనే నా 'ఆర్గాస్' అని, నేను పిలుస్తే, తోక కొద్దిగా ఆడించేది.

చివర[illegible] రాత్రి, స్పృహలేకుండా [illegible] నా తొడమీద దాని తల [illegible]త్రంతా ఏడుస్తూ కూర్చున్నాను. [illegible]డై వుంటుంది. ఆర్గాస్ కదిలింది; కళ్ళు తెరిచింది నావేపు ఒక్కసారి చూసింది. 'ఆర్గాస్' అని యేడుస్తూ దాని చెవులో పిలిచాను. కళ్ళు ఒకసారితెరిచి, నా ఒళ్ళోకి లోపలగా జరిగి, కళ్ళుమూసింది. మళ్ళీ కళ్ళు తెరవనేలేదు.

నాన్న కంట తడిపెట్టుకోడం నే నెప్పుడూ చూడలేదు. కాని, ఆర్గాస్ చచ్చిపోయిందని నాన్న కంట తడిపెట్టుకుని 'నేనే కారకుణ్ణి! నేనే! ఎంత పాపంచేశాను' అన్నారు.

ఇప్పటికీ ఆర్గాస్‌ని తలుచుకుంటే గొంతుక బొంగురుపోతుంది.

# బౌద్ధ గోష్ఠి



బోధిసత్వుడు ఇల్లు విడిచి మహారణ్యముపాలై పోతూ ఒక అగ్రహారంలో ఆగేడు. అగ్రగణ్యమైన జ్ఞానం సంపాదిద్దామని బోధిసత్వుని తలంపు. రాజనగరులో బీదసాదలను చూచినదాది రాజ్యసింహాసనం ఎక్కుదామని అతని కేమాత్రమూ లేదు. మానవులలో నున్న హింసాకృత్యాలూ అశాంతీ, అలజడీ, బుద్ధిహీనతా, అన్యాయపరత్వమూ, పేదల దైన్యతా అతనిని క్రుంగదీసినాయి. వీటి నన్నిటినీ అణిచివేసే సందేశం కనిపెట్టవలెనని అతని ఉద్దేశం. మానవులకు దైవత్వమొచ్చే సందేశామృతం విరజిమ్ముదామని అతని సంకల్పం. అందుకనే భార్యా బిడ్డలను విడనాడాడు. తల్లిదండ్రులను విడనాడాడు. అడవికి పోయాడు. అడవిలో అనేక ప్రదేశాలు తిరిగాడు. అనేకాశ్రమాలు చూచాడు. అనేక మంది పండితులతోనూ శాస్త్రవేత్తలతోనూ సంప్రతించాడు. ఎవరితత్త్వమూ బోధిసత్వునకు తృప్తి కలిగించలేదు. చివరకు కౌండిన్యుని ఆశ్రమం దగ్గిర ఒక మర్రిచెట్టుక్రింద కూర్చుని యోచించడ మారంభించాడు.

ఆ దాపునే ఒక వృద్ధబ్రాహ్మణ సంసారము కాపరం చేస్తున్నది.

వారున్నది కొబ్బరాకులతో కప్పిన ఒకపాక. పాకచుట్టూ దడికూడా వుంది. దడి ఆవరణలో ఆవులూ దూడలూ ఉన్నాయి. పెరటిలో అరటి చెట్లున్నాయి. ముందట మందార పూలమొక్క ఒకటుంది. ఆ మందారతీగెలు పాకకప్పుపై ప్రాకి ఎర్రటిపూలతో దూరాని కెంతో రమ్యంగా వుంది.

బుద్ధుడా పాకవేపుచూశాడు. పాక వాకిటినుంచి పరుగెత్తు కుంటూ పన్నెండేండ్ల పిల్లొకతె బయటకొచ్చింది. వెనువెంటనే చీపురుతో ఆ పిల్ల వెన్నుమీద చరుస్తూ అరుస్తూ నలభైయేదేండ్ల ఆ యింటావిడ వచ్చింది. వస్తూ వస్తూ కఠిక్కున ఆగింది.

"ఓసి నీ జిమ్మాతియ్యా! చూడు నీవెంట పరుగెత్తేప్పటికి కాలివేలికి రాయెట్లాకొట్టుకుందో! అబ్బా! రక్తంకూడా వస్తున్నది. అబ్బ! అబ్బ! అన్నదావిడె.

"ఎక్కడ పిన్నీ ఎక్కడ? ఇటుచూపించు" అని ఆ దెబ్బలు తిన్నపిల్ల ఆవిడెదగ్గిరకు పోయి చటుక్కున తన వోణీ అంచు చించి గాయానికి కట్టుకట్టింది.

"సరేలే! మంచిపనే చేశావు. విద్యో విద్యో అంటూ ఆ కొండి న్యసుడిదగ్గిరే యెప్పుడూ కాల క్షేపంచేస్తుంటే కోపంరాదుమరీ! సరే ఆ ఆవులను తీసుకుపోయి కాసేపు మేపుకురా!" అంటూ ఆవిడె ఇంట్లోకిపోయింది. ఆ పిల్ల నాలుగావులను తోలుకొచ్చి అడివిలో విడిచి ఒక రావిచెట్టు క్రింద కూర్చుంది. ఉబుసుపోక కాపిల్ల పాటొకటి పాడింది.

కరుణయే కాంతలకు
కమ్మని యాభరణము,
కరుణలేని గృహము
కాష్ట గృహము గాదా!
కరుణయే సతీపతుల
సంబంధ సూత్రమే.

కరుణలేని దంపతులు
తంపటులు గారా!
కరుణయే జగతిలో
కలకాలముండాలి,
మానవుల హృదయాలు
కలిపి కలిపేయాలి!

అన్న యీ పాటను దాపుననున్న బుద్ధుడు విన్నాడు. ఆ పిల్ల దగ్గిరకు పోయి

'అమ్మాయి నీ పేరేమిటమ్మా?' అని అడిగాడు.

"నా పేరు గొబ్బి. అదే మా యిల్లండీ!"

"నీ వెంట ఇందాక వచ్చిన దెవరమ్మా?"

"ఆవిడె మా పినతండ్రి భార్య. నాకు చిన్నప్పుడే తలిదండ్రులుపోతే వీళ్లే పెంచుతున్నారు.

"కౌండిన్యసుల వారివద్ద చదువుకుంటున్నావా?"

"అవునండీ. ఆయన మహా వేత్త. పనిలేనప్పుడల్లా ఆయన దగ్గిర శుశ్రూష చేస్తూంటాను.



"ఇంత చిన్నతనంలో నీకింత ఇంగితమూ ఇంత కరుణహృదయమూ ఉండడం చాలా అబ్బురంగా ఉందమ్మా. నీవల్ల తృటిలో నాకు కావలసిన విద్య నేర్చాను. ఇదుగో నా ఆశీస్సు"

ఇంతలో ఒక లేగదూడ కుంటుకుంటూ గొబ్బి దగ్గిర కొచ్చింది. ఆ దూడ మోకాలు మీద ఎర్రని గాయమైనది. దాన్ని పదే పదే ముక్కుతో పొడుస్తూ కాకొకటి వేధిస్తున్నది.

ఆ దూడను చూడగానే గొబ్బి పరుగెత్తుకుపోయి దానిమోకాలికి కట్టుకట్టింది. తర్వాత చిన్న గడ్డి కోసే కత్తిని తీసుకుని తనచేతి మీదకోసి ఎర్రనిపుండు చేసింది.

"అదేమిటమ్మాయీ నీకు నీవే గాయం చేసుకుంటావేం?" అని ఆదుర్దాగా అడిగాడు బోధి సత్త్వుడు.

"కాదండీ! దూడకు కట్టు కట్టితే కాకినోటికూడు కడ్డువచ్చానుగా, అందుచేత నా చేతిపుండును కాకి పొడవవచ్చు." అన్నది గొబ్బి.

"ఆహాహా నీ తలిదండ్రులు తరించారమ్మా! నీ గురువు కౌండిన్యుడెంత ఘనుడో గదా నిన్నట్లు శిక్షణచేశాడు. ఇంక నా సందేహాలు పోయినాయి. తత్త్వబోధ అయింది. ఆ చెట్టుక్రింద కూర్చుని యీతత్త్వాన్ని మననం చేసుకుని బుద్ధిర్జోతిని వికసింప చేసుకుంటా" నన్నాడు బోధి సత్త్వుడు.

"అయితే నీవు బుద్ధుడవే అవుతావు" అన్నది గొబ్బి.





# పనిలేని మంగలి

వెనకటికి ఇంగ్లండులో డాక్టరు జోన్సు అనే ఆయన ఒక సర్వరోగ నివారిణి కనిపెట్టి, వాటిని "డాక్టరు జోన్సుగారి మూలికా మాత్రలు—అన్ని రోగములను పోగొట్టును" అని ప్రకటన చేశాడు. ఆ మాత్రలను అనేకమంది సేవించారు. వాటితో అనేక దీర్ఘ రోగాలూ, తీవ్ర రోగాలూకూడా కుదిరినై. వాటి ఖ్యాతి ఇంగ్లండంతటా పాకిపోయింది. పంచదారలు పొదిగినవీ, సాదావీ అయిన డాక్టరు జోన్సుగారి మూలికా మాత్రలు (ఇందులో జంతు పదార్థములు చేర్చబడలేదు.) అన్ని పత్రికలలోనూ కనిపించసాగినై. వాటికి పార్లమెంటరీ సభ్యులూ, జమీందార్లూ, గొప్ప లాయర్లూ, వణిజులూ మొదలయిన వారంతా ప్రశంసలిచ్చారు. డాక్టరు జోన్సుగారు చాలా డబ్బు ఆర్జించారు.

ఇట్లా వుండగా అకస్మాత్తుగా డాక్టరు జోన్సుగారి రసాయనశాల గురించిన రహస్యం కాస్తా ఒకనాడు బట్టబయ లయింది. డాక్టరు జోన్సుగారి దొడ్లో ఏ మూలికలూ లేవు. ఆయన సావిట్లో ఏ కల్వాలూ లేవు. ఆయన ఆవరణలో ఒక వంద చెవుల పిల్లులు మాత్రం ఉన్నై!

ప్రజలను వంచిస్తున్నాడని డాక్టరు జోన్సుగారిమీద కేసుపెట్టి ఆయనను కోర్టు కీడ్చారు. ఆయన తరఫున గట్టి లాయర్లు వాదించారు. ఇందులో వంచన ఏమీలేదు. చెవుల పిల్లులు శాకాహారులు. వాటి పెంటికల్లో మూలికలు తప్ప ఏమీ ఉండవు. ఈ మూలికా మాత్రలను సేవించినవారికి రకరకాల వ్యాధులు నివారణ అయినట్టు ఎంతో గొప్పవాళ్ళ దగ్గర్నుంచి సహితం వ్రాత పూర్వకంగా దాఖలా వుంది!

అయితే, పాపం, జోన్సుగారి పక్షాన తీర్పు రాలేదు. ఆయనకు బరువైన జరిమానాతో పాటు శ్రీ కృష్ణ జన్మస్థానవాస ప్రాప్తికూడా లభించింది.

డాక్టరు జోన్సు చరిత్ర ప్రసిద్ధుడైనాడు గాని డాక్టరు జోన్సు సిద్ధాంతాలమీద నడుస్తూ చరిత్రలో కెక్కనివారు అసంఖ్యాకు లున్నారు. ఏదోవిధంగా వాళ్లు సంఘాన్ని వంచించి ఇంతడబ్బు చేసుకోవాలి, చేసుకుంటారు. వీళ్ళు తెలివిగలవాళ్ళూ, దైవభీతి లేనివాళ్ళూ, సంఘ చింత లేనివాళ్ళూనూ. సంఘమూ అత్రంతో కూడుకున్నది, ఆత్మరక్షణ చేసుకోలేనిదీ, అసత్యాన్ని నిరూపించలేనిదీనూ. ఈ తేడాను ఆధారం చేసుకుని డాక్టరు జోన్సులు డబ్బు గడించుకుంటారు. వాళ్ళ బతకటానికి ఇది చాలా మంచి యుగం.

ఎందుచేతనంటే ఒకవంక శాస్త్రవిజ్ఞానంలో ప్రజలకు విశ్వాసం హెచ్చిపోతున్నది. వెనక మనుషులను చంపిన రోగాల కీనాడు మందు లుంటున్నై. మంచి మందుల అవశ్యకత కూడా ప్రజలలో హెచ్చిపోతున్నది. డబ్బున్న

కొనువారలను తృప్తి పరచటమే మూలసత్యము



వాళ్ళకి శరీర వ్యాయామంలేకా, విలాసాలు హెచ్చి ఒకరకం రోగాలయితే, డబ్బులేని వారికి అనారోగ్యకరమైన పనులు తగిలీ, ఫరి అయిన శరీరపోషణ లేకా మరోరకం రోగాలు. ఈ అందరికీ మందులు కావాలి. శాస్త్రం ధర్మమా అంటూ దేనికైనా మందు కనిపెట్టటాని కవకాశం వుంది ఈ రోజుల్లో. కనీసం ప్రజల విశ్వాసం అదీ. శాస్త్రజ్ఞానాన్నంతా మూకుట్లో కరగేసి అచ్చుల్లో పోసి బిళ్ళలుచేసి అమ్ముతున్నారని ప్రజల భ్రమ.

ప్రజలకు కావలసిన మందుల్లో అవసరానికి కావలిసినవీ విలాసానికి కావలిసినవీ కూడా ఉంటై. అజీర్తి పోవటానికీ, నరాల దౌర్బల్యానికీ, జుట్టు రాలకుండా వుండటానికీ, జుట్టు సాంతం రాలిపోవటానికీ, కొవ్వు కరగటానికీ, కొవ్వు పట్టటానికీ, పోయిన యవ్వనమంతా తిరిగి రావటానికీ, జారిన శరీరం తిరిగి నిలబడటానికీ, నెరిసిన వెంట్రుకలు తిరిగి నల్లబడటానికీ, నల్లని మొహాలు మూడు పూతలతో పాలిపోయినట్టు కావటానికీ, వాళ్ళ చెమటవాసన కొట్టకుండా వుండటానికీ—ఇంకా సవా లక్ష ఉపయోగాలకు మందులు కావాలి.

ఈ మందులన్నీ తయారుచేసే వాళ్లున్నారు. వీటన్నిటినీ కొనేవాళ్ళూ ఉన్నారు. ఇదంతా దగా వ్యాపారమా లేక ఈ మందుల అమ్మకంవల్ల క్రమంగా సంఘంయొక్క అందమూ, ఆరోగ్యమూ, యౌవనమూ, స్తంభనశక్తి హెచ్చుతున్నాయా అని ఆలోచించేనాథుడు లేడు.

డాక్టరు జోన్సు మన స్తత్వం మందులు చేసే వాళ్ళకే గాక పత్రికలు నడిపేవాళ్ళకీ ఉండటంలో ప్రజలకు రెట్టింపు నష్టం. ప్రతి పత్రికా ప్రకటనలకు కొన్ని పేజీలు ప్రత్యేకిస్తుంది. ఈ ప్రకటనలద్వారా లోకాన్ని ఉద్ధరించాలనే ఉద్దేశం పత్రికల కుండదు. (ఈ వ్యాసం వేసుకోవటానికి పమ్మతించే పత్రికలాటివి తప్పిస్తే.) ఈ ప్రకటనల కయే చార్జీలు ముందు మందులు విక్రయించేవాళ్ళు అడ్వాన్సు చేస్తారేగాని ఈ ఖర్చు వడ్డీతో సహా ఇచ్చుకునేది పత్రికలు కొని చదివేవారే. మందుల ప్రకటనలు వేసేవాళ్ళు వెర్రికుట్టలు కారు. ఆ ప్రకటనల చార్జీలు యావత్తూ మందుల అమ్మకంమీద తిరిగిరాగా ఇంకా లాభాలు కనిపించే పరిస్థితిలోనే ప్రకటనలిస్తారు. కొందరు ప్రకటనదార్లు ఏ పత్రిక చదివేవారి వద్దనుంచి ఎన్ని రూపాయల ఆర్డర్లు వచ్చేదీ అంచనా కట్టటానికిగాను ప్రకటనలో ఇచ్చే తమ చిరునామాతో పత్రిక పేరు తాలూకు బీజాక్షరాలు జతపరుస్తారు.

ప్రతి పత్రికలోనూ కనిపించే ప్రతి ప్రకటనా దగాఖోరు ప్రకటనే అని ఎవరూ అనరు. కాని దగాఖోరు మందులకూ సంఘానికీ మధ్య ఏ దేవుడన్నా అడ్డపడకపోతే సంఘాని కెంతయినా అపకారం వుంది.

ఈ విషయంలో అమెరికా ఇటీవల పెద్ద సంస్కారం జరిపింది. ఇవాళ అమెరికాలో దగాఖోరు మందులు ప్రకటించటానికి గాని అమ్మటానికిగాని అవకాశంలేదు. ఈ చట్టం అమలులోకి వచ్చినాక అనేక మందుల ప్రకటనలూ అమ్మకాలూ అమెరికాలో ఆట కట్టినై. కాని ఈ దగా మందులు పై దేశాలకు యెగుమతి కావటానికి అమెరికా ప్రభుత్వం సమ్మతిస్తుంది. ఇది మిగిలిన దేశాలకి చాలా ప్రమాదమయింది. అమెరికాలో ప్రకటించటానికీ అమ్మటానికీ వీలులేని మందులు మనదేశంలో ప్రకటిస్తున్నారు. అంచే విరివిగా అమ్ముతున్నారుకూడా నన్నమాట. ఈ ప్రకటనలు దిన పత్రికలలోకూడా చాలా విస్తరించి కనిపిస్తునై. 24 గంటలలో యౌవనంఇచ్చే మందొకటీ, కొవ్వు కరిగించే మందొకటీ, నెరిసిన జుట్టును నల్లబడేసే మందొకటీ, ఇంకా అనేక మందులు అమెరికాలో నిషేధంపొంది ఈ దేశంలో విరివిగా అమ్మబడుతునై. ఇవి అమెరికాలో నిషేధింపబడినవనీ, ప్రజల ఆరోగ్యానికి భంగకరమైనవనీ తెలిసికూడా మన దినపత్రికలు ఈ మందుల ప్రకటనలు వేస్తూనై. ఇట్లా వేస్తున్నవాటిలో జాతీయ పత్రికలనబడేవికూడా వునై.

అమెరికా ప్రభుత్వం నిషేధించిన వస్తువుల జాబితా సంపాదించి వాటిని మనదేశంలో ప్రచారం కాకుండా చూడటం మన ప్రభుత్వాలకు అసాధ్యంకాదు. మనదేశంలో తయారయ్యే దగా మందులూ, ఇతర దేశాల మంచి దిగుమతి అయేవీ అయితే కనిపెట్టటానికీ నిషేధించటాకీ కొందరు శాస్త్రజ్ఞుల సహకారం తీసుకోవాలి.

మనదేశం అన్నివిధాలా అధోగతిలోవున్న దేశం. అసలే అనారోగ్యమూ, దారిద్రమూ దేశాన్ని పీల్చి పిప్పిచేస్తున్నది. ఈ సందర్భంలో జలగల్లాటి డాక్టరు జోన్సుగాళ్ళను నిర్దయగా అణచనట్టయితే ప్రజల కప



"నేను బాకీలవాళ్లు వచ్చినాకూడా రెండు ఘంటలు కోర్చోబెట్టి అప్పు అడగకుండానే తిప్పి పంపించగలను !"

"అయితే లాభంలేదు! ఇప్పుడు బాకీల వాళ్లు నెల కొక్కమాటే వస్తున్నారు. ఇక ముందు రోజూ ఇక్కడే తిష్ఠ వేస్తారు."

చారం ఎంతయినా వుంది. ఈ పనికి ప్రభుత్వమే పూనుకోవాలి. ప్రజలు తమ్ముతాము రక్షించుకోలేరు. పత్రికలవాళ్ళు—ధర్మపన్నాలు చెప్పే జాతీయ పత్రికలు సయితం—డాక్టరు జోన్సు తత్వం వదలగొట్టుకోలేవు. నలుగురిలోనూ గౌరవంగా తిరుగుతున్న పత్రికాధిపతులే నాలుగు డబ్బులకోసం గడ్డితిని అపాయకరమైన మందులను తన పత్రికలో ప్రకటించి తన పత్రిక చదివేవారి కపచారం చేసేస్తాడు.

ప్రభుత్వాన్ని ఈ విషయంలో ప్రేరేపించటానికి, నిజంగా ప్రజాక్షేమంకోరిన పత్రికలు ముందుకొచ్చి, "మేము అనుమానాస్పదమైన ప్రకటనలు వెయ్యము," అని స్పష్టగా చాటాలి. డాక్టరు జోన్సులు నశించాలి.

———

# అనువాద సాహిత్యం

[ఈ కథ రాసిన మైకేల్ జోస్చెంకో సోవియట్ వ్యంగ్య రచయిత. ఇతని కథలు సోవియట్ పాలకవర్గాన్ని అసంతృప్తి పరిచాయి. ప్రత్యేకించి ఈ కథలో సోవియటు పరిస్థితుల్నీ, సోవియటు ప్రజలనూ అపహాస్యం చేశాడని జోస్చెంకోను సోవియటు రచయితల సంఘంనుంచి బహిష్కరించారు. ఇకముందతను రష్యాలో ఏ రచనా ప్రచురించటానికి వీల్లేదు.]

దక్షిణ రష్యాలోని నగరాలలో ఒకదానిలో అనేక ఇతర ఆకర్షణలతోపాటు ఒక బతికిన కాలేజి (జూలాజికల్ గార్డెన్) కూడా ఉండేది. అందులో ఒక పులీ, రెండు మొసళ్లూ, మూడు పాములూ, ఒక జీబ్రా (అడవి గాడిదె), ఒక ఉష్ట్రపక్షీ, ఒక కొండముచ్చు (లేక, కోతీ) ఉండేవి.



యుద్ధారంభంలో ఫాసిస్టులు ఊరిమీద బాంబులు వేస్తున్నప్పు డొక బాంబువచ్చి నేరుగా బతికిన కాలేజిమీద పడింది. అది జంతువుల కత్యాశ్చర్యం కొలిపేలాగ బ్రహ్మాండంగా పేలింది. అన్నిటికన్నా యెక్కువ భయపడింది కోతి. బాంబు పేలుడుకు కోతి ఉన్న బోను పక్కకుపడి ఒకవేపు భగ్నమై పోయింది. కోతి బోనులోనుంచి బయటికి దూకింది. కిందికి దూకిన కోతి విమానదాడుల కలవాటుపడ్డ మనుషుల్లాగా నిశ్చలంగా ఉండలేదు. అది చప్పున ఒక చెట్టెక్కి దానిమీది నుంచి కటకటాలమీదికీ, కటకటాల మీది నుంచి రోడ్డుమీదికీ దూకింది. దూకి శక్తి కొద్దీ పరిగెత్తి సాగింది.

అది ఊరుదాటి రహదార్లుపట్టి పరిగెత్త సాగింది. కోతి అంతకంటె ఏంచేస్తుందీ? అదేమన్నా మనిషా? దాని కేగొడవా తెలీదాయె. ఊరుదాటి పోరాదనే జ్ఞానం దానికి లేదు.

పరిగెత్తి పరిగెత్తి అది కాస్తా అలిసిపోయింది. ఒక చెట్టెక్కి నిద్రపోయింది. ఆ సమయంలో ఆ రోడ్డుమీదుగా ఒక మిలిటరీ లారీ వచ్చింది. లారీ డ్రైవరు చెట్టుమీద కోతిని చూశాడు. వాడి కాశ్చర్యం వేసింది. వాడు చడీ చప్పుడూ లేకుండా పైనెక్కి తన కోటువేసి దాన్ని పట్టుకుని కిందికి తీసుకొచ్చి లారీలో తన పక్కనే కూచోబెట్టుకున్నాడు. "పాపం, ఇది నిష్కారణంగా ఆకలికీ చలికీ చచ్చేకంటే, ఎవరన్నా స్నేహితులకి దీన్ని

## కోతి కథ

బహుమానంగా ఇస్తాను." అనుకున్నాడు. అనుకుని లారీ తోలుకుపోయినాడు.

లారీ బోరిసోవ్ నగరానికి వచ్చింది. డ్రైవరు తనపని చూసుకోవాలి. వాడు కోతితో ఇట్లా అన్నాడు: "నువ్వెక్కడికీ పోకు. నే నిప్పుడేవస్తాను."

కాని కోతి నిలవ దలుచుకోలేదు. అది దర్జాగా రోడ్డువెంట షికారు బయల్దేరింది. జనమంతా దాన్ని చూసి ఆశ్చర్యపడి పట్టుకోవటానికి ప్రయత్నించారు. కాని అది చలాకీ అయినది, నాలుగు కాళ్ళమీదా అందకుండా పరిగెత్తింది. అనవసరంగా వాళ్ళు ప్రయత్నించారేగాని అది వాళ్ళకు చిక్కలేదు. దానికి అలుపొచ్చింది, ఆయాసంవచ్చింది, ఆఖరుకు శోషవచ్చింది.



కోతి తినే ఆహారం ఆ పట్టణంలో దానికెక్కడ దొరకుతుంది? హోటలుకుగాని కోఆపరేటివ్ స్టోరుకుగాని వెళ్ళి ప్రయోజనం లేదు కదా. పైగా దానిదగ్గిర డబ్బు కూడా లేదు. దానికి ఖాతా అయినా లేదాయె. రేషను కార్డు అంతకు ముందే లేదు. ఘోరం! ఏమయినా కో ఆపరేటివ్ స్టోరుకు వెళ్ళిచూద్దామనుకుంది. ఏమైనా దొరికితే దొరకవచ్చు.

పెద్ద క్యూలో జనం నిలబడి ఉన్నారు. కోతి ఆ జనంమీదిగా ఎగిరి అమ్మకంజరిపే ఆవిడముందు దూకింది. ముల్లంగి పౌను ఎట్లాగని అడగనైనా అడక్కుండా ఒక కట్ట పుచ్చేసుకుంది. సంతోషంతో స్టోరుబయటికి వచ్చేసింది. కోతి అంతకంటె ఏంచేస్తుంది? దాని కేగొడవా తెలీదు. ఆహార పదార్థాలు లేకుండా గడుపుకోవటంలో దానికేమీ జ్ఞానం కనిపించలేదు.

అల్లరిమటు కయింది. జనమంతా హాహాకారాలు చేశారు. అమ్మకంచేసే ఆవిడ దిగ్భ్రమచెంది మూర్ఛపోయినంత పనిచేసింది. మామూలుగాకొనే మనుషులు రావటానికి బదులు వొంటినిండా బొచ్చు, ఒకతోకా వేసుకుని దూకుతూవస్తే భయంగా ఉండదూ? పైపెచ్చు డబ్బూ ఏగానీ ఇవ్వదాయె. ముల్లంగి దుంపలు నములుకుంటూ పరిగెత్తిపోతున్న కోతి వెంటపడ్డారు జనం. దాని కేగొడవా అర్థంకాలేదు.

దానివెంట కుర్రాళ్ళు పడ్డారు, వాళ్ళ వెనక పెద్దవాళ్ళొచ్చారు. అందరికీ వెనకగా ఒక సైనికోద్యోగి ఈల ఊదుకుంటూ పరిగెత్తాడు. ఒక కుక్కకూడా ఆకస్మికంగా ఈ వేటలో చేరింది. కుక్క అరిచింది, మొరిగింది, పళ్ళతో కోతికాలు పట్టుకున్నంతపనీ చేసింది కానికోతిఅందలేదు.

మనకోతి మరింత వేగంగా పరిగెత్తింది. కుక్క అనుకుందిగదా: "ఎబ్బే, ఇంతకన్న ఆ బతికిన కాలేజీలోనే ఉంటే తీరిపోయేది. అక్కడే ఇంతకన్న ప్రశాంతంగా వుండింది. బాంబులు పడితే పడ్డాయి. సాధ్యమైనంత వేగిరం అక్కడికే చేరుకుంటాను."

ఆ ఉద్దేశంతో కోతి పిక్కబలంకొద్దీ పరిగెత్తసాగింది. కుక్కమాత్రం దానివెంటనే వుంది. మన కోతి ఒక తోట ప్రహరీమీది కెగిరింది. దాన్ని పట్టుకోవటానికి కుక్కకూడా ఎగిరేసరికి, చేతిలోవున్న ముల్లంగి

దుంపలు పెట్టి కుక్క ముట్టెమీద బలంకొద్దీ కొట్టింది కోతి. దాంతో కుక్కమూతి కాస్తా విరిగి అది కుంయోమంటూ ఇంటిదారిపట్టింది. అది అనుకుందిగదా, "వద్దు, నాయన్లారా. మీకోసం ఇన్నిపాట్లుపడి కోతిని పట్టుకునే కన్న హాయిగా ఇంటిదగ్గిర కాలుమీద కాలేసు క్కూచుంటే మేలు."

కోతి ఒక ఆవరణలోకి దూకింది. అక్కడ అవేషా పొపోవ్ అనే అబ్బాయి కట్టెలు కొడుతున్నాడు. కట్టెలు కొడుతూ కొడుతూ వున్న అబ్బాయి కాస్తా కోతిని చూశాడు. ఒక కోతిని పెంచాలని ఆ అబ్బాయి కెన్నాళ్ళ నుంచో సరదా. అబ్బాయి కోతిని పట్టుకుని లోపలికి తీసుకుపోయి, తిండిపెట్టాడు. కోతికి సంతుష్టి కలిగిందికాని పూర్తిగా కలగలేదు. ఏమంటే అవేషా అమ్మమ్మకు కోతిని చూడ గానే అసహ్యం వేసింది.

అమ్మమ్మ కోతిని గట్టిగా కేకవేసింది. కాని మీద ఒక దెబ్బకూడా వెయ్యబోయింది. కోతిచేసిన తప్పేమంటే అమ్మమ్మ టీ తాగే సమయంలో సహంతిని పళ్ళెంలో పెట్టిన అప్పచ్చి కాస్తా తీసుకుని తననోట్లో కుక్కు కుంది. అవునుమరి, కోతి అంతకంటె యేం చేస్తుంది? అది మనిషి కాదాయెను. మనుష లైతే అమ్మమ్మ చూస్తుండగానే అప్పచ్చులు కాజేస్తారా?

అమ్మమ్మ అన్నది: "పొట్టిగా, తోకేసు కుని ఇది కొంపలో ఉండటం యేమీ బాగా లేదు. భయమేస్తూ మనిషి మొహమూ ఇదీనూ. నేనీ కోతితో ఒక్కనాటికి కాపరం చెయ్యను. మా ఇద్దర్లో ఎవరో ఒకరు బతికిన కాలేజికి పోవలిసిందే."

అవేషా అన్నాడు: "ఎందు కమ్మమ్మా, ఈ భాగ్యానికి నువుపోయి బతికిన కాలేజీలో వుండటం. నా కోతి ఇంకెప్పుడూ నీ అప్ప చ్చులు ముట్టుకోదులే. నేను దీన్ని మనిషల్లే పెంచుతాగా, దానికి చంచాతో తినడంకూడా నేర్పుతాను, గ్లాసుతో టీతాగటం నేర్పుతాను. ఆది ఒకవేళ ఉట్టిపట్టుకుని దూలంఎక్కి నీ నెత్తిమీదికి దూకితే దానికి నేనేం చెయ్య గలను? అంతమాత్రానికి నువ్వేమీ భయపడ నవసరంలేదు. వాళ్ళ ఆఫ్రికా దేశంలో అది ఎగరటమూ గెంతటమూ నేర్చుకుంది.

మర్నాడు అవేషా బడికి వెళ్ళిన తరవాత అమ్మమ్మ కోతివిషయం పట్టించుకోలేదు. "నేనేమిటి ఈ దయ్యాన్ని చూసేదేమిటి? నయం!" అనుకున్నది అమ్మమ్మ. ఆమాట అనుకుని అమ్మమ్మ పనిపెట్టుకుని వాలు కుర్చీలో కూచుని నిద్రపోయింది.

అప్పుడు మన కోతి యేంచేసిందంటే కిటికీ లోనుంచి బయటికి జారుకుని వీధివెంట యెండలో షికారు బయల్దేరింది. ఆ సమయా నికే జబ్బుగా వున్న గావ్రిలిచ్ తాత స్నానాల ఇంటికి పోతున్నాడు. చేతిలో ఒక బుట్టలో తువాళ్లూ, సబ్బూ పెట్టుకున్నాడు. కోతినిచూసి మొదట కోతిఅని నమ్మలేక పోయినాడు. అంతకు పూర్వమే ఒక లొట్టెడు బీరుతాగి వుండటంవల్ల తన కళ్ళకి భ్రమకలిగిం దను కున్నాడు.

తాత కోతికేసి అట్లాగే చూడసాగాడు. కోతికూడా అతణ్ణిచూసి అనుకుంది: "ఈ అవతారమేమిటి? ఆ చేతిలో బుట్టేమిటి? అందులో ఏమున్నయ్యో?" ఇది మాయకోతి కాదని గావ్రిలిచ్ రూఢిచేసుకుని ఈవిధంగా అనుకున్నాడు: దీన్ని ఎట్లాగైనా పట్టుకుం టాను. రేపొద్దున దీన్ని బజారు పట్టుకెళ్ళి నూరు రూబుల్సుకు అమ్ముకుంటాను. నూరు రూబుల్సుతో పదిలొట్టెళ్ళ బీరు తాగవచ్చు."

గావ్రిలిచ్ కోతిని పట్టుకోవటానికి ఉపక్రమించాడు. "పుస్, పుస్, పుస్,.....దా, దా!" అని దానివెంట పడ్డాడు.

అది పిల్లి కాదని వాడికి తెలుసు. అయితే ఏం, కోతిని ఎట్లా పిలవాలో వాడెరగడు. కోతి అంటే వేళాకోళం కాదనీ, అది జంతువుల్లోకల్లా తెలివిగలదనీ వాడికి చప్పున తెలీలేదు. ఆ తరవాత జేబులోనుంచి కలకండ తీసి చేతిలో పట్టుకుని మర్యాదగా, "కపీశ్వరా, ఈ కలకండ స్వీకరించవా?" అని అడిగాడు.

"దానికే మత్యంతరం?" అన్నది కోతి. అంటే అది అచ్చగా ఈ మాటలే అవలేదు. దానికి మాటలు రావుగా. ఆ మాటలకు బదులు అది దగ్గిరికొచ్చి కలకండ పుచ్చుకుని బొక్కసాగింది. గావ్రిలిచ్ దాన్ని పట్టుకుని జాగ్రత్తగా బుట్టలో పెట్టుకున్నాడు. లోపల చక్కగా వెచ్చగా వుంది. "ఏం తమాషా జరుగుతుందో చూదాం," అనుకుని కోతి బయటికి దూకటానికి ప్రయత్నించలేదు.



గావ్రిలిచ్ కోతిని స్నానాల ఇంటికి పట్టుకెళ్ళాడు. వాడు అనుకున్నాడు: "దీన్ని చక్కగా స్నానం చేయింతాం. అప్పుడిది మరింత అందంగానూ, ఆకర్షవంతంగానూ వుంటుంది, ఎక్కువ ధరకూడా వస్తుంది."

వాడు కోతిని పట్టుకుని స్నానానికెళ్ళాడు. స్నానాల ఇల్లు ఎంతవేడిగా వుందంటే కోతికి ఆఫ్రికాలో ఉన్నట్టే వుంది. అది చాలా సంతోషించింది. కాని గావ్రిలిచ్ దాని వొంటికి పట్టించిన సబ్బు నురుగు దాని నోట్లోకి కంట్లోకి పోయి ఇబ్బంది పెట్టింది. దీనితో కోతికి తిక్కెత్తుకొచ్చింది. అదికాస్తా గావ్రిలిచ్ వేలు గట్టిగా కొరికి బయటికి పారిపోయింది.

మరో గదిలో స్నానానికిగాను గుడ్డలు విప్పుకుంటున్నవాళ్ళు దాన్ని చూసి దడుసుకున్నారు. అది కోతి అనే సంగతి ఎవరికీ తెలీదు. నురుగుబంతి గెంతుతున్నట్టుగా వారికి తోచింది. అది కుర్చీలమీదికీ, కుంపటిమీదికీ, పెట్టెలమీదికీ, మనుషుల తలలమీదికీ ఎగరసాగింది. కాస్త పిరికిగుండె గలవాళ్ళు బెదిరి కేకలుపెడుతూ పారిపోయినారు. కోతికూడా పారిపోయింది, మెట్లుదిగి.

మెట్ల అడుగున టిక్కెట్లిచ్చే ఆవిడ కూర్చునే గదివుంది. కోతి ఆగదిలో దూరి టిక్కెట్ల కంతలోనుంచి దూసుకుపోయింది. అక్కడ కూచున్న లావుపాటి మనిషి గాభరాగా బయటికి పరిగెత్తి "బాంబు! బాంబు!" అంటూ మూర్ఛపోసాగింది. మన కోతికీ అల్లరంతా చాలొచ్చింది. అది కిచ కిచలాడుతూ వీధినపడి సబ్బు నురుగుతోనే పారిపోసాగింది. మళ్ళీ జనం వెంటపడ్డారు. ముందు కుర్రాళ్ళూ, వెనక పెద్దలూ, దాని వెనక సైనికాధికారీనూ. అందరికీ వెనకగా గావ్రిలిచ్ తాతకూడా ఏదో ఓ గుడ్డ కప్పుకుని పాదరక్షలు చేతపట్టుకుని పరిగెత్తసాగాడు.

ఎక్కణ్ణించో ఒక కుక్కకూడా తటస్థపడింది, కిందటి రోజు కోతిని తరిమిన కుక్కే. కోతి ఆ కుక్కను క్రీగంట చూస్తూనే అనుకుంది: "అయ్యల్లారా, నా ఆట కట్టింది." కాని కుక్క కివాళ వేటాడే ఉత్సాహంలేక పోయింది. కోతిని చూస్తూనే దానికి ముక్కు నొప్పెత్తింది. అయినా అది కోపంగా ఒక

సారి బొంయిమని, "నే నిక్కడున్నాను జాగ్రత్త," అని హెచ్చరించింది.

ఇది ఇట్లా వుండగా అక్కడ అవేషా పొపోవ్ బడినుంచి తిరిగివచ్చి తన కోతికోసం వెతుక్కున్నాడు. విచారపడ్డాడు. పుట్టెడు దుఃఖంలో వీధిలోకి వచ్చాడు. వచ్చి పరిగెత్తుతున్న జనాన్ని చూశాడు. విమానదాడి హెచ్చరిక జరిగింది కాబోలనుకున్నాడు. ఇంతలో సబ్బు నురుగుతో సహా తడిసివున్న కోతి కనిపించింది. దానికేసి పరిగెత్తి దాన్ని పట్టుకుని రొమ్ముకేసి హత్తుకున్నాడు— ఎవరూ దాన్ని తనదగ్గిర్నుంచి లాక్కోకుండా.

జనమంతా పరిగెత్తటంమాని కుర్రాణ్ణి చుట్టుముట్టారు. అప్పుడు గావ్రిలిచ్ తాత జనం మధ్యకొచ్చి వాచిన వేలు చూపిస్తూ ఇట్లా అన్నాడు :

"నాయనలారా, ఈ కోతిని నేను రేపు అమ్మదామనుకుంటున్నాను గనక ఈ అబ్బాయి దీన్ని కాజెయ్యకుండా చూడండి. ఇది నా కోతి, నా వేలుకూడా కొరికింది. నా వేలువాపు మీకు కనిపించటంలేదా ? నేను చెప్పింది నిజమనటానికిదే సాక్ష్యం."

అబ్బాయి అవేషా ఇట్లా చెప్పాడు : "ఇది వాడి కోతికాదు, నాది. నాదగ్గిరి కెంత చనువుగా వస్తోందో చూడండి. నేను చెప్పిందే నిజం."

ఇంకో మనిషి ముందుకొచ్చాడు. వీడు కోతిని లారీలో ఎక్కించుకు పోయినవాడు. వాడన్నాడు : "ఈ కోతి మీ ఇద్దరిదీకాదు, నాది. నేనే దాన్నిక్కడికి తెచ్చాను. కాని నే నిక్కడ వుండటంలేదు. తిరిగి యుద్ధరంగానికి పోతున్నాను. నేను దీన్ని నిర్దయగా డబ్బుకుగాను అమ్మజూపే ఆ ముసలాడి కివ్వను, అంత ఆపేక్షగా దాన్ని ఎత్తుకున్న ఆ అబ్బాయికే ఇచ్చేస్తాను. కోతి అబ్బాయిది."

అందరూ కరతాళధ్వనులు చేశారు. సంతోషంతో అవేషా కోతిని ఇంటికి పట్టుకుపోయినాడు. గావ్రిలిచ్ తాతేమో వాచిన వేలేసుకుని స్నానం పూర్తిచేసుకోవటానికి స్నానాల ఇంటి కెళ్ళాడు.

నాటినుంచీ కోతి అవేషా పొపోవ్ దగ్గిరే వుంది. ఇప్పటికీ అక్కడే వుంటున్నది. కోతి ఎట్లావుందో చూడాలని ఇటీవల అవేషా పొపోవు దగ్గిరికి వెళ్ళాను, కులాసాగానే వుంది. ఇప్పుడు పారిపోవాలని ప్రయత్నించదు. చాలా మచ్చిక అయింది. చేతి రుమాలుతో ముక్కు తుడుచుకోవటం నేర్చుకుంది. తన అప్పచ్చులు కానివి అంటదు. అమ్మమ్మకూడా ఇప్పుడు తృప్తిగానే వుంది; కోతిమీద కోప్పడదు, బతికిన కాలేజికి పోతాననదు.

నేను అవేషా గదిలోకి వెళ్ళేసరికి కోతి టేబిలుముందు కూర్చునివుంది. గంభీరంగా సినిమాదగ్గిర టిక్కెట్లమ్మే ఆవిడలా గుంది. చంచాతో బియ్యం పరమాన్నం తింటున్నది.

అవేషా నాతో ఇట్లా అన్నాడు : "దీన్ని మనిషిని పెంచినట్టు పెంచాము. పిల్లలూ, కొందరు పెద్దలుకూడా దీన్నిచూసి చాలా నేర్చుకోవొచ్చు !"



# పేదవాళ్లంతా వొకటి

గోపీచంద్

తుపాకీగుళ్ళమోత....ఢాం. ఢాం. ఢాం.

కేకలూ. బొబ్బలూ; ఏడ్పులూ.

మంచంమీద పడుకొని వున్న పోలీసు రామయ్య. ఎక్కడో అని గాభరాపడుతూ లేచాడు. ఎక్కడోకాదు, తనదొక్కలో-కాదు కాదు, తన గుండెల్లో-కాదుకాదు, తన తలలో ఆ తుపాకీ గుళ్ళమోతా, ఆ కేకలూ, ఆ బొబ్బలూ, ఆ ఏడ్పులూ అన్నీ తనలోనే!

తల అదిరి పోతూవుంది. గుండెలు పగిలి పోతున్నయ్. డొక్కలు ముక్కలవుతున్నయ్. పిచ్చెక్కటం మాత్రం తప్పదు.

మొన్న ఫ్యాక్టరీ ముందు పికెటింగు చేస్తున్న కార్మికులమీద తాను తుపాకీ పేల్చాడు. తనకళ్ళ ముందే పది నిండు ప్రాణాలు పోయినై. అంతకుముందు అతి వుత్సాహంగా వున్నారు. ఇటూ అటూ కేకలు వేస్తూ తిరుగుతున్నారు. తమవాళ్ళతో ఏవో గుసగుస లాడుతున్నారు. ఫ్యాక్టరీ యజమానులతో పోట్లాడుతున్నారు. తను తుపాకీ పేల్చాడో లేదో, చటుక్కున చాప చుట్టలకు మల్లే పడిపోయారు.

ఏమినెత్తురు! కళ్ళు బయర్లు కమ్మకు పోతేను! ఆ శవాలను చూస్తుంటే తన శరీరం గగుర్పొడిచింది. అసహ్యం వేసింది. కంపరంపుట్టింది. ఆ నెత్తురు తన నోట్లోకి వొచ్చి పడుతున్నట్టు అనిపించి కడుపులో తిప్పింది.

ఆ చచ్చిపోయినవాళ్ళల్లో, ఇద్దరు ఆడంగులున్నారు. వాళ్ళని తను ఎరుగును. అప్పుడప్పుడూ కూరగాయల మార్కెట్లో కనిపిస్తూ వుండేవాళ్ళు. తన్ను చూస్తే ఎంత భయపడేవాళ్ళు! గజగజ వొణికిపొయ్యేవాళ్ళు. తాను అడిగిన కూరలన్నీ ఇచ్చి బిక్కమొహాలు వేసుక్కూచునేవాళ్ళు. తాను డబ్బిస్తే ఇచ్చినట్టు లేకపోతే లేదు.

ఆటువంటివాళ్ళకి ఇప్పుడీ ధైర్యం ఎక్కడనుంచి వొచ్చిందో! తన తుపాకికి ఎదురుగా నిలబడ్డారు. ఎన్నిచెప్పినా వెళ్ళరే! పైగా "నువ్వు న్యాయం అనుకుంటే చంపు రామయ్యన్నా!" అన్నారు. తనకు నిజంగా జాలికలిగింది. కాని ఏం చేస్తాడు? 'ఫైర్' అన్నాడు సూపరింటెండెంటు! తాను తుపాకీ పేల్చాడు. పాపం, ఆరెండో అమ్మాయి తుపాకిదెబ్బ తగలగానే ఎట్లా అరిచింది! అబ్బబ్బ.........తనగుండెలు మురిగిపోయినై. ఆకుర్రవాడు మాత్రం సామాన్యం అయినపని చేశాడా! ఎదురుగావొచ్చి. రొమ్ముఇచ్చి. "కార్మికుల రక్తం నీ కంతరుచిగా వుంటే తాగు" అన్నాడు.

నిజంగా ఆక్షణం తనకి చేతులు వొణికినై. ఆకుర్రవాని కళ్ళల్లో ఎంత ఏహ్యభావం కనిపించింది! తనమీద తనకే అసహ్యం కలిగింది. తాను మనిషికాదు-క్రిముల్లోక్రిమి. అనిపించింది, తుపాకీ కాల్చాడు.

అకస్మాత్తుగా వాడు, నుంచున్నవాడు నుంచున్న ఫళంగా నేలకు వొరిగాడు. అతనికళ్ళు మాత్రం ఇంకా తనవైపుకే చూస్తున్నయి. బతికివున్నప్పుడు చూసినట్టే! ఆ చూపులు తేళ్ళయి, జెర్రులయి తనవొళ్ళంతా పాకినై. గిరుక్కున మొహం తిప్పేసుకున్నాడు. కాని ఆకళ్ళు, అవేచూపులతో, ఇంకా తన్నే చూస్తుంటాయని తనకు తెలుసు.

"సోదరులారా?" ఒక కార్మికుడు మేగ ఫోన్లో మాట్లాడుతున్నాడు. తననిగురించే-పోలీసువాళ్ళని గురించి "మామీద తుపాకులు పేల్చకండి. మనం అంతా బీదవాళ్ళం. అందరం ధనవంతులకు ఊడిగంచేసుకొని బతుకుతున్నాం. ఒక్కసంగతి ఆలోచించండి. మేం యజమానుల్ని జీతాలు హెచ్చించమని అడుగుతున్నాం. ఇందులో మీకేమి సంబంధం? మీరూ మేమూ తగాదాలాడుకోవటం ఎందుకు? మీరు మమ్మల్ని చంపటం ఎందుకు? మీరూ మాలాంటివాళ్ళే! మనంఅందరం సోదరులం. మేము పేదవాళ్ళ అందరిహక్కులకోసం పోరాడుతున్నాం. మన విరోధులు మనలో మనకు చీలికలుపెట్టి, ఒకరిమీదకు ఒకరిని ఉసికొల్పి తాము సురక్షితంగా ఉంటున్నారు. నామాట వినండి. మనవిరోధుల మాటలు నమ్మి మీ సోదరులను హత్యచెయ్యటానికి పూనుకోకండి" అన్నాడు.

అతను చెప్పిందంతా నిజమే అనిపించింది తనకి. తనూ బీదవాడే. తనజీతం తనకి ఎప్పుడు చాలింది! తనకు ఎప్పుడూ డబ్బు ఇబ్బందే! డబ్బులేక ఎన్ని ఇబ్బందులు పడ్డాడు తను!

ఈకార్మికులు మాత్రం ఏమడుగుతున్నారు? నెలకి రెండు రూపాయిలు ఎక్కువ అడుగుతున్నారు. వాళ్ళకష్టాలు తనకు తెలుసు. రాత్రింబగళ్లు కష్టపడతారు. ఇంటికి వొచ్చేటప్పటికి ధారకానిక్కూడా ప్రాప్తం ఉండదు. వాళ్ళని తనెందుకు చంపాలి? తనకేం లాభం? వాళ్ళు తన్నేంచేశారు? వాళ్ళకు జీతాలు హెచ్చించకపోతే తనకేం లాభం? ధనవంతులకు లాభం. ధనవంతులకోసం తనెందు కీహత్యలు చెయ్యాలి? ఈ అమాయకపు కార్మికుల నెత్తురు తనెందుకు కార్చాలి?

మంచంమీద కూర్చున్న పోలీసు రామయ్యకి ఇంట్లోవుండ బుద్ధిపుట్టలేదు. ఒక్కసారి బయటకు వెళ్ళాలనిపించింది, కాని లేవలేకపోయాడు....

కార్మికులు ఏంచేస్తుంటారు? సమ్మె ఏమయిందో! పాపం తాను అకారణంగా చంపాడే....వాళ్ళ వాళ్ళ భార్యలూ భర్తలూ ....వాళ్ళకి పసి పిల్లలుకూడా వుండి వుంటారు.

అతని తలలో, "అమ్మా, అమ్మా" అనే ఏడుపులు వినిపించినై. భార్యలు...భర్తలు ....తల్లులు...పసిపిల్లలు....గుండెలు పగిలేటట్టు గీపెడుతున్నారు. ఆమోత భరించలేక పోయాడు పోలీసు రామయ్య. పట్ట బలవం తాన మంచంమీదనుంచి లేచాడు.

"ఎక్కడికి?"—భార్య అడిగింది.

"ఇక్కడికే"—అన్నాడు పోలీసు రామయ్య.

"అసలే ఓపికలేదు"—అన్నది భార్య.

"ఇప్పుడేవొస్తా"—అన్నాడు పోలీసు రామయ్య.

"కూలివాళ్ళు కోపంగా వున్నారు"అన్నది భార్య.

ఎందుకూ? ఎవరిమీదా? తనమీదేనా? ఉండదూ మరి? వాళ్ళు చెపుతున్నా వినక సూపరింటెండెంటు, ఆర్డరు ఇవ్వనే ఇచ్చాడని టపటప తుపాకీ పేల్చాడే! పదిమందిని తన పొట్టను పెట్టుకున్నాడే! కోపంగా ఉండంటే ఉండదూ మరీ? అయినా తనకేం భయం? ఒకసారి చూచి....

పోలీసు రామయ్య నడవలేక తూలిపడ్డాడు. నెమ్మదిగా లేపి మళ్ళీ పడుకోబెట్టింది భార్య. ఢాం, ఢాం, ఢాం....మళ్ళీ తలలో తుపాకులు పేలిన మోత, కేకలు, ఏడ్పులు, బొబ్బలు, బిక్క మొహాలు, తిండిలేక పాలిపోయిన మొహాలు, రక్తంతో తడిసిన మొహాలు— ఒకదాని తర్వాత ఒకటి కనిపించినై.

ఒక కార్మిక స్త్రీ చంటిబిడ్డ నెత్తుకొని, "బిడ్డకి పాల్లేవు" అని ఏడుస్తూంది. ఒక ధనవంతుడు "రక్తం తాగించు" అంటున్నాడు.

ఒక కార్మికుడు "ఆకలి" అంటున్నాడు. ఒక ధనవంతుడు "దాహం, దాహం" అని కేకలు వేస్తున్నాడు.

ఒక కార్మిక స్త్రీ, "మనం అంతా కూటికి లేనివాళ్ళమే అన్నా! మమ్మల్ని చంపుతావా?" అంటూవుంది. సూపరింటెండెంట్ "ఫైర్" అంటున్నాడు.

తను తుపాకి తీసుకొని ముందు నిలబడ్డాడు, కార్మికులు తనకు ఎదురుగా నిలబడ్డారు. ఎదురుగా నిలబడ్డవాళ్ళ మొహాలు చూస్తుంటే తన తండ్రి జ్ఞాపకం వొచ్చాడు. తన తండ్రి ఆ ఫ్యాక్టరీలో కూలివాడుగా పని చేశాడు. కూలిచేసుకుంటూ కుటుంబాన్ని పోషించాడు. జీతం చాలక ఎన్నిబాధలు పడేవాడు! తన తల్లి యెందుకు మరణించింది! పేదరికం పేదరికమే! ఎవ్వరినైనా ఒకే విధంగా పీల్చి పిప్పిచేస్తుంది.

మరి తనెందుకు చంపాలి ఈ బీదవాళ్ళని? ఆకలి అవటం తప్పా! ఎవరికైతేమాత్రం ఆకలి తీరొద్దా! యుద్ధంవొచ్చినాక లక్షలు లక్షలు గడించారే, ఈ ఫ్యాక్టరీ యజమానులు, కూలివాళ్ళకు ఒక రూపాయి ఎక్కువ చెయ్యమంటే ఎందుకు చెయ్యరు! సంపాదించేదేమో వాళ్ళవల్ల....డబ్బు ఇవ్వొచ్చేటప్పటికి పోలీసువాళ్ళని పిలుస్తారు. తనకేం బట్టే! తనెందుకు వాడిగట్టాలి ఈ పాపానికి? తోటి బీదవాళ్ళని తనెందుకు చంపాలి?

"చంపను చంపను" అంటూ మళ్ళీ మంచంలోలేచి కూర్చున్నాడు పోలీసు రామయ్య.

"పడుకో" అని పడుకోబెట్టింది భార్య.

"వాళ్ళు నావాళ్ళే! వాళ్ళూ నేనూ ఒకటే!" అన్నాడు పోలీసు రామయ్య.

"వైద్యుడు మాట్లాడవొద్దన్నాడు" అన్నది భార్య.

"బీదవాళ్ళంతా ఒకటి" అన్నాడు పోలీసు రామయ్య.

"పడుకోవూ?" ప్రార్థించింది భార్య.

"నేను చంపను - చంపను" అన్నాడు పోలీసు రామయ్య.

ఏమన్నాకానీ తాను బీదవాళ్ళమీద తుపాకీ పేల్చడు. పేల్చకుండా అలాగే నిలబడ్డాడు. కార్మికులంతా తనచుట్టూ పోగవుతారు. వాళ్ళ కళ్ళు సంతోషంతో మెరిసిపోతుంటై. తనని కృతజ్ఞతతో కావిలించుకుంటారు. అబ్బా.... వాళ్ళ శరీరస్పర్శ ఎంత ఆనందాన్నిస్తుంది- ఎన్నడో మరణించిన తన తల్లి కావిలించుకున్నట్టు వుంటుంది. అవును, యెందుకు వుండదు?

సూపరింటెండెంటుకి యెంతకోపంవొస్తుందని! ఆయనకి వొళ్ళు మండిపోతుంది. తనని కోరచూపులు చూస్తాడు.

'పోలీసు రామయ్య కార్మికుల్లో కలిసిపోయాడు' అనుకుంటాడు. అనుకోనీ, అనుకుంటే తనకేం? తనమీదకే తుపాకీ గురిపెడుతున్నాడు సూపరింటెండెంటు. కాలుస్తున్నాడు. కాల్చుకోనీ, గుండు డొక్కలో దూరింది. దూరనీ...."అబ్బా" అని మూలిగాడు మంచంలోవున్న పోలీసు రామయ్య.

"నొప్పా ?" అడిగింది భార్య.

"అయితే ఏం"అన్నాడు పోలీసురామయ్య.

"ఎక్కడ ?" అడిగింది భార్య.

పోలీసు రామయ్య జవాబు చెప్పలేదు. మాట్లాడకుండా పడుకున్నాడు .... ఢాం, ఢాం, ఢాం. ఝళ్ళీ తలలో తుపాకీ మోతలూ, కేకలూ, బొబ్బలూ, ఏడ్పులూ. కార్మికుల దీనవదనాలు ఒకదానితర్వాత ఒకటి కనిపిస్తున్నయ్.

"అన్నా !"

"మనం అంతా బీదవాళ్ళం"

"మనం అంతా ఒకటి"

"ధనవంతులపక్క జేరతావా ?"

"నీకేమొస్తుంది ?"

"చంపుతావా ? మమ్మల్ని చంపుతావా అన్నా ?"

"చంపను...చంపను ... ఏమన్నాకానీ" అన్నాడు మంచంలోవున్న పోలీసు రామయ్య అతని భార్య కన్నీరు మున్నీరుగా ఏడ్చింది.

డాక్టరువొచ్చి పరీక్ష చేశాడు పోలీసు రామయ్యని.

"ఎక్కడ నొప్పి ?" అడిగాడు.

"డొక్కలో" అన్నాడు రామయ్య.

డాక్టరు పరీక్షచేసి, "ఏమీలేదు" అన్నాడు.

"అయితే గుండెల్లో" అన్నాడు పోలీసు రామయ్య.

డాక్టరు పరీక్షచేసి ""మీలేదు" అన్నాడు.

"అయితే తల్లో" అన్నాడు పోలీసు రామయ్య.

డాక్టరు పరీక్షచేసి, "అబ్బే, వూరికే భయపడుతున్నావు. నీకే జబ్బూలేదు" అన్నాడు.

"లేకపోవటం ఏమిటి ?" అన్నాడు పోలీసు రామయ్య కోపంగా. డాక్టరు అతని మాటలు వినిపించుకోలేదు. వెళ్ళిపోతూ, "మనోవ్యాధి. అంతకంటే ఏమీలేదు" అని అతని భార్యకు చెప్పాడు.

ఢాం... ఢాం....ఢాం, పోలీసు రామయ్య తలలో తుపాకులు పేలుతున్నయి. కేకలూ, బొబ్బలూ, ఏడ్పులూ వినబడుతున్నయి. కార్మికుల దీనవదనాలు వరసగా కనిపిస్తున్నయ్.

"అన్నా నన్నెందుకు చంపావు ?"

"నేను నీకేం అపకారం చేశాను ?"

"అంతా బీదవాళ్ళమే మమ్మల్నా నువ్వు చంపాల్సింది ?"

"రామయ్యన్నా ఇదినీకు ధర్మమా ?"

"మేం అందరి బీదవాళ్ళకోసం పోరాడుతున్నాం"

"రామయ్యన్నా మనం అంతా ఒకటి. మమ్మల్ని చంపకు."

"చంపను....చంపను" అనిలేచి కూర్చున్నాడు పోలీసు రామయ్య...."తప్పు క్షమించండి........క్షమించండి........ఏమన్నాకానీ చంపను....మీరూ నేనూ ఒకటి....అంతా బీదవాళ్ళం...." అన్నాడు పోలీసు రామయ్య.

పోలీసు రామయ్య హృదయం నెమ్మదించింది. ఇప్పుడతని తలలో తుపాకులు పేలటం లేదు. కేకలూ, ఏడ్పులూ, బొబ్బలూ లేవు. "కార్మికుల ప్రాణాలు తీశాను. వాళ్ళకోసం ప్రాణాలు అర్పిస్తాను" అనుకున్నాడు పోలీసు రామయ్య....



# దీక్షితులుగారికి చలంగారి ఉత్తరాలు

98

బెజవాడ
My dear Laddie. 6-5-40

మీకు కొన్ని tips (టిప్సు) పంపుతున్నాను. వాటివల్ల నాకు ఉపయోగం కనపడ్డది. మీకు సహాయపడతా యనుకుంటాను. భగవాన్ మనదగ్గిర లేనప్పుడు ఆయన్ని మనదగ్గరికి బలవంతాన రప్పించుకోవాలి, కాదు ఆయన వొచ్చేట్టు మనం ఆయనకి సహాయంచెయ్యాలి. రెండూ ఒకటేనేమో లెండి.

1. తప్పనిసరి అయినప్పుడు తప్ప, మౌనం పూనండి. చదవకండి, మాట్లాడకండి. ఆలోచనల నట్లా తేలిపోనీండి. కాని పనిపెట్టుకుని ఆలోచించకండి. వార్తాపత్రికలుకూడా చదవకండి.

2. మనసు ఏకాగ్రం కావాలని బెంగపెట్టుకోకండి. ఏకాగ్రం కాలేదని దిగులుపడకండి. వొదిలెయ్యండి అట్లా.

3. ఏకాగ్రం చెయ్యాలని చాలా గట్టిగా ప్రయత్నం అక్కర్లేదు. Be idle. Be ready-అనుగ్రహం వచ్చినప్పుడు సిద్ధంగా ఉండండి.

4. ఇంటిపనులలో గాని, (పిల్లలతోనైనా సరే) ఆఫీసులో గాని, యితర విషయాలలో కాని ముందు మీరు కదిలించకండి. ఇతరులు వొచ్చి మీ మనసుని కదిలిస్తేనే గాని కదలకండి. ఇతరుల దగ్గరికి మీ అంతట మీరు వెళ్ళకండి. ఇతరులతో ముందు మాట్లాడకండి. వాళ్ళు మాట్లాడిస్తే తొరగా ముగించండి.

ఇంకా "అక్కడ" చేరలేదని వ్యధ పడకండి.

మీరు "అక్కడే" వున్నారు.

చాలాసార్లు—"భగవాన్ Is it your pleasure to come? అని అడగండి.

Watch, wait and 'do not' pray.

ఫరవాలేదు. నేను నడుస్తూనేవున్నాను. భగవాన్ ఈ దోవన చాలాసార్లు వెడుతున్నాడు.

భగవాన్‌మీద మీరు ఫిర్యాదు చేసుకునేందుకూ, మీకు సలహానీ, ధైర్యాన్నీ ఇచ్చేందుకూ, మీకూ ఓ సౌరిస్‌వుంటే బావుండును! సౌరిస్ నాకన్న ఓ అడుగు ముందు వుంటుంది. She beckons, reassures and smiles.

నిర్వ్యాపారాన్ని మనసు భరించలేనప్పుడు తప్ప చదవకండి, మాట్లాడకండి. అప్పుడైనా పిల్లలతో ఆడుకోండి, భగవాన్ సంగతులు మాట్లాడండి.

ధ్యానమైనా బలవంతం చెయ్యకండి. ఏకాగ్రత లేకండానైనా సరే, నిరంతర నామజపం సహాయం చేస్తుందేమో!

99

అరుణాచలం

My dear Toy, 13-5-40

మీ పద్యం భగవాన్ ముందుపెట్టే ధైర్యం తెచ్చుకుంటున్నాను. రేపు ఇక్కడే వుంటే నేను, భగవాన్‌కి ఇయ్యగలనేమో! ఇదివరకటి మల్లే నే కొట్టుకుంటున్నాను ఇక్కణ్ణించి ఎప్పుడు బైటపడతానా అని. ఈసారి భగవాన్ నాకు ఇంకా దగ్గిరిగా వొచ్చారు. సౌరిస్ సంగతి ఏదో ఒకటే ఒకటి మాట్లాడతారు భగవాన్. సౌరిస్ ద్వారా ఆయనదృష్టి నామీదికి వొస్తోంది.

100

బెజవాడ

My dear Boy, 17-5-40

ఆశ్రమం సంగతులు నేను చెప్పేందుకు, మీ రిక్కడవుంటే బావుండును. ఆశ్రమంలో పదిరోజులు వుందామని వెళ్ళాము. మూడురోజుల్లో తరిమేశారు మమ్మల్ని భగవాన్. హాలులో మిమ్మల్ని తలుచుకొన్నాను! మీ పద్యం భగవాన్‌కి ఇయ్యలేకపోయినాను, ఆయన అట్లా ఉద్దేశించలేదు గావును! ఆశ్రమంమీద scandals అపవాదులు హెచ్చుతున్నాయి. మీ పద్యం నాకు బావుంది (as simple and pure as your heart) మీ హృదయమంత సింపుల్‌గా నిర్మలంగావుంది.

సూర్యనారాయణగారికి బావుండలేదు అది. సౌరిస్‌కి బావుంది.

ప్రతిరోజూ భగవాన్ సౌరిస్‌సంగతి మాట్లాడుతున్నారు. సౌరిస్‌మీద ఆయనకి శ్రద్ధ. ఇన్ని ప్రయత్నాల ఫలితం అప్పుడప్పుడు కనపడుతుంది. ధ్యానంలో ఆనందం కలుగుతోంది. కాని ఎప్పుడో ఒసారి, కొన్ని నిమిషాలుమాత్రం.

మహానందిలో ఓ వారం వుండాలని నా కల. కాని కదలడానికి బద్ధకం. చూడడానికీ, తెలుసుకోవాలనీ, వుండే కొంచెం వాంఛా ఇప్పుడు అసలు పోతోంది.

ఇదేం ముఖ్యం కాకపోయినా, ఈ సంగతి మీ రికార్డులో వుంటే మంచిది. ఈమధ్య 'మదర్ కృష్ణగారు' నా ధ్యానంలో కనపడుతున్నారు. She is supplying the emotional side of meditation—నా ధ్యానానికి ఆమె భావన నిచ్చారు. ఆమె రూపం నా మనసులో నృత్యంచేస్తుంది. పిలుస్తుంది. నవ్వుతుంది. కొంతప్పుడు ఆమె హృదయంలోంచి నా హృదయంలోకి ఆనందం పొంగుతుంది.

ఇది మనం గడపవలిసిన ఒక stage గావును.

ఆశ్రమానికి మామిడిపళ్లు పంపాను.

## 101

ఏలూరు

My dear Laddie, 19-7-40

శుక్రమహాదశ ఈరోజు ప్రారంభం. నాకు: మీ అందాల వుత్తరాన్ని తీసుకొచ్చింది ప్రప్రథమం.

భయంలేదు. శుక్రుడిచ్చే సుఖాల్నించి, పాపాలనించి, భగవాన్ కాపాడతారు నన్ను. శుక్రుడేం చెయ్యగలడు! అదిగాక శుక్రు డివ్వగల భోగాలన్నీ భగవాన్ అనుగ్రహానికి పూర్వమే అమ్మేసుకున్నాను.

చాలా స్పష్టంగా తెలిసేట్టు, నేను అభివృద్ధి చెందుతున్నాను.

ఈమధ్య అడపా తడపా, కొందరు సామ్యవాదులు, నా కీర్తిని విని, నన్ను చూడ్డానికి వొస్తున్నారు. నా మౌనమూని 'బజారు సోషలిస్టులు' అని ఓ వ్యాసం వ్రాయాలనిపిస్తోంది. కాని వ్రాయాలని లేదు—no inclination.

## 102

ఏలూరు

My dear Viceroy, 4-9-41

.. ఎంతో అనిపిస్తోంది మీకు వ్రాయక తప్పదని, అన్ని musings. కాని వ్యవధి ఏదీ? గంటలుకొట్టారు. నేను class కి వెళ్లాలి, అవును జోష్యులు చెప్పారు కదా మీకు కష్టదినాలు అని! అయితేనేం? ఈ దిగుళ్ళన్నీ హోమపతీమాత్రలు, దేహాత్మబుద్ధిని నయంచేసేందుకు, నేను చెప్పాలా మీకూ? మీరు వ్యధపడుతున్నారని సంతోషిస్తున్నాను.

చాల గొప్పవాడిమల్లే మాట్లాడుతున్నానా? అయితే ఆ గొప్పతనమంతా భగవాన్‌ది, మీరు తెచ్చిపెట్టిన భగవాన్‌ది.

మధ్యాహ్నం టీ దగ్గర అప్పుడప్పుడు భగవాన్‌సంగతి మాట్లాడుకుంటాము నేనూ నరిసింహంగారూ యింకా ఉదారులైన మిత్రులూ. They do not see. Most of the people do not see that it is a vital life and death matter యివి చాలా ముఖ్యమైనదని చావుబతుకుల కన్న ముఖ్యమైన విషయమని గుర్తించరు. వాళ్ళేకాదు చాలామంది. స్త్రీనిగురించి ప్రజలతో అదే నా తగాదా. అది స్వల్ప trivial విషయంకాదు. It is not a passing fancy.

నాకు ఇప్పుడు రాత్రింబవళ్ళు మొదటి ఆలోచనా, చివరి ఆలోచనా, "నేనింకా పక్వంకాలేదు - ఏదీ అందుకోలేదు ఎప్పుడు! ఎప్పుడు! ఎప్పుడు! ఎట్లా? ఎట్లా?" కాలుతున్నాను. అదొక్కటే న్నాకోర్కె, అదే ఆశయం. నా శరీరపు అనారోగ్యం భగవాన్ అనుగ్రహాన్ని నాకు చేరనీకుండా చేస్తోంది. ఈ శరీరాలమీద కొంత వరకన్నా ఆధారపడక తప్పదు. అవి మన మనసులకీ ఆత్మలకీ ఆధారాలు.

మీరు భయపడ్డ మార్గాల శుక్రుడు పనిచెయ్యడం ప్రారంభించాడు. ఒక ఆమెని తీసికొచ్చాడు. చాలా మోహతీవ్రత గల అనుభవం. కాని ప్రస్తుత మనోస్థితిలో ఆమె విసుకుపుట్టింది నాకు. But you know how Bhagvan summerily disposed off my previous glamour. సంబంధము తీరిపోలేదు ఇంకా ఈమె నాలో స్థిరపడాలని ఉద్దేశిస్తోంది.

ఎంత సులభంగా నేర్పుగా భగవాన్ గడిచిన నా మోహసంబంధాన్ని తెంచేశారో మీకు తెలుసునుగా! ఆ అమ్మాయిని నాకు అందనంత దూరంగా లక్నో పంపించేశారు.

ఇప్పు డీమె కళ్ళల్లోకి చూస్తోవుంటే రెండుసార్లు ఆమె కళ్ళలో భగవాన్‌ని చూశాను. అది అలవాటైపోయింది. ఎప్పుడైనా మనదృష్టిని ఏకాగ్రంచేస్తే తీవ్ర మోహంవల్ల కానీ, లేక ఘోరమైన నేరం చెయ్యడానికి కానీ - అలవాటుచొప్పున భగవాన్ కనపడతారు. ఈ శరీరానుభవం ఆధ్యాత్మిక అనుభవంగానన్నా మారాలి. లేక భగవాన్ సంబంధం మన శరీరానుభవమంత materially intense భౌతికంగా అంత తీవ్రమన్నా కావాలి. అట్లా అనిపించింది నాకు. నేనూ అనుకుంటున్నాను. శుక్రుడు స్త్రీలని నాకు తెస్తాడని, మీరు అన్నది నిజమౌతుందని.

కానీండి. శుక్రుణ్ణి తన డ్యూటీని చేసుకోనీండి. Let the women come. I feel I am strong with the strength of ten men and one Bhagvan.

# డిసెంబరు నెల భావపరిచయ పోటి




సమాధానం

ఈ నెల బహుమానం 10/- ఈ క్రిందివారికి యివ్వబడినది.

"తనంత తావలచి వచ్చిన చుల్కనగాదె యేరికిన్."

బి. రామమూర్తి,
వజ్రకరూరు.




# ద్వితీయాంకం

## ఒకటో దృశ్యం

(అనంతం ఆఫీసు, పదిగంటలవేళ. ? అనంతం ఒక్కడే గదిలో పచారుచేస్తూ ఉంటాడు)

అనంతం:- నా ఘట్టినమ్మకం, అపిల్లేమాయ అని. లేకపోతే బూటు ఎందుకు విప్పలేదూ? ఇందులో పెద్ద కుట్ర ఏదో ఉంది! ఈ రహస్యాన్ని భేదించి తీరవలసిందే....పోతే ఆరెండో పిల్ల! ఆముఖంలో ఎంత కొంటెతనముంది? ఎంత చక్కగా నవ్వింది! పరిచయం అడగ లేదు....వెంట ఆ రాక్షసుడున్నాడుగా, సరిగా మాట్లాడటానికే చోటివ్వలేదు!....లాభంలేదు. వెతికి వాళ్ళజాడా తీయవలసిందే. నేను డిటెక్టివుని....మామూలు చిరునామా కనుక్కోలేక పోతానా? తప్పకుండా కనుక్కుంటాను.

(గోవిందు వస్తాడు)

గోవిందు:- చిత్తం. ఆయన వొచ్చాడు.

అనంతం:- ఆయనా? ఎవడాయనా?

గోవిందు:- చిత్తం. నిన్నటి ఆ నత్తి ఆయన.

అనంతం:- నత్తాయనా! అంటే, ఆ నారసింహుడేనా? (గోవిందు తల ఆడిస్తాడు.) అయితే కొంపమునిగింది! ఏమి కావాలంటాడు, ఆ రౌడీవెధవ?

అనంతం:- ఏమో బాబూ! ఏం చెప్పటంలేదు. నన్ను చూడగానే గుర్తుపట్టాడు. నావంక పరీక్షగాచూసి నీగడ్డమేదీ? అన్నాడు. నేను చెప్పేశాను, అమ్మగారికి అనుమానం వేస్తేనూ తీసివేయించానని.

అనంతం:- అయితే వాడు కనుక్కున్నాడన్నమాట? గోవిందూ! నీకు పుణ్యముంటుంది. పోయి నేను ఇంటోలేననో, లేక నిద్రపోతున్నాననో, కాదంటే చచ్చిపోయినాననో ఏదో ఒకటి చెప్పి వాణ్ణి ఇక్కణ్ణించి పంపించు.

గోవిందు:- చిత్తం—(వెళ్ళబోతాడు)

అనంతం:- కాని—వాడిదగ్గరినించి ఆపిల్ల అడ్రసు కనుక్కోవచ్చునే. పిలిచిచూస్తే ! ఏం, గుర్తుపట్టితేమాత్రం ? గోవింద్ ! ఆయన్ని పిలుచుకు రా.

గోవిందు:- (సంకోచించి) చిత్తం, చిటికెలమీద తెస్తాను.

అనంతం:- ఆఁ, చిటికెలమీద హాజరుపెట్టు. (గోవిందు వెళ్ళిపోతాడు) ఆవ్యక్తి వాళ్ళ కేదో చుట్టమై ఉంటాడు—బహుశా అన్న అయినా కావచ్చు ! అన్నా ? ఉహుఁ—అన్నలాగా లేదు వాడిముఖం. మరి— ?

(భీమసేనరావు వస్తాడు.)

భీమ:- న న నమస్కారం !

అనంతం:- నమస్కారం—దయచేయండి.

భీమ:- మీరు డిటెక్టివులని నిన్నఎందుకు చెప్పలేదూ ? (కూచుంటాడు)

అనంతం:- చాలా కొద్ది పరిచయం కావటాన అవసరమనుకోలేదు—మీరుకూడా మీ పరిచయం ఇవ్వలేదు కదా.

భీమ:- హుఁ. నేనుకూడా అ అ అవసరమనుకోలేదు.

అనంతం:- మీరు బహుశా ఆస్త్రీల అన్న అనుకుంటాను, అవునా ?

భీమ:- ఉహుఁ. నేను ఏ ఇ ఇస్త్రీకీ అన్నను కాను. వారిద్దరిలో ఒకామె—పోనివ్వండి ఆసంగతి. నేను మి మి మీతో ఒక పనిఉండి వచ్చాను. మి మి మీరేకదూ 'అనంత దుర్దశాలయం' డిటెక్టివులు ?

అనంతం:- ఆ.

భీమ:- అయితే వినండి. నిన్న నేను ఆయిద్దరి స్త్రీలనూ తీసుకుని బీచివొడ్డుకు షికారెళ్ళాను. ఒకడు ఎవడో—దొంగముండాకొడుకు—అందులో ఒకామె బూటువిప్పమని వెంటపడ్డాడు. వాడుకావాలి నాకు. మీరు వాణ్ణివెతికి నాకు పట్టి ఇస్తారా ?

అనంతం:- (ఆలోచించి) అయితే ఆ వొంటరిగా కూర్చున్నయువతి—అంటే బూటువిప్పమని కోరబడినావిడ—ఆమేనా మీ 'ఇద్దరిలో ఒకామె'— ?

భీమ:- ఆ వివరాలు మీకెందుకూ ?

అనంతం:- ఏమీలేదు, ఊరకనే అడిగాను. డిటెక్టివులు, నిజానికి, అన్నీ తెలుసుకోవాలి. ఆ రెండో యువతి, గులాబిరంగు చీరెకట్టుకున్నావిడె— ?

భీమ:- చు చు చూడండి. నేనా ఇ ఇస్త్రీల సంగతులు మీకు చెప్పటానికి రాలేదు. న న నాకు ఆ రాస్కెల్ కావాలి. మీరు పట్టివ్వగలరో లేరో నాకు చెప్పండి.

అనంతం:- చూడండి మిస్టర్—

భీమ:- రావ్ ! భీమసేన రావు !

అనంతం:- చూడండి మిస్టర్ రావ్ ! నే నిలాంటి చిన్నచిన్న కేసులు, అంటే చెప్పుల దొంగతనాలు, పట్టను—

భీమ:- (లేచినుంచుని) చిన్న కేసా ! ఒక స్త్రీని అవమానించటం చిన్న కేసా ! నీ వెలాంటి పెద్దమనిషివయ్యా ?

అనంతం:- సరే. నేను వాణ్ణి మీకు పట్టిఇచ్చాననే అనుకోండి. మీరేం చేస్తారు ?

భీమ:- ఏంచేస్తానా ? పొడి పొడి చేస్తాను. ముందు మొహంమీద ఒకటిస్తాను. తర్వాత పొట్టలో ఒకటి తంతాను—ఆ తర్వాత జుట్టుపట్టుకుని....

అనంతం:- ఓ౯....ఇలాంటి రాక్షసకృత్యాలకు నేను సహాయపడలేను. క్షమించండి.

భీమ:- చేయరన్నమాట ?

అనంతం:- ఉహు౯.

భీమ:- అయితే నువ్వు పిల్ల డిటెక్టివ్వు—కాన్‌స్టేబుల్‌వు !

అనంతం:- చూడండి. మీరంత అసహ్యంగా మాట్లాడకూడదు. ఒంటో బలముంటే మాత్రం—

భీమ:- పో ! నువ్వు కాన్‌స్టేబుల్‌వు కూడా కాదు. మోతాదువి ! (వెళ్ళిపోతాడు)

అనంతం:- (కొంచెంసేపు పచారుచేసి శాంతపడినాక) ఇందులో ఏదో పెద్ద రహస్యముంది. ఈ నత్తివాడు వాళ్ళకు రక్షకుడైవుండాలి. లేకపోతే పరిచయం ఎందుకివ్వటం ? (నవ్వి) ఏం తెలివి ! నా దగ్గిరికేవచ్చాడు వాడిని పట్టివ్వమని ; కాని—ఇంకా వేరే ఉద్దేశం లేదుగదా ! (ఆలోచించి) ఓ. ఇప్పటికి అర్ధమయింది ! ఈ నత్తివాడు దొంగ ; గజదొంగ—అసలు ఆపిల్లే మాయ ! మాయను పెళ్ళిచేసుకుని గోపాలయ్య జమీందారీ అంతా కాజెయ్యాలని వీడు ప్లానువేశాడు. అబ్బ ! ఎంతపెద్ద కుట్ర !....అయితే మరి నా దగ్గిరికెందుకు వచ్చినట్టు ? బహుశా, నేను మాయను వెతకటానికి ఇక్కడికొచ్చిన సంగతి తెలిసివుంటుంది—అంచేతనే ఆ ఆరా తీయటానికి వచ్చివుంటాడు...ఇంతకూ మాయ అడ్రసు దొరకనేలేదే—ఈ నత్తివాడు ఆ విషయంలో చోటు పెట్టకనేపోయె !—ఆపిల్ల జాడ దొరికినట్లయితే—

(గోవిందు వస్తాడు)

గోవిందు:- చిత్తం. వారువొచ్చారు.

అనంతం:- మళ్ళీనా !

గోవిందు:- చిత్తం: ఆయనకాదు. ఆయనవెంట లేరూ ఇద్దరు పిల్లయా. అందులో ఒకామె.

అనంతం:- ఏ ఆమే.

గోవిందు:- మునిమునినవ్వులు నవ్వలా, ఆమే ! ఉద్యోగంకోసం వచ్చిందట.

అనంతం:- ఆ౯. అట్లానా !—పోయి త్వరగా తీసుకురా. (గోవిందు వెళ్లతాడు)

ఎంత చిత్రం ! ఆపిల్లే వచ్చింది నౌకరికోసం ! కాని........దీన్లో ఏమీ తిరుగుడు లేదు కదా ? ఏమైనా కానీ, కొంచెం జాగ్రత్తగా వుండటం మంచిది.

(గంభీరంగా కూచుని కాగితాలు తిరగవేస్తూ వుంటాడు. మీరా వొస్తుంది)

మీరా:- నమస్కారం !—ఇదేమిటి ! (అనంతాన్ని చూసి ఆశ్చర్యపోతుంది)

అనంతం:- నమస్కారం ! కూచోండి—(కాయితాలు చూడటంలో మగ్నుడౌతాడు)

మీరా:- తమరేనా డిటెక్టివ్ అనంతంగారు ?

అనంతం:- ఆ౯. (కాయితాల సంగతి మరిచిపోయి) మీపేరేమిటి ?

మీరా:- మీరా. క్షమించండి—మీరేకాదూ విన్న—

అనంతం:- బీచిదగ్గర. ఆc. నేనే! సరిగ్గా గుర్తించారు. నిన్న మీతో మాట్లాడుదా మనుకున్నాను గాని మీరే త్వరగా వెళ్ళిపోయారు. (సర్దుకుకూచుని) చూడండి, నేను చాలా బిజీగావున్నాను. మీ కేమికావాలో సెలవిస్తే—

మీరా:- ఏమీలేదు. మీరు ఒక సెక్రటరీ కావాలని ప్రకటనచేశారు కదూ, అందుకోసం—

అనంతం:- ఓ, అదా! నాకు జ్ఞాపకమేలేదు. అయితే—మీరు సెక్రటరీపని చేయాలనా?

మీరా:- మీకు పనికివస్తానని తోస్తే.

అనంతం:- పనికిరావటమా? ఏమిటి మీరు చెప్పేది! మీలాంటి సెక్రటరీ దొరకటం—(సర్దుకుని) చూడండి./ మీకు పనిచేయాలనివుంటే నాకే ఆక్షేపణాలేదు. ఉండిపోండి. పనికూడా అంత కష్టమైంది కాదు—పదిగంటలనించి—

మీరా:- అయితే నాకు ఉద్యోగం ఇచ్చినట్టేనా?

అనంతం:- ఆc. తప్పకుండా—మీకేమీ అయిష్టం లేకపోతే—

మీరా:- (నవ్వి) అయిష్టంవుంటే ఎందుకొస్తాను? కాని, నా క్వాలిఫికేషన్లు మీరేమీ అడగలేదే!

అనంతం:- (గాభరాగా) అదే ఇప్పుడు అడగబోతూవున్నాను. (గంభీరంగా) మీకు చదువమా వ్రాయనూ తెలుసునా?

మీరా:- తెలుసు కొంచెం. ఇంటరు పాసయాను.

అనంతం:- ఏమిటీ? ఇంత చిన్నవయిసులోనా? చూస్తే మీబుర్ర బ్రహ్మాండమైంది లాగా వుంది. (ప్రశంసాదృష్టితో చూస్తాడు)

మీరా:- (తలవంచుకుని) నాబుర్ర అంత పెద్దదా!

అనంతం:- కాదూ! మీవయస్సులో నేను స్కూలుఫైనల్లో దేకుతున్నాను. (సర్దుకుని) ఏమిటి మనం మాట్లాడుకుంటున్నది?—ఆc. అయితే మీరు చదువుకున్నారన్నమాట. పరే—(బుర్ర గోక్కుని) కుట్టుపనీ, వంటా వగైరాలు తెలుసునా? సంగీతంకూడా—

మీరా:- (ఆశ్చర్యంతో) మీ ఆఫీసులో పనిచేయటానికి ఈక్వాలిఫికేషన్లు కావాలా?

అనంతం:- అక్కర్లేదు! అంటే—నేను డిటెక్టివును కాదూ, అందుకని అన్ని సంగతులూ తెలుసుకోవాలి. అయితే మీకు—

మీరా:- షార్టుహాండ్ టైప్‌రైటింగ్ కూడా తెలుసు.

అనంతం:- (కాసేపు స్తంభించిపోయి) మీరు—మీరుచూస్తే చాలా అద్భుతమైనవారులాగా ఉన్నారు. మిమ్మల్ని చూసినకుందికీ నాబుర్ర పనిచేయకుండా పోతోంది. మీరేదో తప్పి పుట్టారు ఆడవారిగా!

గోవిందు:- (వాకిట్లోనించి తొంగిచూసి) ఒకగుంపు వచ్చారు బాబూ, ఆంగ్లో ఇండియను అమ్మాయిలూ, ఇండియన్ అమ్మాయిలూ.

అనంతం:- వాళ్ళందర్నీ పంపించివెయ్యి, సెక్రటరీ కుదిరిందని చెప్పి.

గోవిందు:- చిత్తం.

(తలలాక్కుని వెళ్ళిపోతాడు.)

అనంతం:- ఆఁ. ఏమిటి మాట్లాడుకొంటున్నదీ?....ఐతే మీరు ఇవ్వాళనించీ సెక్రటరీగా నిర్ణయింపబడ్డారు. మీజీతం—నేను బాగా యోచించి తర్వాత చెప్పుతాను.

మీరా:-నెలకు అరవై రూపాయలు-ప్రకటనలో వెయ్యనే వేస్తిరిగా.

అనంతం:- అరవై రూపాయలా! అసంభవం! సరే, ఆవ్యవహార మలా ఉంచండి. మీరు రోజూ బీచికి షికారుపోతారా?

మీరా:- ఉహుఁ. నిన్న భీమసేనరావుగారు నాస్నేహితురాలిని పిలిస్తేనూ, నేను కూడా వెళ్ళాను.

అనంతం:- అయితే, భీమసేనరావు మీకేమవుతాడు?

మీరా:- ఏమీ కాడు! స్నేహితుడు. నే నేయే పని చేయాలో తెలియజెప్పితే బాగుండదూ?

అనంతం:- పనా? పని ఏమంత ఎక్కువలేదు. ఒకటి రెండు ఉత్తరాలు టైపుచేయాలి—అంతే....సరే, మీరు హిందువులేనా—వేరేగా భావించక్కండి.

మీరా:- మేము బ్రాహ్మలం.

అనంతం:- (కొంచెంసేపు మౌనంగా ఉండి) నేను హిందువును. కాని, హిందువుకూ, బ్రాహ్మలకూ ఉన్నతేడా ఏమిటో నాకర్థంకాకుండా ఉంది.

మీరా:- నాకుకూడా.

(ఇద్దరూ నవ్వుతారు.)

గోవిందు:- (తలుపులోనించి తలపెట్టి) బాబూ! అందర్నీ చిటికెలమీద వెళ్ళగొట్టాను.

అనంతం:- భేష్! ఇక బయట పహరా ఉండు, ఎవ్వరూ రాకుండా.

(గోవిందుమాయమౌతాడు.)

మీరా:- అయితే ఇకవెళ్తాను. రేపటినించి పనిలో ప్రవేశిస్తాను.

అనంతం:- వెళ్తారా? అయితే-సరే. రేపు తప్పకుండా వస్తారుకదూ?

మీరా:- ఎందుకురానూ? సరిగ్గా పదింటికి వస్తాను.

అనంతం:- అక్కర్లేదు. మీకు ఇబ్బందిగా ఉంటే అంతతొందరగా రానక్కర్లేదు. పదకొండుకుగాని పన్నెండుకుగానీ వచ్చినా సరిపోతుంది.

మీరా:- అదేంమాట! సరిగ్గా వేళకు వస్తాను. పనిదగ్గర పాలుమాలికా? (లేచి) అయితే సెలవు, నమస్కారం!

అనంతం:- నమస్కారం! అయితే నిజంగానే పోతున్నారన్నమాట?

మీరా:- ఆఁ. రేపు వస్తాను.

(వెళ్ళుతుంది.)

అనంతం:- ఎంతచక్కటి పిల్ల! ఎంత చమత్కారంగా మాట్లాడుతుంది? మనదేశంలో ఇలాంటిపిల్లలు పుడతారని నాకు తెలియనే తెలియదు—కాని, అనతివాడితో తిరుగుతుం దెందుకూ? బ్రాహ్మలలో ఉన్నలోపమే అది! అడ్డమైనవాళ్ళతో ఆడపిల్లల్ని—స్నేహితుడట! మగవాళ్ళతో ఇంత స్నేహమెందుకూ?—గోవింద్—గోవింద్!

గోవిందు:- (వచ్చి) చిత్తం. అమ్మాయిగారిజాడా చిక్కిందా?

అనంతం:- మాయజాడా! భలే, ఆసంగతే నాకు జ్ఞాపకం రాలేదు. సరే. ఆసంగతి తర్వాత చూసుకుందాము, గోవింద్! ఈగది ఎంత ఖరాబుగా ఉందో చూడూ? వీటన్నిటినీ చక్కగా అమర్చు. బజారికి పోయి పూలు కొన్ని కొనుక్కురా. అంటే, మనకొత్త సెక్రిటరీకి ఏవేవి యిష్టమో అవన్నీ చేయాలి. (టైపిస్టుకుర్చీ వత్తిచూసి) కుర్చీ గట్టిగా ఉంది. కుషన్ ఉన్న చైర్ తీసుకురా, ఇంకా రెండుమూడు మొహమల్ దిళ్ళు—తెలిసిందా?

గోవిందు:- ఓ, చిటికెలమీద తెస్తాను—

## రెండో దృశ్యం

(నళిని గది. తొమ్మిదిన్నర ఘంటలవుతుంది. నళిని, మీరా ఉన్నారు.)

నళిని:- ఇన్నాళ్ళు నౌకరిచేశావ్, ఒక్కనాడన్నా మీ డిటెక్టివ్ సంగతి చెప్పవేమే?

మీరా:- ఏమి చెప్పేదీ? చెప్పటాని కేమీలేదు.

నళిని:- అలాగా! అతనికెన్నేళ్ళూ?

మీరా:- యాభై, అరవై ఉంటై.

నళిని:- నిజమా? చూపుల కెలాఉంటాడూ?

మీరా:- భూతంలాగా.

నళిని:- ఎద్దేవ చేస్తున్నావా, నన్ను!

మీరా:- నమ్మకపోతే ఒకరోజుపోయి చూసి రాకూడదూ?

నళిని:- నాకేమీ అవుసరంలేదు, నీకంత చెప్పటానికిష్టం లేకపోతే, నాకు అంతకంటే వింటానికిష్టంలేదు.

(ముఖం తిప్పుకు కూచుంటుంది)

మీరా:- మళ్ళీ కోపం వచ్చిందీ? కాస్తె సరసంకూడా ఆడకూడదు! సరే, నిజం చెప్తు తున్నాను విను, వయస్సు పాతికేళ్ళు, చూట్టానికి ఫర్వాలేదు—పెద్దమనిషిలాగానే ఉంటాడు. ముక్కుమాత్రం కొంచెం ఎత్తు—

నళిని:- (తిరిగి) నీతో ఏవిషయాలు మాట్లాడుతాడూ?

మీరా:- ఏవిషయాలూ మాట్లాడడు. నాపని నేను చేసుకుంటాను; ఆయనపని ఆయన చేసుకుంటాడు.

నళిని:- అసలే మాట్లాడుకోరా?

మీరా:- బొత్తిగా మాట్లాడుకోము.

నళిని:- అయితే అతను ముంచులాంటి వాడన్నమాట.

మీరా:- కాదు, గుడ్లగూబ రకం.

నళిని:- నువ్వు మాట్లాడకండా ఉండగలవూ?

మీరా:- ఏం, ఎందుకుండలేనూ? నే నీమధ్య గాంభీర్యం నేర్చుకున్నాను.

నళిని:- (కాసేపు అలాగే చూసి) నిజం చెప్పుతున్నాను మీరా! నువ్వీ మధ్య చాలా మారిపోయావు.

మీరా:- ఎందుకు మారనూ? ఇంకా నేను చిన్నపిల్లనే అనుకున్నావేమిటీ? ఇప్పుడు ఉద్యోగం చేస్తున్నాను, ఇంటిపనులు చూస్తున్నాను. ఎన్ని బాధ్యతలు నానెత్తిమీద! (లోలోన నవ్వుకుని) సరే; ఇక నీసంగతేమిటి? భీమసేనరావుతో నీ ప్రేమ ఎంతదూరం సాగింది?

నళిని:- ప్రేమ సాగటమేంటీ, నా మొహం?

మీరా:- అయితే వివరంగా చెప్తాను. నేనీమధ్య ఆఫీసులో వుంటున్నాను. భీమసేనరావూ నువ్వూ ప్రేమించుకోటంలో ఎంత దగ్గిరికివచ్చారో నాకు తెలియలేదు. చెప్తావా?

నళిని:- చెప్పటాని కేమీ లేదు. ప్రేమ ఒక ఎండమావి—దప్పికగొన్న స్త్రీపురుషులు దాని దగ్గరకు పరుగెత్తుకుపోతారు. అక్కడ ఏముంటుందీ, కాలే కాలే ఇసికా—

మీరా:- నువ్వు గనక వేదాంతం మొదలుపెడితే నేను వెళ్ళిపోతాను—

నళిని:- పోతావా?—సరేగాని మీరా, నువ్వెప్పుడన్నా ప్రేమలో పడ్డావా? ప్రేమ అంటే ఏమిటో చెప్పగలవా?

మీరా:- ఉహుం. నాకు ఆఫీసు టైమైంది, వెళ్ళుతున్నాను. (వెళ్లుతుంది)

నళిని:- మీరా అలా హఠాత్తుగా వెళ్ళిపోయిం దెందుకూ? దానిలో ఏమన్నా మార్పు వచ్చిందా? నిజంగానే ప్రేమలో పడలేదుకదా? మనిషిని మనిషి ఎందుకు ప్రేమిస్తారో అర్థం కావటంలేదు! మొహంచూసి ప్రేమించటానికి వీలుందా? మాటలువిని ప్రేమించవచ్చా? నేను భీమసేనరావుని ప్రేమించలేదు; అయినా మీరా నన్ను మాటిమాటికీ ప్రేమించావంటుంది! కాని, భీమసేనరావు నన్ను ప్రేమించాడా? బహుశా ప్రేమించినట్టుగానే వుంది. ఆ రోజున బీచివొడ్డున—ఆయన మొహంచూస్తే నాకే భయంవేసింది! చాలా కోపిష్టి అనుకుంటాను—

(ఆలోచనలో నవ్వుకుంటుంది. భీమసేనరావు వస్తాడు)

భీమ:- నమస్కారం ఇటుపోతూ, పోతూ ఒకమాటు చూసిపోదామనుకుని వచ్చాను.

నళిని:- కూచోండి.

భీమ:- కూచోను. నా కింకోచోటికి పోవలసిన పనివుంది. ఆ మనిషిజాడా దొరికేటట్టుంది.

నళిని:- ఏ మనిషి?

భీమ:- వాడే—మీబూటు విప్పదియ్యమన్నవాడు. వాడినే వెతుకుతున్నాను. వాడి ముముక్కు బద్దలుచెయ్యంది నాకు శాంతిలేదు. వస్తాను, నన నమస్కారం! మీమీరుమాత్రం జాగర్తగా వుండండి. (వెళ్ళుతాడు)

నళిని:- చిత్రమైన వ్యక్తి! ప్రేమించటమంటే ఇదేనా?—కాని నత్తివాడే—

## మూడో దృశ్యం

(అనంతం ఆఫీసు. ఒక ఉత్తరం చేతపట్టుకుని వుంటాడు. వేళ 10 గంటలు)

అనంతం:- ఉహుం. నాలో బొత్తిగా పాలుమాలిక వచ్చేసింది. ఈమధ్య మాయసంగతి మరిచేపోయాను. గోపాలయ్యగారు ఉత్తరంరాశారు.—ఏంచేయాలి! తప్పకుండా ఆపిల్లే మాయ; ఇందులో సందేహమేమీ లేదు; కాని ఋజువు ఎలాచేయటం? ఆపిల్ల మీరా స్నేహితురాలే. ఆమెని అడిగితే ఆపిల్ల కాలివి పుట్టుమచ్చవున్నదా అని? ఉహుం(అ....లా అడిగితే ఒక చిక్కువుంది. మీరా సందేహించవచ్చు నాకా పిల్లమీద........మరి ఎట్లా? ఏదో



విధంగా ఆ పిల్లజాడా తీయాలి. (తలకు వేళ్ళుపోనిచ్చి) ఏంచేయాలి? ఏదోవిధంగా మిస్ మీరానించే కొంత భోగట్టా రాబట్టాలి. కాని ఆమె ఇంకా రాలేదే! (గడియారంచూసి) పదిదాటి అయిదు నిమిషాలయింది. నిన్నకూడా రెండునిమిషాలు లేటు! ఇది చాలా ఘోరం— లేటు ఎందుకుకావాలి నిజానికి? ఏమాత్రం డిసిప్లను... (మీరా వస్తుంది)

మీరా:- (నవ్వుతూ) నమస్కారం.

అనంతం:- (గంభీరంగా) నమస్కారం. ఐదునిమిషాలు లేటు.

మీరా:- (తన గడియారం చూసుకుని) ఉహుం. ఇంకా మూడునిమిషాలు ముందుగానే వచ్చాను. మీ గడియారం ఫాస్టు.

అనంతం:- అసంభవం! ఏదీ మీ గడియారం?

మీరా:- (దగ్గిరికిపోయి) చూడండి.,

(చాపిన చెయ్యిపట్టుకుని అనంతం కాసేపు అలాగే మెదలకుండా చూస్తాడు. ఆ తర్వాత చెయ్యిఎత్తి చెవిదగ్గర పెట్టుకుంటాడు)

అనంతం:- అరే! మీ గడియారం నడుస్తున్నదె!

మీరా:- చెయ్యి వదలండి.

అనంతం:- (చెయ్యివదిలి) ఓ....మీచెయ్యి పట్టుకున్నసంగతే నాకు జ్ఞాపకంలేదు. నేను ఏదో ఆలోచిస్తున్నాను.

మీరా:- (తనచోటికి పోయి టైపురైటరు తీస్తూ) మీరెప్పుడూ ఆలోచిస్తూ వుంటారు. అంత ఆలోచన మంచిదికాదు.

అనంతం:- ఆలోచించక మార్గంలేదు! డిటెక్టివులు ఎల్లప్పుడూ ఆలోచించవలసిందే.

(మీరా పని ప్రారంభిస్తుంది. అనంతం ముగ్ధుడై అటేచూస్తూ వుండిపోతాడు. రెండునిమిషాలు గడిచింది)

అనంతం:- మిస్ మీరా!

మీరా:- (తలఎత్తి) ఏమండీ?

అనంతం:- ఏమిటి నువ్వు టైపుచేసేది?

మీరా:- 'సినిమా చోరీ' కేస్లు తయారుచేస్తున్నాను.

అనంతం:- ఏదీ?

మీరా:- అదేనండీ! రామశాస్త్రి అనేఆయన సినిమా టిక్కెట్టు కొంటుంటే ఆయన జేబులో పర్సు పోలా! తొమ్మిదణాల ముక్కాసీ—అకేసే.

అనంతం:- ఓ, జ్ఞాపకంవచ్చింది.

(మీరా మళ్ళీ టైపు మొదలు పెడుతుంది.)

అనంతం:- మిస్ మీరా!

మీరా:- ఏమండీ!

అనంతం:- నా బ్లూపెన్సిలు ఎక్కడ పోయిందీ!...చూస్తే ఇక్కడ ఆఫీసు సంగతి ఎవ్వరూ పట్టించుకునేటట్టు లేదు.

మీరా:- (లేచిపోయి) అదుగో మీ ఎదురుగానే ఉంది!

అనంతం:- ఓ—(పెన్సిలు తీసుకుని) అరే ఇదేనే బ్లూపెన్సిల్! ఎంత పొరపాటో చూడండి! చూపు వేరేవేపు ఉంటంమూలాన కనపడనే లేదు.

మీరా:- పెన్సిలు కావలసినప్పుడు టేబిలుమీద చూస్తే కనపడుతుంది! సరే, మీరెక్కడ చూస్తున్నారు, మిద్దెవేపా?

అనంతం:- ఉహుఁ. పరధ్యానంగా మీ టైపురైటరువంక చూస్తున్నాను.

(మీరా గంభీరముఖం పెట్టుకుని వెళ్ళి టైపురైటరుముందు కూచుంటుంది. కొన్ని క్షణాలు గడుస్తై.)

అనంతం:- మిస్ మీరా!

మీరా:- మళ్ళీ ఏమొచ్చిందండీ? నన్నేం పనిచేసుకోనివ్వరా?

అనంతం:- ఎంత చిత్రం!....మీపని మీరు చేసుకోండి....నాకొక సందేహం కలిగింది. అందుకని—

మీరా:- ఏమిటా సందేహం?

అనంతం:- సరేగాని, ఆవేళ బీచీలో మీవెంట ఒకఅమ్మాయి ఉండెనే ఆమె పేరేమిటి?

మీరా:- నళిని.

అనంతం:- నళినా? మాయకాదూ?

మీరా:- (ఆశ్చర్యంతో) మాయ ఎందు కవుతుందీ?

అనంతం:- అదికాదు—ఆమె సరిగ్గా లక్ష్మీవిగ్రహంలా ఉంటేనూ, మాయ అయి ఉంటుందేమోనని అనుకున్నాను!—ఆమె మీకు చాలాదగ్గరి స్నేహితురాలు కాదూ?

మీరా:- (పొడి గొంతుతో) ఎందుకో చెప్పండి ముందూ?

అనంతం:- ఊరకనే. తెలుసుకుందామని అడిగాను.

మీరా:- ఓ. నేనింకా లక్ష్మీ విగ్రహంలాంటి ఆమె ఆకారం చూసి మీరు మరచిపోలేకుండా ఉన్నారేమోననుకున్నాను.

అనంతం:- ఎట్లా నేను చెప్పేదీ! నేనందుకోసం అడగలేదు మిస్ మీరా!

(మీరా వడిగా పైపు చేస్తుంటుంది.)

అనంతం:- (కొంచెం ఉండి) మిస్ మీరా!

(మీరా లేచివచ్చి అనంతం ఎదురుగా కూచుంటుంది.)

మీరా:- ఇక చెప్పండి. మీరు వేయదలుచుకున్న ప్రశ్నలన్నీ ఒక్కమాటే కానివ్వండి.

అనంతం:- మీతో పరిచయమై ఎన్నాళ్ళయి ఉంటుందా అని నేను ఆలోచిస్తున్నాను.

మీరా:- (వేళ్ళు లెఖ్ఖపెట్టి) సరిగ్గా నెలా మూడు రోజులు.

అనంతం:- ఓ, అలాగా! సరిగ్గా జ్ఞాపకంచేశారు. నేను జీతంసంగతే మరిచిపోయాను. (డ్రాయీరులోంచి నోట్లుతీసి) తీసుకోండి.

మీరా:- ఇప్పుడు ఉంచండి. వెళ్ళేప్పుడు తీసుకుపోతాను.

అనంతం:- ఉహుఁ. ఇప్పుడే తీసుకు ఉంచుకోండి. నాకు చాలా మతిమరుపు. బహుశా వెళ్ళేప్పుడు జ్ఞాపకం ఉండకపోవచ్చు.

మీరా:- ఐతే ఇవ్వండి. (నోట్లుతీసుకుని) ఇదేమిటి? ఎంత ఇచ్చారు?

అనంతం:- మూడొందలు.

మీరా:- మూడువందలా! ఎందుకూ? నాజీతం అరవైయేగా?

అనంతం:- ఎవరు చెప్పిందీ, అరవై అనీ? అసంభవం:

మీరా:- మీరు ప్రకటనలో అరవై అనే వేస్తిరిగా!

అనంతం:- అది అచ్చుపొరపాటు. పేపర్లు ఎలాంటి తప్పులు వేస్తయ్యో మీకుతెలుసా?

మీరా:- నో, మిస్టర్ రావ్! నేను అరవైకంటే ఎక్కువ తీసుకోలేను.

అనంతం:- ఏమిటీ ఉపద్రవం! నేను అచ్చుతప్పని చెప్పుతుంటినిగా.

మీరా:- ఎందుకు చెప్పుతారు అబద్ధాలూ? అచ్చు తప్పుకాదు. అరవై రూపాయలకంటే ఒక్కదమ్మిడీ ఎక్కువ తీసుకుంటే నాకు మనశ్శాంతి ఉండదు. ఇదుగో మీడబ్బు మీరు తీసుకోండి.

(కొన్నినోట్లు తిరిగి ఇస్తుంది.)

అనంతం:- అయితే తీసుకోరన్నమాట?

మీరా:- ఉహుఁ.

అనంతం:- తీసుకోరూ?

మీరా:- ఉహుఁ.

అనంతం:- సరే, మీ ఇష్టమొచ్చినట్టు చెయ్యండి. నా ఆఫీసులో నామాట వినరన్నమాట. సరే, అదే మీకు ధర్మమైతే అట్లాగే కానివ్వండి.

(ఉదాసీనంగా కాళ్లుఎత్తి టేబిలుమీద పెడతాడు. మీరా తనచోటికిపోయి పని చేసుకోటం మొదలుపెడుతుంది)

అనంతం:- (పైవంకచూస్తూ) మగవాడిచేతిలో డబ్బువుంటే నానా దుర్బుద్ధులూ పుడతై. బహుశా ఒకనాడు తాగాలనికూడా కలగవచ్చు! గుర్రపు పందేలకుకూడా పోవచ్చు. ఇలాంటివి చేయకుండా చూడటానికి నాకు ఒక్క స్నేహితుడుకూడా లేదు.

మీరా:- (నీరుతిరిగిన కళ్ళతో) మిస్టర్ రావ్! నన్ను క్షమించండి. మీరు అలా మాట్లాడటం బాగాలేదు. మీ దగ్గర అరవైరూపాయలకు ఎక్కువ తీసుకోవటం, నా ఆత్మగౌరవానికి భంగం.

అనంతం:- అయితే అలాచేయమని ఎవరన్నారు? మీ ఆత్మగౌరవానికి భంగమొచ్చే పని నేనుమాత్రం ఎందుకు చేయమంటాను?

(గంభీరముఖంతో ఉదాసీనంగా లోపలికిపోతాడు)

మీరా:- ఆయన మనసులో ఉద్దేశమేమిటో నాకేమీ అర్థంకాలేదు. కాసేపు నవ్వుతూ మాట్లాడతాడు, మళ్ళీ అంతలోనే కోపం తెచ్చుకుంటాడు! మగవాళ్ళమనసు తెలుసుకోటం చాలా కష్టం!....కాని నళినిని గురించి ఆయన కంత కుతూహలమెందుకూ? సరిగ్గా అరనిమిషంకూడా చూడలేదే ఆవాళ, ఇంకా మరిచిపోలేకుండా వున్నాడు?—మరిచిపోలేకపోతేమాత్రం మనకొచ్చే దండగ ఏమున్నదీ? అయినా, ఈయన హిందువు, నళిని బ్రహ్మసమాజం—వీళ్ళిద్దరికీ ఎలా కుదురుతుందీ? పోనీ మనకెందుకొచ్చిన గొడవ ఇది. నా పని నేను చేసుకుపోతాను. నాకు రావలసిన దానికంటే దమ్మిడీకూడా ఎక్కువ తీసుకోను. ఆయన భాగ్యవంతుడైతే కావచ్చు, సర్దాకు డిటెక్టివు గిరీ తీసుకుంటే తీసుకోవచ్చు—అంత డబ్బు ఎక్కువవుంటే ఇతర్లకు పంచిపెట్టుకోనీ; నేనుమాత్రం తీసుకోను.

(మీరా పని మొదలుపెడుతుంది. అనంతం మెల్లగావచ్చి వెనక నుంచుంటాడు)

అనంతం:- మిస్ మీరా!

మీరా:- ఏమండీ?

అనంతం:- నన్ను క్షమించు. నీకు డబ్బు ఎక్కువ ఇవ్వబోవటం నాదే తప్పు.

మీరా:- ఉహుఁ. ఇందులో తప్పేముందీ? మీరు సదుద్దేశంతోటే ఇవ్వబోయారు.

అనంతం:- (మీరా భుజంమీద చెయ్యివేసి) చెప్పండి, నన్ను క్షమించారా?

మీరా:- (లేచి ఎడంగా నుంచుని, వణుకుతున్న గొంతుతో) అఁ. క్షమించాను.

అనంతం:- మీకింకా కోపం తగ్గలేదు.

మీరా:- నాకేమీ కోపంలేదు మిస్టర్ రావ్!

అనంతం:- ఐతే మరెందుకు నవ్వటంలేదు?

మీరా:- (మందహాసంచేసి) ఇదిగో నవ్వితినిగా.

అనంతం:- (ఆప్యాయంగా చేతులుచాపి) రండి, స్నేహం చేసుకొందాము—కోపంకాదు.

(ఇష్టం లేకపోయినా మీరా నవ్వుతుంది. ఆ తర్వాత చేతులుచాపి, అనంతం చేతులు పట్టుకుంటుంది)

అనంతం:- రండి—ఇవ్వాళ కొంచెం షికారుకుపోదాము, ఆఫీసులో ఏమీ బాగోలేదు.

మీరా:- ఎక్కడికీ?

అనంతం:- పీపుల్సు పార్కుకు. అక్కడ బోటుఎక్కి షికారుచేద్దాం.


మీరా:- ఉహుఁ—నాకు చాలా ఆలస్యమవుతుంది.

అనంతం:- ఏమీ ఆలస్యంకాదు. సరిగ్గా నాలుగుగంటలకు మీ ఇంటిదగ్గర వదులుతాను. (మీరా ఇంకా సమ్మతించదు) మీరు రాకపోతే నామీద కోపంగా వున్నారనుకుంటాను.


మీరా:- అయితే పదండి!

—సశేషం.







స్వ స్వాతంత్ర భావాలతో
నిర్మిస్తున్న




స్వతంత్ర ఫిలిమ్సు... మదరాసు 17




మద్రాసు బ్రాంచీ సెక్రెటరీ :

శ్రీ కె. పి. నాయక్

బెంగుళూరు.

బ్రాంచీలు :

కలకత్తా, ఢిల్లీ, అహమ్మదాబాదు, కరాచీ, లాహోరు, పెషావరు, సూరత్, ఇండోరు, నగరములలో గలవు.

ఏజెన్సీలకు దరఖాస్తు చేయుడు.




EASTERNS 379.




# బిటాకేఫిన్

(తలనొప్పి బిళ్లలు)

అన్ని నొప్పులను, జ్వరములను కుదుర్చును.

తలనొప్పి, పంటినొప్పి, కాళ్లనొప్పి, నిద్రలేకుండుట, కీళ్ళనొప్పులు, మలేరియా, స్త్రీల బహిస్టు నొప్పులు, అలసట వగైరా అన్నిటికి గ్యారంటీగా పనిచేయును. వాడుకొను విధము పొట్లములో నుండును.

పొట్లం 3 బిళ్లలు **1** అణా.

స్టాకిస్టులు: దాదా అండ్ కంపెనీ, పి. టి., మద్రాసు

తయారుచేయువారు:

**Bombay Tablet Manufacturing Co,**

**Post Box No. 2092, BOMBAY 2.**

## రీటా తలవెంట్రుకలను పెంచును



రీటా కుదుళ్ళకు బలమునిచ్చి, నిగనిగలాడు నిడుపాటి వెంట్రుకలను పెంచుటకు అద్భుతమైన హెయిర్ టానిక్. తల వెంట్రుకలు రాలుట, నెరయుట, చుండ్రు, బట్టతల, పేనుకొరుకు, ఇంకను తలవెంట్రుకలకు సంబంధించిన సమస్తవ్యాధులకు రీటా అమోఘముగ పనిచేయును. వేనకువేలు వాడి గుణమును పొందియున్నారు. మీరుకూడ నేటినుండి రీటాయే వాడుడు.

రీటా హిందూదేశమంతటా దొరకును. సీసా 15అ.

**RITA**

**HAIR TONIC**








లివర్ & స్ప్లీన్ వ్యాధుల చే బాధ పడుచు, యితర ఔషధములచే నివారింప బడజాలని శిశువులు వేలకొలది, యీ అద్భుతఔషధ రాజముచే రక్షింపబడిరి.

జమ్మి వెంకట రమణయ్యగారి

# లివర్ క్యూర్

జమ్మి వెంకటరమణయ్య గారి 'లివర్ క్యూర్' ప్రసిద్ధిగాంచిన వైద్యులు దీనిని వైద్య శాస్త్రములలోకెల్ల [illegible] గా శ్లాఘించుచున్నారు.

అన్ని షాపుల వద్ద దొరుకును లేనిచో క్రింది విలాసమునకు వ్రాయుడు.

జమ్మి వెంకటరమణయ్య & సన్సు
1/1, బ్రాడీస్ రోడ్డు, మైలాపూర్, మద్రాసు.
బ్రాంచి: బొంబాయి, కలకత్తా, లక్నో, బెంగళూరు, [illegible] వాల్లి విజయనగరములందు కూడ ఆఫీసులు గలవు.




అనేక సంవత్సరాలుగా భారత నారీమణులకు విశ్వసనీయంగా సేవచేసి, లోధ్ర పూర్తిగా ఆధారపడదగిన గర్భాశయ ఔషధమనే ప్రతిష్ఠ నార్జించి స్థిరపరచుకొన్నది.
లోధ్రను వాడితే మంచి ఆరోగ్యమూ, బలమూ చేకూరుతవి

EASTERNS 376

కేసరికుటీరం, లిమిటెడ్,
మదరాసు 14.


బి. ఎన్. కె. ప్రెస్, 37, ఆచారప్పన్ వీధిలో బి. నాగిరెడ్డిగారిచే ముద్రింపబడి, అదేచోట బి. ఎన్. గుప్తగారిచే ప్రకటించబడింది. సంపాదకుడు: చక్రపాణి.